శ్రీశ్రీ సినిమా పాటలు
రూ॥180/-
పేజీలు:180

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapakasham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



క్యూబాకు సంఘీభావంగా భారత్ మందులు 03

బిజెపిది రెండు నాల్కల ధోరణి

నీట్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



సంపుటి 09, సంచిక: 254 | గురువారం | 13-08-2026 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## చర్చ ప్రారంభమైతే ప్రశ్నలన్నింటికీ జవాబు

**పార్లమెంట్ వెలుపల అమిత్ షా ప్రకటన**
**స్పీకర్‌కు ప్రతిపక్షాలు అధికారిక లేఖ ఇవ్వాలని వ్యాఖ్య**




**న్యూఢిల్లీ:** నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల అమానుష చర్యకు సంబంధించి ప్రకటన చేసేందుకు గత 20 రోజులుగా నోరు మెదపని హోంమంత్రి అమిత్ షా బుధవారం ఒక్కసారిగా నిద్రలేచి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించారు. విద్యార్థుల నిరసనలు, సంబంధిత అంశాలపై చర్చ కోసం లోక్‌సభ స్పీకర్‌కు అధికారిక లేఖ సమర్పించాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. చర్చ వెంటనే ప్రారంభమైతే, అన్ని ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు తాను సభలో జరిగే మొత్తం చర్చా ప్రక్రియకు హాజరవుతానని ఆయన ప్రకటించారు. బుధవారం ఆయన పార్లమెంట్ భవన సముదాయంలో విలేకరులతో మాట్లాడుతూ, చర్చలో పాల్గొనాలా లేక పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించాలా అనేది ఇప్పుడు ప్రతిపక్షాల నిర్ణయంపైనే ఆధారపడి ఉందని ఆయన అన్నారు. 'బుధవారం మధ్యాహ్నం 2 గంటల లోపు వారు స్పీకర్‌కు లేఖ సమర్పించాలని నేను ఇప్పటికీ చెబుతున్నాను. మధ్యాహ్నం 3 గంటల నుండి గురువారం మధ్యాహ్నం 3 గంటల తరువాయి 8లో

## కట్టు కథలు, ఉపన్యాసాలు ప్రతిపక్షం వినబోదు

**ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ స్పష్టీకరణ**
**అమిత్ షా 'ఇమేజ్ బెలూన్' ఎప్పుడో పగిలిపోయిందని ఎద్దేవా**



**న్యూఢిల్లీ :** విద్యార్థుల నిరసనలపై చర్చ జరుపుతామని హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించడంపై ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసే దశలో ఆయన చేస్తున్న ప్రయత్నం చేస్తుండడంపై మండిపడ్డారు. ఆ బిజెపికి చెందిన ఇమేజ్ అనే బెలూన్ ఎప్పుడో పగిలిపోయందని, ఇప్పుడు అందులో గాలి నింపడానికి చేస్తున్న చివరి ప్రయత్నమని ఎద్దేవా చేశారు. నిరసనకారులైన విద్యార్థులపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరపాలని ఎవరు ఆదేశించారో తెలుసుకోవాలని యువత కోరుకుంటోందని రాహుల్ స్పష్టం చేశారు. బుధవారం రాహుల్‌గాంధీ పార్లమెంట్ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. పార్లమెంటులో షా చెప్పే కల్పిత కథనాలు, ఉపన్యాసాలు వినడానికి ప్రతిపక్షానికి ఆసక్తి లేదన్నారు. విద్యార్థులపై కాల్పులు జరపాలని షా ఆదేశించి ఉంటే ఆయన బాధ్యుడు అవుతారని, ఒకవేళ ఆదేశించకపోతే ఆయన అసమర్థుడని, ఏది ఏమైనా ఆయన రాజీనామా చేయాలని లోక్‌సభలోని తరువాయి 8లో

## ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ నుంచి

# ఎత్తిపోతలు చేపట్టండి




- గరిష్ట స్థాయిలో గోదావరి జలాల వినియోగం
- సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్టుల్లో ఎన్‌డిఎస్ఎ సూచనలు పాటించాలి
- పరిహారం, పునరావాసం చెల్లింపులు వేగవంతం చేయండి
- గూడెందొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుపై కన్సల్టెన్సీని నియమించండి
- నీటి పారుదల సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

గోదావరి జలాలను గరిష్ట స్థాయిలో వినియోగించుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎల్లంపల్లితో పాటు దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేరకు ఎత్తిపోతలు చేపట్టాలన్నారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి నీటి పారుదల శాఖపై సిఎం రేవంత్ రెడ్డి ఎంసిహెచ్‌ఆర్‌డిలో బుధవారం సమీక్ష నిర్వహించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్ఎ) సూచనల మేరకే సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో నీరు నిల్వ చేయడంలేదని, ఈ విషయంలో ఎన్‌డిఎస్ఎ సూచనలు పాటించాలన్నారు. మేడిగడ్డతో పాటు సుందిళ్ల బ్యారేజీలోనూ అనేక లోపాలు ఉన్నట్లు తేలిందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ విషయంలో ఎన్‌డిఎస్ఎతో సంప్రదించాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. దేవాదుల నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా 9 పంపులతో ఎత్తిపోతలు చేపట్టామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి ఎత్తిపోతలకు సంబంధించి ఏవైనా చిన్న చిన్న సమస్యలుంటే అధికారులు వాటి పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సిఎం సూచించారు. పలు ప్రాజెక్టుల కింద ఒకటి రెండు గ్రామాలు, కొద్దిపాటి వ్యవసాయ భూములకు పరిహారం చెల్లింపు అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించేందుకు కార్యాచరణ రూపొందించాలని సిఎం సంబంధిత అధికారులను ఆదేశించారు. నీటి పారుదల, రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ముంపు గ్రామాలు, పరిహారం, పునరావాసానికి సంబంధించి వాస్తవ నివేదిక రూపొందించాలని సిఎం ఆదేశించారు. తక్షణ ప్రభావం పడే గ్రామాలకు వెంటనే పరిహారం చెల్లించాలని సిఎం సూచించారు. అధికారులు ఆ పనులను పూర్తి చేస్తే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టుల్లో నీరు నింపే అవకాశం ఉంటుందని సిఎం తెలిపారు. గట్టు, గూడెందొడ్డి ఎత్తిపోతల తరువాయి 8లో

## మిల్లర్ల నుంచి బకాయిలు వసూలు చేయాల్సిందే

**విధివిధానాలు రూపొందించాలి : సిఎం**

రైస్ మిల్లర్ల నుంచి పూర్తి బకాయిలను వసూలు చేయాల్సిందేనని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించా రు. ప్రతి ధాన్యం గింజకు చెందిన బకాయిని వసూలు చేసే వి ధంగా విధివిధానాల రూపొందించాలని సూచించారు. వ్యాపా ర దృక్పథంతో మిల్లులు నడిపే వారితో సానుకూలంగా ఉంటామని, ఉద్దేశపూర్వకంగా ఎగవేతలకు ప్రయత్నించే వారితో కఠినంగా వ్యవహరిస్తామని సిఎం హెచ్చరించారు. పౌరసరఫరాల శాఖపై ఆ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి సిఎం రేవంత్ రెడ్డి ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో బుధవారం సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం వేల కోట్ల బకాయిలకు అవకాశం ఇచ్చి.. తిరిగి ఆ తప్పిదాన్ని తమ ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తోందని సిఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. మిల్లర్ల నుంచి బకాయిల వసూళ్లకు సంబంధించి తక్షణమే విధివిధానాల రూపకల్పనను పూర్తి చేసి ఆనివేదికను మంత్రివర్గ ఉప సంఘానికి సమర్పించాలని సూచించారు. మంత్రివర్గ ఉప సంఘం పరిశీలన తరువాయి 8లో

## జెపిసికి ఎఫ్‌సిఆర్‌ఎ బిల్లు



- బిల్లును ఉపసంహరించుకోవాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్
- నిరసనల మధ్యే జెపిసికి పంపే తీర్మానం ఆమోదం
- చట్టం మైనారిటీలు, ఎన్‌జిఒలను లక్ష్యంగా చేసుకుందని కాంగ్రెస్ ఆరోపణ
- ప్రతిపాదిత చట్టం మైనారిటీలకు వ్యతిరేకం కాదని రిజిజు
- జెపిసిలో 31 మంది సభ్యులు

**న్యూఢిల్లీ :**లోక్‌సభలో ఇటీవల ప్రవేశపెట్టిన విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లు (ఎఫ్‌సిఆర్‌ఎ)ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు ఆందోళన చేశాయి. అయితే విపక్ష సభ్యుల నిరసనల మధ్యే బిల్లును తదుపరి పరిశీలన కోసం 31 మంది సభ్యుల పార్లమెంట్ సంయుక్త కమిటీకి (జెపిసి) పంపాలంటూ లోక్‌సభ బుధవారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. మరోవైపు సభకు హోం మంత్రి అమిత్ షా హాజరు కావాలని ప్రతిపక్ష ఎంపిలు నినాదాలు చేశారు. హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ ప్రవేశపెట్టిన ఈ తీర్మానం ప్రకారం, లోక్‌సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10 మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తారు. లోక్‌సభ సభ్యులను స్పీకర్ ఓం బిర్లా నామినేట్ చేయగా, రాజ్యసభ సభ్యులను చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ నామినేట్ చేస్తారు. 2026లో జరిగే తరువాయి 8లో



## అక్రమ నగదు కేసులో జస్టిస్ వర్మ దోషి

**త్రిసభ్య దర్యాప్తు కమిటీ నివేదిక వెల్లడి**

**న్యూఢిల్లీ:** న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో భారీ మొత్తంలో అక్రమ నగదు నిల్వలపై దర్యాప్తు చేసిన లోక్‌సభ కమిటీ ఆయనను దోషిగా తేల్చింది. త్రిసభ్య కమిటీ నివేదికను కేంద్ర ప్రభుత్వం బుధవారం పార్లమెంటు ఉభయ సభల ముందుకు తెచ్చింది. ఆయనపై వచ్చినవి ఆరోపణలు కాదని, వాటికి రుజువులు ఉన్నాయని పేర్కొంటూ కమిటీ నివేదిక జస్టిస్ వర్మను దోషిగా పేర్కొంది. ఆయన అధికారిక నివాసంలో భారీమొత్తంలో ఉన్న లెక్కల్లో చూపించని కరెన్సీ కట్టలు దగ్ధమైన ఘటన తీవ్ర అలజడి సృష్టించింది. ఆసమయానికి జస్టిస్ వర్మ ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నారు. తర్వాత ఆయనను మాతృస్థానానికి తిరిగి బదిలీ చేసి విచారణ చేపట్టారు. నిలదీసినప్పుడు ఆయన మాటలలో, తరువాయి 8లో

## లీకేజీల పేరిట విద్యార్థుల భవిష్యత్, మేధస్సు దొంగిలిస్తారా?

- అయోధ్య రామాలయ విరాళాల దొంగలెవరో బహిర్గతం చేయాలి
- దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్న మోదీ సర్కార్
- పాదయాత్రలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆగ్రహం

ప్రజాపక్షం / కరీంనగర్ / జమ్మికుంట




విద్యార్థులు కష్టపడి కోచింగ్‌లు తీసుకొని పరీక్షలు రాస్తే లీకేజీల పేరిట వారి భవిష్యత్‌తోపాటు వారి మేధస్సును దొంగిలిస్తారా అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివ రావు ప్రశ్నించారు. మోదీ, అమిత్ షా ఇద్దరూ కలిసి దేశంలో మతోన్మాదం సృష్టిస్తూ కులం,మతం పేరుతో హిందుత్వాన్ని ముందు పెట్టి జై శ్రీరామ్ అంటూ దేశ ప్రజల భవిష్యత్‌ను నాశనం తరువాయి 12లో







**బారాబంకీలో ఘనంగా ఉత్సవాలు ప్రారంభం**

## స్వాతంత్రోద్యమంలో ఎఐఎస్ఎఫ్‌ది గర్వించే చరిత్ర

**ఎఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలలో మాజీ నేత అమర్‌జీత్ కౌర్**



**బారాబంకీ :** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్)90వ వ్యవస్థాపక వార్షికోత్సవాన్ని బారాబంకిలో ఘనంగా నిర్వహించారు. గాంధీభవన్‌లో జరిగిన ఈ ఉత్సవాల కు 23 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. తొలుత ఎఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. జెండా ఆవిష్కరణతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం ఎఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు విరాజ్ దెవాంగ్, ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీరంగరాజన్ నేతృత్వంలో గాంధీ భవన్ నుండి పటేల్ తిరాహా, లఖ్‌పేడాబాగ్ చౌరస్తా మీదుగా ప్రదర్శన బయలుదేరి, నాకా సత్రిఖ్ చౌరస్తాకు చేరకుంది. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి ఎఐఎస్ఎఫ్ నేతలు పూలమాల వేశారు. అనంతరం వారు తిరిగి గాంధీ భవన్‌కు తరువాయి 7లో




## జైలులో ఇమ్రాన్‌ఖాన్ మరణించారా?

**పాకిస్థాన్‌లో వదంతులు : ఆందోళన**

**ఇస్లామాబాద్:** మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ మరణించారంటూ పాకిస్థాన్‌లో వదంతులు వచ్చాయి. దీంతో ఆ దేశంలో తీవ్ర ఆందోళన, అలజడి మొదలైంది. పాకిస్థాన్ జర్నలిస్టు వజాహత్ సయీద్ ఖాన్ ఈ వార్తను వ్యాప్తి చేశారు. రావల్పిండిలోని అడియాలా జైలులో ఇమ్రాన్‌ఖాన్ మగ్గిపోతున్నారు. కుటుంబ సభ్యులు కూడా ఆయనను కలుసుకోవడానికి అనుమతి ఇవ్వడం లేదు. జైలులో ఆయనను కలుసుకుని మాట్లాడేందుకు అనుమతి ఇవ్వకపోతే దేశవ్యాప్తంగా పెద్ద ఆందోళన ప్రారంభిస్తామని పిటిఐ పార్టీ ప్రభుత్వానికి హెచ్చరిక చేసింది. ఖైబర్ పఖ్తుంఖ్వా ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిది మాట్లాడుతూ, ప్రభుత్వం స్పందించకపోతే తరువాయి 8లో

## చర్చకు సిద్ధమంటారు... సభకు మాత్రం రారు!

**బాధ్యత తప్పించుకునేందుకు హోం మంత్రి అమిత్ షా విచిత్ర విన్యాసాలు**



ప్రజాపక్షం జనరల్ డెస్క్

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు నేటితో పూర్తి కానున్నాయి. అయితే, ఇప్పటి వరకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాలు మాత్రం ఉభయ సభలు జరుగుతున్న సమయంలో సభకు హాజరుకాలేదు. బుధవారం నాడు హోం మంత్రి అమిత్ షా 'తమ ప్రభుత్వం ఏ అంశం పైనైనా చర్చించేందుకు సిద్ధంగా ఉందని, నీట్‌పై చర్చ జరగాలని ప్రతిపక్షాలు మొదటి నుంచి కోరుతున్నాయని, వారి డిమాండ్‌కు ప్రభుత్వం కూడా సిద్ధంగా ఉందని' అన్నారు. ప్రతిపక్షాలు అంగీకరిస్తే మధ్యాహ్నం 3 గంటల లోగా స్పీకర్‌కు చర్చ కోసం నోటీసు ఇస్తే, మరుసటి రోజు మధ్యాహ్నం 3గంటల వరకు చర్చ జరిపి, దానికి స్వయంగా తానే సమాధానమిస్తానని కూడా అన్నారు. ఈ మేరకు స్పీకర్‌కు కూడా ఆయన లేఖ రాశారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన జులై 20న విద్యార్థులపై లాఠీఛార్జి జరిపి, పెల్లెట్ గన్‌ల తరువాయి 8లో



## క్యూర్ పరిధిలో నేడు ఇందిరమ్మ టవర్స్‌కు శ్రీకారం

- కూకట్‌పల్లిలో శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి
- లక్ష ఇళ్ల నిర్మాణం ప్రభుత్వ లక్ష్యం
- తొలి విడతలో రూ. 807.40 కోట్లతో 16 నియోజకవర్గాల్లో 8 వేల ఇళ్ల నిర్మాణం
- అర్హులైన పేదలకు పారదర్శకంగా లక్కీడిప్ ద్వారా కేటాయింపు

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ మహానగరంలో ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల కలను సాకారం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం మరో చరిత్రాత్మక అడుగు వేస్తోంది. హైదరాబాద్ పరిధిలో మొత్తం లక్ష ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ఇందిరమ్మ టవర్స్' నిర్మాణానికి గురువారం సాయంత్రం కూకట్‌పల్లిలో నియోజకవర్గంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. క్యూర్ పరిధిలో 12 వేల ఫ్లాట్లతో పైలట్ ప్రాజెక్టును తరువాయి 8లో

# ఎఫ్‌సిఆర్ఎ బిల్లు : జెపిసి బాధ్యత

విదేశీ విరాళాల నియంత్రణ కొత్త విషయమేమీ కాదు. విదేశీ నిధులు దేశీయ రాజకీయాలు, మతపరమైన కార్యకలాపాలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యావైద్య రంగాల్లో ఎలా ఉపయోగిస్తున్నారో ప్రభుత్వం పర్యవేక్షించడంలో తప్పులేదు. విదేశీ నిధుల పేరుతో అక్రమ కార్యకలాపాలు జరిగితే వాటిని అడ్డుకోవాలి. అవి దేశాన్ని ప్రమాదంలోకి నెట్టే ప్రయత్నాలకు వినియోగించడాన్ని నివారించాలి. ఇందులో అటు ప్రభుత్వానికీ, ఇటు ప్రతిపక్షాలకీ సూత్రప్రాయంగా కూడా అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదు. అయితే, తాజా గా ప్రతిపాదించిన 'విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ' (ఎఫ్‌సిఆర్ఎ) బిల్లు విషయంలో రేగుతున్న వివాదం ఇందుకు భిన్నమైనది. ఈ వివాదం విదేశీ నిధుల నియంత్రణ అవసరమా లేదా అనే అంశంపైకాదు, నియంత్రణ పేరుతో ప్రభుత్వానికి ఎంత విస్తృతమైన అధికారం ఇవ్వాలి, ఆ అధికారం ఎలా వినియోగించాలి, ఒక సంస్థ ఎఫ్‌సిఆర్ఎ రిజిస్ట్రేషన్ కోల్పోతే దాని ఆస్తుల పరిస్థితి ఏమిటి, ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సంస్థకు ఎంత బలమైన న్యాయపరమైన రక్షణ ఉంటుంది అనే ఎన్నో ప్రశ్నలకు సంబంధించింది. అందుకే, ఈ బిల్లును ప్రస్తుత రూపంలో ఉపసంహరించుకోవాలని, కనీసం విస్తృత పార్లమెంటరీ పరిశీలనకు పంపాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. గత్యంతరం లేక, బిల్లును 31 మంది సభ్యులతో కూడిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి)కి పంపేందుకు లోక్‌సభలో కేంద్రం తీర్మానం తీసుకురావాల్సి వచ్చింది. ఈ పరిణామం ప్రతిపక్షాల అభ్యంతరాలకు కనీసం పార్లమెంటరీ పరిశీలన అవసరమన్న స్థాయిలో రాజకీయ ప్రాముఖ్యత ఉందని స్పష్టం చేస్తున్నది. ఈ బిల్లులోని అత్యంత వివాదాస్పదమైన అంశం కొత్తగా ఏర్పడబోయే అధికారిక సంస్థ. అంటే, ఏదైనా సంస్థ ఎఫ్‌సిఆర్ఎ సర్టిఫికెట్‌ను కోల్పోయినా, స్వచ్ఛందంగా అప్పగించినా, లేదా దాని గడువు ముగిసినా ఆ సంస్థకు సంబంధించిన విదేశీ నిధులు, ఆ నిధులతో ఏర్పడిన ఆస్తులు ఈ అధికార సంస్థ ఆధీనంలోకి వెళతాయి. నిర్ణీత వ్యవధిలో సంస్థ కొత్త రిజిస్ట్రేషన్ పొందకపోతే లేదా పాత రిజిస్ట్రేషన్ పునరుద్ధరించుకోకపోతే ఆ ఆస్తులు శాశ్వతంగా ప్రభుత్వ నియమించిన అధికార సంస్థ ఆధీనంలోకి వెళ్లవచ్చు. ఆ తర్వాత వాటిని ప్రభుత్వ శాఖలకు బదిలీ చేయవచ్చు లేదా విక్రయించవచ్చు. విక్రయం ద్వారా వచ్చిన మొత్తాన్ని 'కన్సాలిడేటెడ్ ఫండ్'లో జమ చేయవచ్చు.

ఇక్కడ రెండు వేరువేరు అంశాలు తెరపైకి వస్తున్నాయి. మొదటికి ఒక సంస్థకు విదేశీ నిధులు స్వీకరించే అనుమతి లేకపోవడం, రెండవది ఆ సంస్థకు చెందిన ఆస్తిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం. ఒక స్వచ్ఛంద సంస్థ విదేశీ విరాళాలతో ఒక ఆసుపత్రిని నిర్మించి, ఆ తర్వాతి సంవత్సరాల్లో దేశీయ నిధులతో దాన్ని నిర్వహిస్తుండగా, ఒకవేళ ఆ సంస్థ ఎఫ్‌సిఆర్ఎ రిజిస్ట్రేషన్‌ను పునరుద్ధరించకపోతే ఆ ఆసుపత్రి కూడా ప్రభుత్వ నియమించిన అధికార సంస్థ ఆధీనంలోకి వెళ్లే అవకాశం బిల్లు కల్పిస్తోంది. ఈ అంశాన్ని ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. విదేశీ నిధుల వినియోగంలో తప్పు జరిగిందని నిరూపించకుండా, కేవలం రిజిస్ట్రేషన్ గడువు ముగిసిందనే కారణంతో ఆస్తిపై ప్రభుత్వం ఎందుకు హక్కు సాధించాలి? అనేది పాలనాపరమైన చిన్న ప్రశ్న కాదు. ఒక ఆసుపత్రి, పాఠశాల, వృద్ధాశ్రమం, అనాథాశ్రమం లేదా సామాజిక సేవా కేంద్రం ఒకసారి ఏర్పడిన తర్వాత దాని సేవలు వేలాదిమందితో ముడిపడి ఉంటాయి. దాని నిర్మాణానికి ఎప్పుడో విదేశీ నిధులు ఉపయోగించారని చెప్పి, అనేక సంవత్సరాల తర్వాత దాని యాజమాన్యాన్ని మార్చడం ఆస్తి హక్కు, సంస్థ స్వయం ప్రతిపత్తి, ప్రజా ప్రయోజనం వంటి అంశాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ప్రతిపక్షాలు ఈ బిల్లును మైనారిటీలు, ముఖ్యంగా క్రైస్తవ సంస్థలకు మరియు విదేశీ నిధులపై ఆధారపడే స్వచ్ఛంద సంస్థ (ఎన్‌జిఒ)లకు ప్రమాదకరంగా చూస్తున్నాయి.

'అధికార కేంద్రీకరణ' అనే ప్రమాదాన్ని ఈ బిల్లు సూచిస్తున్నది. ఎఫ్‌సిఆర్ఎ సర్టిఫికెట్‌ను రద్దు చేసే అధికారాలు ఇప్పటికే ప్రభుత్వానికి ఉన్నాయి. కొత్త బిల్లు ఆ రిజిస్ట్రేషన్ స్థితితో అనుసంధానించి ఆస్తులపై కూడా చర్య తీసుకునే వ్యవస్థను రూపొందిస్తోంది. అంటే పరిపాలనా నిర్ణయం ఒక సంస్థ ఆర్థిక కార్యకలాపాలను నిరోధించడంతో ఆగకుండా, దాని ఆస్తుల భవిష్యత్తును కూడా నిర్ణయించే స్థాయికి వెళ్తుంది. ఇలాంటి అధికారానికి బలమైన అప్పీల్ వ్యవస్థ, స్వతంత్ర న్యాయపరమైన సమీక్ష, సహజ న్యాయ సూత్రాలు తప్పనిసరిగా ఉండాలి. ఎఫ్‌సిఆర్ఎ నుంచి వైదొలగినప్పటికీ, ఆయా సంస్థల ఆస్తులను తాత్కాలికంగా స్వాధీనం చేసుకునే అవకాశం ప్రభుత్వానికి ఉంటుందనేది మరో కీలకమైన అంశం. ఒక సంస్థ విదేశీ నిధులు తీసుకోవడం ఆపేసి దేశీయ నిధులతో తన కార్యకలాపాలను కొనసాగించినా, గతంలో విదేశీ నిధులతో నిర్మించిన ఆస్తులపై ఈ నిబంధన ప్రభావం చూపవచ్చు. శిక్ష అనేది నేరానికి అనుగుణంగా ఉండాలి. పరిపాలనా లోపం, రిజిస్ట్రేషన్ పునరుద్ధరణలో సమస్య, పత్రాల లోపం వంటి కారణాలకు సంస్థ ఆస్తుల శాశ్వత నష్టం అనేది సముచితమైన శిక్షా విధానమా? అన్నది జెపిసి ప్రశ్నించాలి. ఒక బిల్లు ఎన్‌జిఒలు, మత సంస్థలు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, సామాజిక సేవా వ్యవస్థలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నప్పుడు, వాటి ప్రతినిధులను పిలిచి అభిప్రాయాలు తీసుకోవడం పార్లమెంటరీ ప్రక్రియలో భాగం. న్యాయ నిపుణులు, ఆర్థిక నియంత్రణ నిపుణులు, ఎన్‌జిఒలు, రాష్ట్ర ప్రభుత్వాలు, మత సంస్థలు, మానవహక్కుల సంస్థలను సంప్రదించకుండా, అభిప్రాయాలు పొందకుండా బిల్లును రూపొందించడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ పోకడలకు నిదర్శనం. ఆస్తుల స్వాధీనం, పరిపాలనా అధికారాల విస్తరణ, రిజిస్ట్రేషన్ గడువు ముగిసిన సందర్భాల్లో ఆస్తులపై చర్య, న్యాయపరమైన అప్పీల్, మైనారిటీ సంస్థలపై సంభావ్య ప్రభావం వంటి అంశాలపై సమగ్ర పరిశీలన జరగాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌కు ప్రజాస్వామ్యపరమైన, చట్టపరమైన ప్రాతిపదిక ఉంది. జెపిసి ఈ బాధ్యతను సమర్థంగా పూర్తిచేసి, కేంద్ర ప్రభుత్వ ఒంటెత్తు విధానాలకు అడ్డుకట్ట వేయాలి. ●



## చైర్మన్ పదవికి మరోసారి పోటీ చేయను

**టాటాసన్స్ చైర్మన్ పదవీకాలం పూర్తయిన తరువాత మరొకసారి ఆ పదవికి పోటీపడను. నా వారసుడ్ని అన్వేషించి సజావుగా, సక్రమంగా నియామక ప్రక్రియ జాప్యం లేకుండా పూర్తిచేయాలి. నా కెరీర్‌లో పూర్తి సంతృప్తి చెందా. ఇక పదవీ విరమణ తీసుకుంటున్నా.**

– ఎన్.చంద్రశేఖరన్

# నేరం నిరూపణకు ముందే శిక్ష ఎందుకు?

ఒక ఆరోపణ, ఒక చట్టపరమైన ప్రక్రియ, ఒక కుటుంబం ఎదురుచూపులు. క్రిమినల్ న్యాయ వ్యవస్థలో ప్రతి అడుగు ఒక వ్యక్తి జీవితాన్ని, అతని కుటుంబ పరిస్థితులను, సమాజంలో అతనిపై ఏర్పడే అభిప్రాయాలను ప్రభావితం చేసే శక్తి కలిగి ఉంటుంది. ఆరోపణ నమోదైన క్షణం నుంచి దర్యాప్తు వరకు, అరెస్టు నుంచి రిమాండ్ వరకు, బెయిల్ నుంచి తుది తీర్పు వరకు జరిగే ప్రతి దశలో చట్టం, సాక్ష్యాలు, వ్యక్తిగత స్వేచ్ఛ, మానవీయ విలువల మధ్య సమతుల్యత అత్యంత కీలకం. ఇది కేవలం ఒక కేసు ప్రయాణం కాదు; ఒక మనిషి రాజ్యాంగ హక్కులు, ఒక కుటుంబం ఎదుర్కొనే ఆందోళన, ఒక సమాజం న్యాయ వ్యవస్థపై ఉంచే విశ్వాసానికి సంబంధించిన ప్రశ్న. ఎందుకంటే చట్టం ముందు ప్రతి ఆరోపణకు సమాధానం సాక్ష్యాల ఆధారంగానే రావాలి. ప్రజాస్వామ్యంలో అసలైన పరీక్ష ఎన్ని చర్యలు తీసుకున్నారనే దానిలో కాదు.. ఆ చర్యలు ఎంత నిష్పాక్షికంగా, చట్టబద్ధంగా, మానవీయ దృష్టితో అమలయ్యాయనే దానిలో ఉంటుంది.

**అధికారానికి హద్దులు, బాధ్యతకు ప్రాధాన్యత**

పోలీసులకు అరెస్టు చేసే చట్టబద్ధమైన అధికారం ఉన్నప్పటికీ, అది అపరిమితమైన అధికారం కాదు. ఆ అధికారం రాజ్యాంగ విలువలు, చట్టపరమైన ప్రమాణాలు, న్యాయ సమీక్షకు లోబడి ఉండే బాధ్యతాయుతమైన చర్య. జోగిందర్ కుమార్ వర్సెస్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం (1994) తీర్పులో సుప్రీంకోర్టు, అరెస్టు చేసే అధికారం ఉందని ప్రతి సందర్భంలో అరెస్టు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. భారతీయ నాగరిక సురక్షా సంహిత, 2023 లోని సెక్షన్ 35 కూడా అరెస్టు కారణాల నమోదు వంటి అంశాలకు సంబంధించి చట్టపరమైన ప్రమాణాలను నిర్దేశించింది. అయితే మరోవైపు, సాక్ష్యాల పరిరక్షణ, నేరాల నియంత్రణ, బాధితుల భద్రత వంటి అంశాల దృష్ట్యా అవసరమైన సందర్భాల్లో అరెస్టు చట్టపరమైన చర్యగా మారవచ్చని వ్యవస్థ గుర్తిస్తుంది. అందుకే చట్టం చెప్పే సమతుల్య సూత్రం స్పష్టమైనది. అరెస్టు అనేది అవసరం, ఆధారాలు, చట్టపరమైన ప్రమాణాల ఆధారంగా జరగాలి. ఎందుకంటే ప్రతి అరెస్టు వెనుక ఒక కేసు మాత్రమే కాదు.. ఒక కుటుంబం ఎదుర్కొనే భయం, అనిశ్చితి కూడా ఉంటుంది.

**మీడియా, సమాజం, నిజమైన న్యాయం**

డిజిటల్ యుగంలో ఒక అరెస్టు లేదా కేసుకు సంబంధించిన సమాచారం క్షణాల్లో ప్రజల్లోకి చేరుతుంది. భారత ప్రెస్ కౌన్సిల్ రూపొందించిన పత్రికా నైతిక ప్రవర్తనా మార్గదర్శకాలు ప్రకారం, న్యాయస్థానాల్లో విచారణలో ఉన్న కేసుల విషయంలో మీడియా సంయమనం, బాధ్యతాయుతమైన వైఖరి, నిష్పాక్షికతను పాటించాలి. వాస్తవాలను ఆధారంగా చేసుకుని ప్రజలకు సమాచారం అందించడం, బాధితుల సమస్యలను ప్రజల దృష్టికి తీసుకురావడం, ప్రజా ప్రయోజన అంశాలను ప్రశ్నించడం మీడియా బాధ్యత. అదే సమయంలో విచారణ పూర్తికాకముందే ఎవరినైనా నేరస్థుడిగా చిత్రీకరించడం న్యాయ సూత్రాలకు విరుద్ధం. బాధ్యతాయుతమైన జర్నలిజం న్యాయ ప్రక్రియకు అడ్డంకి కాదు, అది ప్రజల్లో చట్ట అవగాహన పెంచే వ్యవస్థపై విశ్వాసాన్ని బలోపేతం చేసే ప్రజాస్వామ్య శక్తి. చట్టం, మానవత్వం, మీడియా ఈ మూడు సమతుల్యంగా నడిచినప్పుడే సమాజంలో నిజమైన న్యాయ భావన బలపడుతుంది.

క్రిమినల్ న్యాయ వ్యవస్థ బలం ఎన్ని అరెస్టులు జరిగాయనే దానిలో లేదు. ప్రతి కేసులో చట్టం ఎంత నిష్పాక్షికంగా, న్యాయబద్ధంగా పనిచేసిందనే దానిలో ఉంది. న్యాయం అనేది కేవలం నేరస్థుడికి శిక్ష విధించడం మాత్రమే కాదు, నిర్దోషి హక్కులను రక్షిస్తూ, బాధితుడికి న్యాయం అందించే సమతుల్య వ్యవస్థ. అరెస్టు ఒక దర్యాప్తు దశ మాత్రమే, రిమాండ్ ఒక న్యాయ ప్రక్రియ మాత్రమే, బెయిల్ ఒక తాత్కాలిక ఉపశమనం మాత్రమే. ఈ ప్రతి దశలో చట్టం రాజ్యాంగ విలువలకు అనుగుణంగా, మానవీయ దృష్టితో ముందుకు సాగినప్పుడే ప్రజల్లో న్యాయవ్యవస్థపై విశ్వాసం మరింత బలపడుతుంది.

**ఆరెల్లి మల్లేష్,** అడ్వొకేట్,
ఎంఎ, బిఎడ్, ఎల్ఎల్ఎం, 9908702418

# 'ఇ 20' వాడకం కాదు.. అమలు విధానమే ఆక్షేపణీయం

ఆర్. సూర్యమూర్తి

భారతదేశంలో 'ఇ 20' పెట్రోల్‌పై చర్చను ఇథనాల్ మంచిదా, చెడ్డదా? అనే ప్రశ్నకు పరిమితం చేయడం అనేది అసలు సమస్యను తప్పుదోవ పట్టించడమే. ఇథనాల్‌ను పెట్రోల్‌లో కలపడం వెనుక ప్రభుత్వం చూపిస్తున్న ఆర్థిక, వ్యూహాత్మక కారణాలకు బలమైన ఆధారం ఉంది. అదే సమయంలో వాహనదారులు, వినియోగదారులు లేవనెత్తుతున్న సందేహాలను అపోహలుగా కొట్టిపారేయడం కూడా సరైంది కాదు. ఇక్కడ ప్రశ్న ఇథనాల్ గురించి కాదు. ఒక భారీ జాతీయ విధానాన్ని అమలు చేసేటప్పుడు ప్రభుత్వం ప్రజలను ఎంతవరకు భాగస్వాములుగా చూసింది అన్నదే కీలకం. 'ఇ 20' అంటే పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్‌ను కలపడం. భారత్ గత దశాబ్దంలో ఇథనాల్ బ్లెండింగ్‌ను వేగంగా పెంచింది. 2013–14లో పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమం కేవలం 1.53 శాతం ఉండగా, 2025–26 ఇథనాల్ సప్లై ఇయర్‌లో అది 20 శాతానికి చేరింది. 2030 నాటికి చేరుకోవాలని మొదట నిర్ణయించిన లక్ష్యాన్ని భారత్ ఐదేళ్ల ముందుగానే సాధించింది. ఇది భారత ఇంధన విధానంలో గణనీయమైన మార్పు. కానీ ఈ విజయాన్ని అంచనా వేయడానికి బ్లెండింగ్ శాతాన్ని మాత్రమే చూడలేం. ప్రజల అనుభవాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. 'ఇ 20' నిర్ణయం కేవలం ప్రయోగాత్మకంగా మాత్రమే అమలు జరుగుతున్నదని సుప్రీం కోర్టులో అటార్నీ జనరల్ పేర్కొంటే, కేంద్ర ప్రభుత్వం వెంటనే దిద్దుబాటు ప్రకటన చేసింది. ఇథనాల్ సేకరణ విధానాన్ని ప్రయోగాత్మకంగా చేపడుతున్నామే తప్ప, ఇథనాల్ వాడకాన్ని కాదని తేల్చిచెప్పింది. కానీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇప్పుడు దేశవ్యాప్తంగా సామాన్యుడి ప్రశ్నలు ప్రతిధ్వనిస్తున్నాయి.

మన దేశం చమురు అవసరాల్లో భారీగా దిగుమతులపై ఆధారపడుతోంది. అంతర్జాతీయ ముడిచమురు ధరలు పెరిగినప్పుడు దాని ప్రభావం కేవలం పెట్రోల్ ధరలకే పరిమితం కాదు. విదేశీ మారకద్రవ్య వ్యయం పెరుగుతుంది, రూపాయిపై ఒత్తిడి వస్తుంది, వాణిజ్య లోటు విస్తరిస్తుంది, ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉంటుంది. రష్యా–ఉక్రేన్ యుద్ధం, పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ఎర్ర సముద్రంలో నౌకాయానానికి ఎదురైన సమస్యలు ఈ ప్రమాదాన్ని మరింత స్పష్టంగా చూపించాయి. చమురు కోసం ప్రపంచ మార్కెట్‌పై అధికంగా ఆధారపడే దేశానికి ఇంధన భద్రత ఆర్థిక అంశమే కాకుండా, వ్యూహాత్మక అంశంగా కూడా మారుతుంది. ఈ నేపథ్యంలో దేశంలోనే ఉత్పత్తి చేసే ఇథనాల్‌ను పెట్రోల్‌లో కలపడం ప్రభుత్వానికి సహజమైన వ్యూహంగా కనిపించింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, ఇథనాల్ బ్లెండింగ్ ద్వారా 316 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ముడిచమురు దిగుమతులను భర్తీ చేయగలిగింది. దాదాపు రూ. 1.98 లక్షల కోట్ల విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేసింది. రైతులకు రూ. 1.66 లక్షల కోట్లకు పైగా ఆదాయం లభించిందని, దాదాపు 952 లక్షల మెట్రిక్ టన్నుల కర్బన (కార్బన్‌డైయాక్సైడ్) ఉద్గారాలను తగ్గించిందని ప్రభుత్వం చెబుతోంది. నిజానికి ఈ గణాంకాలను విస్మరించడానికి కారణం లేదు. ఇథనాల్ కార్యక్రమం భారతదేశానికి ఇంధన భద్రత, రైతుల ఆదాయం, విదేశీ మారకద్రవ్య పొదుపు వంటి రంగాల్లో స్పష్టమైన ప్రయోజనాలు అందించింది. కాబట్టి 'ఇ 20' ఆలోచనలోనే తప్పు ఉందని చెప్పలేం. కానీ, సమస్య ఇథనాల్‌లో కాదు.. పెట్రోల్‌లో 20 శాతం చేర్చాలన్న నిర్ణయాన్ని అమలు చేసిన విధానంలో ఉంది. ప్రభుత్వం ఒక విధానాన్ని దేశ ప్రయోజనంగా చూస్తుంది. సాధారణ పౌరుడు మాత్రం దాని ప్రభావాన్ని తన జీవితంలో ఎలా అనుభవిస్తున్నాడో చూస్తాడు. ఇథనాల్ బ్లెండింగ్ వల్ల దేశానికి విదేశీ మారకద్రవ్య ఆదా కావచ్చు. రైతులకు ఆదాయం పెరగవచ్చు. దిగుమతులపై ఆధారం తగ్గవచ్చు. ఇవన్నీ సామూహిక ప్రయోజనాలు. కానీ ఒక వాహనదారుడి కి మైలేజ్ తగ్గితే ఆ ఖర్చు నేరుగా అతని జేబుపై పడుతుంది. దీని వల్ల మూడు నుంచి ఐదు శాతం వరకూ మైలేజీ తగ్గే అవకాశాలున్నాయని కేంద్ర ప్రభుత్వం చెప్పడం అనుమానాలను మరింత పెంచుతున్నది. వాహనం 'ఇ 20'కు అనుకూలంగా లేకపోతే సమస్య కూడా వాహనదారుడిదే. ఇంజిన్ లేదా ఇంధన వ్యవస్థలో లోపం తలెత్తితే బాధ్యత ఎవరిదో స్పష్టంగా తెలియకపోతే వినియోగదారుడే నష్టపోతాడు. 'నా వాహనం 'ఇ 20'కు అనుకూలమా? పాత వాహనాలకు ఏం జరుగుతుంది? మైలేజ్ తగ్గితే దాని భారం ఎవరు భరిస్తారు? సమస్య తలెత్తితే స్వతంత్ర సాంకేతిక పరీక్ష ఎక్కడ జరుగుతుంది?' అంటూ సామాన్యుడు సంధిస్తున్న ప్రశ్నలు దేశమంతా ప్రతిధ్వనిస్తున్నాయి. 'ఇ 20 వినియోగం దేశానికి అవసరం' అనే ఒకే ఒక్క సమాధానంతో ప్రశ్నలన్నింటినీ దాటవేయడం మంచిది కాదు. వినియోగదారుడి వ్యక్తిగత సమస్యకు జాతీయ గణాంకాలు పూర్తి సమాధానం ఇవ్వలేవు.

'ఇ 20'పై చర్చలో అత్యంత వివాదాస్పద అంశంగా వాహనాల పనితీరును ప్రస్తావించాలి. ఒకవైపు 'ఇ 20' వల్ల భారీ స్థాయిలో ఇంజిన్




నష్టం జరుగుతోందనే ప్రచారం ఉంది. మరోవైపు అలాంటి సమస్యకు విస్తృత ఆధారం లేదని ప్రభుత్వం చెబుతోంది. ప్రస్తుత ఆధారాల ప్రకారం రెండింటిలోనూ నిజాలు ఉన్నాయి. అబద్ధాలు కూడా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో వెల్లడించిన వివరాల ప్రకారం 'ఇ 20' వల్ల దేశవ్యాప్తంగా విస్తృత స్థాయిలో ఇంజిన్ వైఫల్యాలు సంభవించినట్లు నిర్ధారిత ఆధారం లేదని తెలిపింది. కోట్లాది వాహనాలు 'ఇ15' నుంచి 'ఇ 20' వరకు ఇంధనాన్ని ఉపయోగిస్తున్నప్పటికీ వ్యవస్థాత్మక ఇంజిన్ వైఫల్యాలు కనిపించలేదని ప్రభుత్వం పేర్కొంది. అయితే, వినియోగదారుల ఫిర్యాదులను కూడా విస్మరించలేం. 2026లో ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ జిల్లా వినియోగదారుల కమిషన్ ఒక 'గ్రాండ్ వితారా స్ట్రాంగ్ హైబ్రిడ్'కు సంబంధించిన కేసులో వాహనదారుడికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. 'ఇ 20' ఇంధనంతో సంబంధం ఉన్న వాహన సమస్యపై మారుతి సుజుకి, డీలర్‌పై కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. కంపెనీ ఈ తీర్పును సవాలు చేయనున్నట్లు తెలిపింది. ఈ తీర్పును 'ఇ 20' వల్ల దేశంలోని అన్ని వాహనాలు దెబ్బతింటున్నాయని నిరూపించే ఆధారంగా చూడటం తప్పు. అదే సమయంలో వినియోగదారుల ఫిర్యాదులకు విశ్వసనీయమైన పరిష్కార వ్యవస్థ అవసరమని ఈ కేసు గుర్తుచేస్తుంది. కాబట్టి, రాజకీయ ప్రకటన కంటే, స్వతంత్ర, దీర్ఘకాలిక సాంకేతిక అధ్యయనమే ఇప్పుడు కీలకం. వాహనం తయారైన సంవత్సరం, ఇంజిన్ డిజైన్, ఇంధన వ్యవస్థ, నిర్వహణ చరిత్ర, ఇంధన నాణ్యత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని 'ఇ 20' ప్రభావాన్ని విశ్లేషించాలి. ఒక వాహనం సమస్యకు 'ఇ 20' కారణమా, తయారీ లోపమా, నిర్వహణ లోపమా, ఇంధన కలుషితమా అన్నది శాస్త్రీయంగా నిర్ధారించాలి. అప్పుడే ప్రజల విశ్వాసాన్ని ప్రభుత్వం చూరగొంటుంది.

ఇథనాల్ వినియోగంలో బ్రెజిల్‌ది అగ్రస్థానం. కానీ బ్రెజిల్ ఈ వ్యవస్థను ఒక్క దశాబ్దంలో నిర్మించలేదు. దశాబ్దాలపాటు ఇంధన ఉత్పత్తి, వాహన సాంకేతికత, సరఫరా వ్యవస్థ, వినియోగదారుల ఎంపికలను సమాంతరంగా అభివృద్ధి చేసింది. అక్కడ 'ఫ్లెక్సీఫ్యుయెల్' వాహనాలు విస్తృతంగా అందుబాటులో ఉన్నాయి. వినియోగదారులు పెట్రోల్, ఇథనాల్ లేదా వాటి మిశ్రమాల మధ్య ఎంపిక చేసుకునే అవకాశం పొందారు. అంటే ఇంధన మార్పును కేవలం ప్రభుత్వ ఆదేశంగా కాకుండా ఒక పూర్తి మార్కెట్ వ్యవస్థగా అభివృద్ధి చేశారు. అమెరికా సైతం 'ఇ10'ను సాధారణ మిశ్రమంగా ఉపయోగిస్తున్నప్పటికీ 'ఇ15', 'ఇ85' విషయంలో వాహన అనుకూలత, లేబులింగ్, నియంత్రణలను స్పష్టంగా అమలు చేస్తోంది. ఈ దేశాల నుంచి భారత్ పాఠాలు నేర్చుకోవాలి. ఒక నిర్ణయాన్ని అత్యంత వేగంగా అమలు చేయడం పరిపాలనా సామర్థ్యానికి సంకేతం కావచ్చు. కానీ వేగం కారణంగా సంప్రదింపులు, సాంకేతిక పరీక్షలు, వినియోగదారుల అవగాహన, పాత వాహనాల రక్షణ వంటి అంశాలు వెనుకబడితే అదే వేగం రాజకీయ బలహీనతగా మారుతుంది.

'ఇ 20' చర్చను వాహనాలకే పరిమితం చేయకుండా, ఇథనాల్ తయారీలో ఉపయోగించే ముడిపదార్థాలపై కూడా దృష్టి సారించాలి. భారతదేశంలో చెరకు ఇథనాల్‌కు ముఖ్యమైన వనరు. అయితే చెరకు అధిక నీటి అవసరం కలిగిన పంట. ఇథనాల్ కోసం చెరకు ఉత్పత్తి పెరిగితే భూగర్భజలాలపై దాని ప్రభావాన్ని నిరంతరం పరిశీలించాలి. మొక్కజొన్నపై ఎక్కువగా ఆధారపడినా సమస్యలు తప్పవు. ఎందుకంటే, మొక్కజొన్న చాలా మందికి ప్రధానమైనఆహారం. పశుగ్రాసం, పౌల్ట్రీ పరిశ్రమలకు కూడా అవసరం. ఇంధన డిమాండ్ పెరగడం వల్ల ఈ రంగాలపై ధరల ఒత్తిడి తప్పదు. ఈ కోణంలోనూ ప్రభుత్వం ఆలోచించి, నిర్ణయాలు తీసుకోవాలి. భారత్ ఇప్పటికే వ్యవసాయ అవశేషా లు, రెండో తరం బయోఫ్యూయల్స్ వంటి ప్రత్యామ్నాయాలను ప్రోత్సహిస్తోంది. ఇది సరైన దిశ. భవిష్యత్తులో ఇథనాల్ ఉత్పత్తి పెరిగే కొద్దీ నీరు, భూమి, ఆహార భద్రత, పర్యావరణ ప్రభావాలను కూడా విధానంలో భాగంగా పరిగణించాలి. ఒక దిగుమతి ఆధారాన్ని తగ్గించి మరో వనరు పై అధిక ఆధారాన్ని సృష్టించడం ఇంధన భద్రతకు సంపూర్ణ పరిష్కారం కాదు. అదే సమయంలో, భారత్ 'ఇ 20' కార్యక్రమాన్ని వెంటనే నిలిపివేయాలని కోరడం కూడా సరైన విధానం కాదు. భారీ చమురు దిగుమతులపై ఆధారపడుతున్న దేశానికి దేశీయ ప్రత్యామ్నాయ ఇంధన వనరులు అవసరం. ఎలక్ట్రిక్ వాహనాల విస్తరణ కొనసాగుతున్నప్పటికీ అంతర్గత దహన ఇంజిన్ వాహనాలు చాలా కాలం రవాణా వ్యవస్థలో ఉంటాయి. అందువల్ల అసలు ప్రశ్న 'ఇ 20' ఉండాలా? వద్దా? అని కాదు. 'ఇ 20'ను మరింత పారదర్శకంగా, శాస్త్రీయంగా, వినియోగదారులకు న్యాయం జరిగే విధంగా ఎలా అమలు చేయాలన్నదే ప్రధానం. ప్రభుత్వం స్వతంత్ర దీర్ఘకాలిక ఇంజిన్ పనితీరు అధ్యయనాలను ప్రజల కు అందుబాటులో ఉంచాలి. వినియోగదారుల ఫిర్యాదులను నమోదు చేసి సాంకేతికంగా పరిశీలించే జాతీయ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. పాత వాహనాలకు స్పష్టమైన అనుకూలత మార్గదర్శకాలు ఇవ్వాలి. ఇంధన పంపుల వద్ద ఇథనాల్ మిశ్రమ శాతం స్పష్టంగా కనిపించేలా లేబులింగ్ చేయాలి. భవిష్యత్తులో 'ఇ 20'కు మించి వెళ్లే ఏ నిర్ణయమైనా ముందుగా సాంకేతిక అధ్యయనాలు, పరిశ్రమ సంప్రదింపులు, వినియోగదారుల అభిప్రాయాలు, పర్యావరణ ప్రభావాల అంచనాల ఆధారంగా తీసుకోవాలి. ప్రజాస్వామ్యంలో పెద్ద విధానాలను కేవలం నోటిఫికేషన్‌తో అమలు చేయడం సరిపోదు. ప్రజల నమ్మకం కూడా విధానంలో భాగమే.

# పాలిమర్ నోట్లు... భారత కరెన్సీ మరో మలుపు



శ్రీశైలం దూడం
9133947176


డబ్బు కేవలం కాగితం కాదు.. అది ప్రజల నమ్మకానికి ప్రతీక. చేతిలోని రూ.10 నోటు టీ దుకాణం నుంచి కిరాణా షాపు వరకు, కూలీ నుంచి చిన్న వ్యాపారి వరకు ఎన్నో చేతులు మారుతుంది. అందుకే కరెన్సీలో మార్పును కేవలం ముద్రణా సాంకేతికతగా చూడలేం. అది సామాన్యుడి ఆర్థిక జీవితాన్ని తాకే పరిణామం. ఒకప్పుడు వస్తు మార్పిడి. ఆ తర్వాత మెసపటోమియా నాగరికతలో లావాదేవీల లెక్కల కోసం మట్టి టోకెన్లు. అనంతరం బంగారం, వెండి, రాగి నాణేలు.. ఆపై కాగితపు నోట్లు. ఇప్పుడు పాలిమర్ కరెన్సీ. వేల ఏళ్ల డబ్బు ప్రయాణంలో ఇది మరో కీలక మలుపు. ఇది ఇక ఊహల దశలో లేదు. పాలిమర్ కరెన్సీపై ప్రయోగానికి ఆమోదం లభించింది. తొలి దశలో రూ.10, రూ.20 నోట్లతో ఫీల్డ్ ట్రయల్స్ చేపట్టనున్నారు. ఒక్కో విలువకు 100 కోట్ల చొప్పున మొత్తం 200 కోట్ల నోట్లు ప్రయోగంలోకి రానున్నాయి. వాటి మొత్తం విలువ సుమారు రూ.3,000కోట్లు. పాలిమర్ సబ్‌స్ట్రేట్ తయారీ, సరఫరా కోసం ప్రపంచ తయారీ సంస్థల నుంచి గ్లోబల్ ఇఒఐ ఆహ్వానించడం ఈ ప్రయోగం ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. అయితే అసలు ప్రశ్న ఇక్కడే మొదలవుతుంది. నోటు మార్చడమే లక్ష్యమా..లేక కరెన్సీ నిర్వహణను మార్చడమే అసలు ఉద్దేశమా?

రూ.10, రూ.20 నోట్లు అత్యధికంగా చేతులు మారే చిన్న విలువ కరెన్సీలో కీలకమైనవి. టీ దుకాణాలు, బస్సులు, కిరాణా వ్యాపారాలు, గ్రామీణ మార్కెట్లలో నిరంతరం చలామణిలో ఉంటాయి. అందుకే త్వరగా మాసిపోవడం, చిరగడం జరుగుతుంది. ఎక్కువకాలం మన్నే పాలిమర్ నోట్లు వస్తే తరచూ కొత్త నోట్లు ముద్రించాల్సిన అవసరం తగ్గవచ్చు. దీర్ఘకాలంలో ప్రభుత్వ వ్యయభారం కూడా తగ్గే అవకాశం ఉంది.

భద్రత మరో ముఖ్యమైన కోణం. పారదర్శక భద్రతా విండోలు, సూక్ష్మ గుర్తులు, ప్రత్యేక భద్రతా లక్షణాలు నకిలీ నోట్ల తయారీని కష్టతరం చేయవచ్చు. కానీ సాంకేతికత ఒక్కటే నకిలీ కరెన్సీని అంతం చేయదు. సమర్థమైన బ్యాంకింగ్ వ్యవస్థ, నిఘా, ప్రజల అవగాహన కూడా అవసరం.




మట్టి టోకెన్లు




ఆర్‌బిఐ విడుదల చేయనున్న ప్లాస్టిక్ పాలిమర్ ఊహాచిత్రం

పర్యావరణ ప్రశ్నను కూడా పక్కన పెట్టలేం. పాలిమర్ నోట్లు ఎక్కువకాలం మన్నినా, వాటి జీవితాంతం తర్వాత సేకరణ, పునర్వినియోగం ఎలా? తయారీ నుంచి రీసైక్లింగ్ వరకు మొత్తం పర్యావరణ ప్రభావం ఎంత? మన్నిక ఒక్కటే విజయానికి కొలమానం కాకూడదు.

డిజిటల్ చెల్లింపులు, యూపీఐ విస్తరిస్తున్నా భారతదేశంలో నగదుకు ఇంకా ప్రత్యేక స్థానం ఉంది. గ్రామీణ ప్రాంతాలు, చిన్న వ్యాపారాలు, రోజువారీ కూలీ వర్గాల్లో చేతి నగదు కీలకం. అందువల్ల డిజిటల్ ఆర్థిక వ్యవస్థ పెరుగుతున్నా భౌతిక కరెన్సీని ఒక్కసారిగా పక్కన పెట్టలేం.

పాలిమర్ నోట్లు వస్తున్నాయంటే ప్రస్తుత కాగితపు నోట్లు రద్దవుతాయని కాదు. ప్రస్తుతం కాగితపు కరెన్సీని పూర్తిగా పాలిమర్‌తో భర్తీచేసే ప్రతిపాదన లేదనే స్పష్టత ఉంది. ముందుగా ప్రయోగం.. ఆ తర్వాత ఫలితాల ఆధారంగా నిర్ణయం. ఫీల్డ్ ట్రయల్స్ విజయవంతమైతే 2027–28 ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో పాలిమర్ నోట్లు చలామణిలోకి వచ్చే అవకాశం ఉంది.

ఆస్ట్రేలియా, కెనడా, బ్రిటన్, న్యూజిలాండ్, సింగపూర్ వంటి దేశాలు పాలిమర్ కరెన్సీని ఉపయోగిస్తున్నాయి. వారి అనుభవం భారత్‌కు ఉపయోగపడొచ్చు. కానీ మన జనాభా, వాతావరణం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, నోట్ల లెక్కింపు యంత్రాల అనుకూలత, దృష్టి లోపం ఉన్నవారికి గుర్తించే సౌలభ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.

సోషల్ మీడియాలో గాంధీజీ చిత్రం తొలగుతుందని, అన్ని నోట్లు పాలిమర్‌గా మారతాయని, పాత నోట్లు రద్దవుతాయని వచ్చే ప్రచారాలను నమ్మకూడదు. కరెన్సీ విషయంలో అధికారిక ప్రకటనకే ప్రామాణికత. ఇక్కడ ప్రభుత్వ పారదర్శకత కూడా కీలకం. ఎన్ని నోట్లు ముద్రిస్తారు, ఎక్కడ ప్రయోగిస్తారు, పరీక్షలు ఎంతకాలం సాగుతాయి, ఫలితాలను ఎలా అంచనా వేస్తారు వంటి అంశాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. లేకపోతే చిన్న మార్పే పెద్ద అపోహలకు దారితీస్తుంది. కరెన్సీ విషయంలో ప్రజల విశ్వాసాన్ని కాపాడటం కూడా ఆర్థిక నిర్వహణలో భాగమే.

మరోవైపు పాలిమర్ నోట్ల తయారీ వ్యయం, సరఫరా వ్యవస్థ, పాత నోట్ల ఉపసంహరణ, రీసైక్లింగ్ ప్రక్రియలపై కూడా ముందస్తు ప్రణాళిక అవసరం. చిన్న నోట్లే ఎక్కువగా చేతులు మారుతున్నందున వాటి నాణ్యత ప్రజల అనుభవాన్ని నేరుగా ప్రభావితం చేస్తుంది. కొత్త నోటు తడిసినా, మురికైనా, మడిచినా గుర్తింపు సులభంగా ఉండాలి. దుకాణదారుడు, బ్యాంకు సిబ్బంది, యంత్రాలు ఒకే విధంగా స్వీకరించగలగాలి. అప్పుడే మన్నిక అనే ప్రయోజనం సామాన్యుడికి నిజమైన సౌకర్యంగా మారుతుంది. లేకపోతే మెరుగైన సాంకేతికత కూడా మరో నిర్వహణ సమస్యగా మారే ప్రమాదం ఉంది. కాబట్టి ప్రయోగం వేగం కంటే, దాని ఫలితాలపై శాస్త్రీయ మూల్యాంకనం, ప్రజల అనుభవం, నిపుణుల సూచనలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అదే సరైన మార్గం.

పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతేనే తదుపరి విలువల నోట్లపై ఆలోచన జరగాలి. ప్రయోగం విఫలమైతే వెనక్కి తగ్గే ధైర్యం కూడా వ్యవస్థకు ఉండాలి. ఎందుకంటే ప్రజాధనం, ప్రజా విశ్వాసం రెండూ ప్రయోగాల కంటే విలువైనవి.

మట్టి టోకెన్ల నుంచి లోహపు నాణేలకు.. కాగితం నుంచి పాలిమర్‌కు.. మరోవైపు డిజిటల్ రూపానికి డబ్బు ప్రయాణిస్తోంది. రూపం మారడం సహజం. కానీ ప్రజల విశ్వాసం మాత్రం మారకూడదు. అందుకే పాలిమర్ నోట్ల విజయాన్ని అవి ఎంతకాలం మన్నాయన్నదానితో మాత్రమే కొలవకూడదు. భద్రత, మన్నిక, ఖర్చు, పర్యావరణ బాధ్యత, అందుబాటు, పారదర్శకత — ఈ ఆరు ప్రమాణాలపై కొలవాలి.

చివరికి ఇది కాగితాన్ని ప్లాస్టిక్‌తో మార్చే కథ కాదు. భారతీయ కరెన్సీ భవిష్యత్తు ఎలా ఉండాలి? అన్న పెద్ద ప్రశ్నకు మొదలైన ప్రయోగం. నోటు ఏ పదార్థంతో తయారైనా.. దాని వెనుక ఉన్న అసలు విలువ మాత్రం ప్రజల నమ్మకం. ఆ నమ్మకాన్ని కాపాడితేనే పాలిమర్ నోట్ల మార్పు నిజమైన ఆర్థిక పురోగతిగా నిలుస్తుంది.



## పిఎంఎవై- జి కింద
# తెలంగాణకు 11.56 లక్షల ఇళ్లు
### కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సానుకూలం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ గ్రామీణ పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన–గ్రామీణ్ (పిఎంఎవైజి2.0) కింద తెలంగాణకు 11,56,915 ఇళ్లను ఒకేసారి కేటాయించాలని కోరారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ఎంపీలు డా. మల్లు రవి, రామసహాయం రఘురామిరెడ్డి, వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సురేష్ షెట్కార్, ఎం. అనిల్‌కుమార్ యాదవ్లతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ప్రజాపాలనలో ఇళ్ల కోసం 21 లక్షల దరఖాస్తులు రాగా, కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఆవాస్ ప్లస్–2024 యాప్ ద్వారా ఇంటింటా సర్వే నిర్వహించగా 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా తేలిందని చెప్పారు. సూపర్ చెక్, అనర్హుల తొలగింపు ప్రక్రియలను కూడా పూర్తి చేసినట్లు వెల్లడించారు.అర్హులైన కుటుంబాల జాబితాను రెండేళ్ల క్రితమే కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామని, తెలంగాణకు ఇళ్లు మంజూరు చేయాలని నేను పలుమార్లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు.కేంద్రం నుంచి సిఎంఎవైజి కిందఇళ్ల కేటాయింపు జరిగితే గ్రామీణ పేదల సొంతింటి కలను మరింత వేగంగా నెరవేర్చగలమని తెలిపారు. ఇళ్ల కేటాయింపును స్వయంగా రాష్ట్రానికి వచ్చి ప్రకటిస్తే గ్రామీణ పేదలకు మరింత భరోసా కలుగుతుందన్నారు. దీంతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే తెలంగాణలో పర్యటిస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర మంత్రి సానుకూల స్పందనకు పొంగులేటి శ్రీనివాసరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండి వి.పి. గౌతమ్ పాల్గొన్నారు.

# అసత్యాలతో కెటిఆర్ ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారు
### మంత్రి శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అసత్య ప్రచారంతో ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. గాంధీభవన్ లో మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కెసిఆర్ ఫామ్‌హౌస్‌లో పండిన వరికి ఎంత ధర వచ్చిందో కెటిఆర్ తెలంగాణ రైతులకు చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. భూముల కేటాయింపులు పూర్తిగా నిబంధనల మేరకే జరిగాయని స్పష్టం చేశారు. తాము ఎకరా భూమిని రూ.1.50 కోట్లకు కేటాయిస్తే, గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఎకరాకు రూ.90 లక్షలకే భూములు ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రస్తుతం ఐదు ఎకరాల భూమిని రూ.7.50 కోట్లకు కేటాయించామని తెలిపారు. కెటిఆర్ చెబుతున్న రూ.200 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో ఆయనే సమాధానం చెప్పాలని శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. హెచ్‌ఐఎల్‌టి పాలసీ వల్ల హైదరాబాద్ ప్రజలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలను భయపెట్టడం కెటిఆర్‌కు మంచిది కాదని, తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదని హితవు పలికారు. తమపై ఉన్న కోపాన్ని తెలంగాణ ప్రజలపై చూపించవద్దని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. అభివృద్ధి విషయంలో గత ప్రభుత్వాలు కొనసాగించిన విధానాలనే తాము కూడా కొనసాగిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలే తమ ప్రభుత్వానికి ముఖ్యమన్నారు.

**నీటి వాటాలపై రాజీ లేదు..**

తెలంగాణ నీటి వాటాల విషయంలో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర నష్టం చేసిందని శ్రీధర్‌బాబు ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా రాజీపడబోదని స్పష్టం చేశారు. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశానికి హాజరై తెలంగాణ ప్రయోజనాల కోసం బలంగా వాదిస్తామని మంత్రి తెలిపారు.

# ప్రజలు బాగుండటం కెటిఆర్‌కు నచ్చదు
### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తన కుటుంబం తప్ప ఎవరూ బాగుపడకూడదనే ఆలోచనతోనే బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మాట్లాడుతున్నారని భువనగిరి లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ ప్రజలు బాగుపడటం కెటిఆర్‌కు ఇష్టం లేదని ఆరోపించారు. కెటిఆర్ ఇకనైనా పిచ్చి మాటలు మానుకోవాలని సూచించారు. ఉద్యమ సమయంలో తెలంగాణ వస్తే తన కుటుంబ సభ్యులు ఎవరూ రాజకీయాల్లోకి రారని కెసిఆర్ చెప్పారని, అయితే 1,600 మంది బలిదానాలతో ఏర్పడిన తెలంగాణలో కెసిఆర్ కుటుంబంలోనే ఐదుగురికి రాజకీయ పదవులు దక్కాయని చామల అన్నారు. అమెరికా నుంచి వచ్చిన కెటిఆర్ మంత్రి అయ్యారని, ఎమ్మెల్యేగా ఎన్నిక కాకుండానే హరీశ్‌రావు మంత్రిగా పనిచేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబంలో ఇప్పటివరకు ఎవరూ ఎమ్మెల్యే, ఎంపి లేదా మంత్రి కాలేదని చామల స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డికి ఐదుగురు అన్నదమ్ములు ఉన్నప్పటికీ, బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగినట్లు తన కుటుంబ సభ్యులకు పదవులు కట్టబెట్టలేదన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎవరు దరఖాస్తు చేసుకున్నా భూమి కేటాయించే అవకాశం ఉంటుందని, అదే విధంగా సిఎం రేవంత్‌రెడ్డి సోదరుడు దరఖాస్తు చేసుకున్నందుకే భూమి కేటాయించారని పేర్కొన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుపై మాట్లాడే నైతిక అర్హత బిఆర్‌ఎస్‌కు లేదని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో దండుకోవాలన్న ఆలోచనతోనే పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును బిఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. కెటిఆర్ మంత్రిగా ఉన్న సమయంలో ఎవరెవరికి భూములు కేటాయించారో, ఏ సన్నిహితులకు కంపెనీలు కట్టబెట్టారో తమకు పూర్తిగా తెలుసని చామల అన్నారు. కెటిఆర్ ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని, ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు మానుకోవాలని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హితవు పలికారు.

# జిఆర్‌ఎంబి ఎజెండా నుంచి తెలంగాణ ప్రాజెక్టులను తొలగించాలి
### మాజీ ఎంపి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల డిమాండ్



**ప్రజాపక్షం/కరీంనగర్ :** హైదరాబాద్‌లో ఈనెల 18న జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జిఆర్‌ఎంబి) 18వ సమావేశ ఎజెండా నుంచి తెలంగాణ ప్రాజెక్టులను వెంటనే తొలగించాలని మాజీ ఎంపి బి. వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. కరీంనగర్‌లోని గంగుల నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనే నీళ్ల కోసం జరిగిన పోరాటమని, కెసిఆర్ హయాంలో అన్ని చట్టబద్ధమైన అనుమతులతోనే ప్రాజెక్టులను నిర్మించినట్లు స్పష్టం చేశారు. తెలంగాణలోని 7 ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రానికి లేఖ రాయగా కేంద్రం జిఆర్‌ఎంబి ఎజెండాలో చేర్చడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చిన అనుమతులను రద్దు చేయాలని కోరడం, దాన్ని ఎజెండాలో పెట్టడం సరికాదన్నారు.

## క్యూబాకు సంఘీభావంగా
# భారత్ మందులు
### భారత్ నుంచి ఉభయ కమ్యూనిస్టులు సేకరించిన ఔషధాలను క్యూబా వైద్యులకు అందజేసిన సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ




**హవానా :** తీవ్రమైన ఔషధాల కొరతను ఎదుర్కొంటున్న క్యూబా ప్రజలకు సంఘీభావంగా భారత దేశం నుంచి ఉభయ కమ్యూనిస్టు పార్టీలు సేకరించిన మందులను భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ బుధవారం హవానాలో క్యూబా వైద్యులకు అందజేశారు. క్యూబాపై అమెరికా ఆంక్షలు, ఆర్థిక దిగ్బంధనం కారణంగా అవసరమైన మందులు, వైద్య సామగ్రి అందుబాటులో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో, క్యూబా ప్రజలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో భారతదేశంలోని సిపిఐ, సిపిఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు కలిసి మందులను సేకరించి క్యూబాకు పంపించారు. హవానాలో జరిగిన కార్యక్రమంలో క్యూబా వైద్యులు, ఆరోగ్య సిబ్బందికి ఈ మందులను రామకృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు ఉద్యమం తరఫున క్యూబా ప్రజలకు తమ సంపూర్ణ సంఘీభావాన్ని, స్నేహాన్ని ఆయన తెలియజేశారు. క్యూబా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు కేవలం క్యూబా సమస్య కాదని, ప్రపంచవ్యాప్తంగా శాంతి, మానవత్వం, సామాజిక న్యాయం కోరుకునే ప్రజలందరి సమస్య అని రామకృష్ణ పేర్కొన్నారు. అమెరికా ఆర్థిక దిగ్బంధనాన్ని ఎత్తివేసి, క్యూబా ప్రజలకు స్వేచ్ఛగా మందులు, ఆహారం, వైద్య పరికరాలు అందేలా అంతర్జాతీయ సమాజం మరింత బలమైన పాత్ర పోషించాలని ఆయన కోరారు. సిపిఐ(ఎం) నాయకుడు వెంకట్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని క్యూబా వైద్యులకు మందులను అందజేయడంలో భాగస్వామ్యమయ్యారు. భారత్‌లోని కమ్యూనిస్టు పార్టీలు, ప్రజా సంఘాలు, సాధారణ ప్రజలు క్యూబా ప్రజల కష్టకాలంలో తమ వంతు సహాయం అందించడం ద్వారా భారత్–క్యూబా ప్రజల మధ్య ఉన్న స్నేహం, అంతర్జాతీయ సంఘీభావం మరింత బలపడుతుందని నాయకులు తెలిపారు. క్యూబా ఒంటరిగా లేదు ప్రపంచంలోని శాంతి, ప్రగతి, సామాజిక న్యాయం కోరుకునే ప్రజలు క్యూబా ప్రజలతో ఉన్నారు అని వారు స్పష్టం చేశారు.

# ఆర్మీ నియామకాల్లో యువతకు ప్రోత్సాహం
### జిల్లా కేంద్రాల్లో శిక్షణా కేంద్రాల ఏర్పాటు : సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారత ఆర్మీ చేపట్టే వివిధ నియామకాల్లో తెలంగాణ యువతను ప్రోత్సహించే విధంగా కలిసి పని చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భారత ఆర్మీ సదరన్ కమాండ్ అధికారులకు తెలిపారు. ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డిలో బుధవారం ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్‌ఇన్‌చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్, పలువురు ఆర్మీ ప్రతినిధులను ముఖ్యమంత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఆర్మీ నియామకాల్లో స్థానిక యువతకు భారీ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆసక్తి ఉన్న అనువైన జిల్లా కేంద్రాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి కోరగా లెఫ్టినెంట్ జనరల్ సుముఖత వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా నిర్వహించే వివిధ ఆర్మీ రిక్రూట్‌మెంట్లకు ముందస్తుగా తెలంగాణలోని వివిధ జిల్లా కేంద్రాల్లో యువతకు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. దేశంలో విపత్తుల సమయంలో ఆర్మీ పోషిస్తున్న పాత్రను సిఎం ఈ సందర్భంగా అభినందించారు. రాష్ట్రంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్లు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస చర్యల్లో ఆర్మీ యంత్రాంగం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి కోరారు. తెలంగాణలో విపత్తు పరిస్థితుల్లో ప్రత్యేకంగా చొరవ తీసుకునేలా స్థానిక ఆర్మీ అధికారులను ఆదేశిస్తానని రాజేష్ పుష్కర్ ఈ సందర్భంగా సిఎంకు చెప్పారు. కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా చారిత్రక హైదరాబాద్ నగరానికి పూర్వవైభవాన్ని తేవాలన్న పట్టుదలతో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు చేపట్టడంపై లెఫ్టినెంట్ జనరల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు. హైదరాబాద్ నగరాన్ని రక్షించడానికి మూసీ నది ప్రక్షాళన అవసరమని అన్నారు. సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ ఎన్.శ్రీనివాస్ రావు, ఇతర ఆర్మీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు ప్రోత్సాహకాలపై
# బిహార్ మంత్రి ప్రశంసలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆయిల్ పామ్ సాగుకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, నర్సరీలు, ప్రాసెసింగ్ యూనిట్లు, మైక్రో ఇరిగేషన్ సదుపాయాలను బిహార్ రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి విజయ్ కుమార్ సిన్హా ప్రశంసించగా, బిహార్‌లో సాగవుతున్న మకానా పంటలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆసక్తి వ్యక్తం చేశారు. బిహార్ మంత్రి విజయ్ కుమార్ తెలంగాణలో రాష్ట్ర పర్యటనలో భాగంగా బుధవారం సచివాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల మంత్రులు రెండు రాష్ట్రాల మధ్య వ్యవసాయరంగంలో సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, పంటల వైవిధ్యీకరణ, రైతుల సంక్షేమం, ఉత్తమ విధానాలపై చర్చించారు. రెండు రాష్ట్రాలు తమకు అనుకూలమైన పంటల సాగు, సాంకేతికతను పరస్పరం అధ్యయనం చేసుకోవడం ద్వారా రైతుల ఆదాయం, ఉత్పాదకత పెంచేందుకు అవకాశం ఉంటుందని ఇరువురు అభిప్రాయపడ్డారు.

**రైతుల సంక్షేమమే లక్ష్యంగా రూ.1.50లక్షల కోట్లు ఖర్చు : మంత్రి తుమ్మల**

ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రైతుల కోసం ఇప్పటికే సుమారు రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బిహార్ మంత్రి విజయ్ కుమార్ సిన్హాకు వివరించారు. తెలంగాణలో రైతుల కోసం అమలు చేస్తున్న రైతుభరోసా, రైతుబీమా, రుణమాఫీ, సన్నవడ్లకు బోనస్ వంటి అనేక పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. క్రాప్ బుకింగ్, శాటిలైట్ ఆధారిత పంటల పర్యవేక్షణ, అగ్రిస్టాక్, వాతావరణ హెచ్చరికలు, 'రైతు నేస్తం', కృత్రిమ మేధ ఆధారిత 'కృషివాస్' వంటి సాంకేతిక కార్యక్రమాలను వివరించారు. అదే విధంగా బిహార్‌లో విస్తృతంగా సాగు చేస్తున్న మకానా పంటపై తుమ్మల ఆసక్తి వ్యక్తం చేశారు. దీంతో ఇందుకు సంబంధించి అక్కడ రాష్ట్ర ప్రభుత్వం దర్భంగా, మధుబని, సీతామర్హి ప్రాంతాల్లో మకానా క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నామని బిహార్ మంత్రి వివరించారు. ఉత్పత్తితో పాటు ప్రాసెసింగ్, విలువ జోడింపు, మార్కెటింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. మంత్రి తుమ్మల స్పందిస్తూ మకానా సాగు, ప్రాసెసింగ్, మార్కెటింగ్ విధానాలను అధ్యయనం చేసేందుకు తెలంగాణ నుంచి బిహార్‌కు ప్రతినిధుల బృందాన్ని పంపనున్నట్లు తుమ్మల తెలిపారు.

**ఆయిల్ పామ్‌పై బిహార్ మంత్రి ఆసక్తి**

తెలంగాణలో సాగవుతున్న ఆయిల్ పామ్‌పై ఆసక్తి వ్యక్తం చేస్తూ బిహార్‌లో కూడా ఆయిల్‌పామ్ సాగును చేపట్టే అవకాశాలను పరిశీలిస్తామని విజయ్ కుమార్ సిన్హా తెలిపారు. త్వరలో అధికారులు, రైతులతో కూడిన ప్రతినిధుల బృందాన్ని తెలంగాణకు పంపి ఆయిల్‌పామ్ తోటలు, నర్సరీలు, ప్రాసెసింగ్ యూనిట్లను పరిశీలిస్తామని చెప్పారు. దీంతో అవసరమైన సాంకేతిక సహకారం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తుమ్మల తెలిపారు. ఈ కార్యక్రమంలో బిహార్ వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నర్మదేశ్వర్ లాల్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ముఖేష్ కుమార్ లాల్, ఉద్యాన శాఖ డైరెక్టర్ అభిషేక్ కుమార్, తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్, కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, వ్యవసాయ సంచాలకులు డా.బి.గోపి, హాకా మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయ, ఉద్యాన, సహకార శాఖల ఉన్నతాధికారులు, వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

# ప్రకృతి– సేంద్రియ వ్యవసాయంపై ప్రత్యేక పాలసీ
### రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పంటల మార్పిడిని విస్తృతంగా ప్రోత్సహించడంతో పాటు ప్రకృతి, సేంద్రియ వ్యవసాయానికి సంబంధించి ప్రత్యేక వ్యవసాయ పాలసీ రూపొందించాల్సిన అవసరముందని తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లో బుధవారం రైతు కమిషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం–సేంద్రియ వ్యవసాయం అంశంపై కోదండరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఉత్పత్తులకు మెరుగైన ధర లభించేలా ప్రత్యేక మార్కెట్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం కొనుగోలు, మార్కెటింగ్, ప్రోత్సాహకాలు కల్పించడం ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరించాలని అన్నారు. పంటల మార్పిడిపై గతంలోనే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పర్యటించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించామని, ప్రస్తుత వాతావరణ మార్పుల నేపథ్యంలో ఆ సూచనలను మరింత వేగంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. రైతు సమస్యలను రాజకీయాలకు అతీతంగా పరిశీలించి, రైతులకు అవసరమైన విధానాలను రూపొందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు.కమిషన్ సభ్యుడు కె.వి.ఎన్. రెడ్డి మాట్లాడుతూ రసాయన రహిత వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భూమి, పర్యావరణ పరిరక్షణతో పాటు రైతులకు పెట్టుబడి భారం తగ్గేలా సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచించారు. దీనిపై ప్రత్యేక పాలసీ రూపొందించేందుకు కమిషన్ నివేదికను ప్రభుత్వానికి సమర్పించనుందని తెలిపారు.రాంరెడ్డి గోపాల్ రెడ్డి, చెవిటి వెంకన్న మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాములు నాయక్, కె.వి.ఎన్. రెడ్డి, భవానీ రెడ్డితో పాటు వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖల అధికారులు, ఆర్గానిక్ సర్టిఫికేషన్ ప్రతినిధులు, సిఎస్ఎ ,ఎఫ్‌పిఓ ప్రతినిధులు, ప్రకృతి–సేంద్రియ వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

# బిజెపిది రెండు నాల్కల ధోరణి
### సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కె.నారాయణ విమర్శ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జార్ఖండ్‌లో విద్యార్థుల ఉద్యమం, పేపర్ లీకేజీ ఘటనపై బిజెపి నేతలు చేస్తున్న విమర్శలు ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. బిజెపి నేతల రెండు నాలుకల దోరణిని అవలంభించడం తగదన్నారు. జార్ఖండ్‌లో పేపర్ లీకేజీ జరగడం, దానికి నిరసనగా విద్యార్థుల ఉద్యమం కొనసాగడం వాస్తవమని అన్నారు. విద్యార్థులతో చర్చించేందుకు, సమస్యపై విచారణ జరిపించేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినప్పటికీ జార్ఖండ్‌లో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందంటూ బిజెపి ప్రచారం చేయడం సరికాదన్నారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులు, యువతపై జరిగిన దాడుల సమయంలో బిజెపి నేతలు కానీ, ఉద్యమకారులపై లాఠీఛార్జీలు, వేధింపులు జరిగినప్పుడు ప్రధాని మోదీ ఎందుకు స్పం దించలేదని ఆయన నిలదీశారు. కంగనా రనౌత్ వాస్తవాలను తెలుసుకోకుండా మాట్లాడుతున్నారని డాక్టర్ నారాయణ విమర్శించారు. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన అన్యాయానికి బిజెపి నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ విద్యార్థులను క్షమించానని చెప్పడం సరికాదని, వాస్తవానికి విద్యార్థులే కేంద్ర పాలకులను క్షమించాల్సిన పరిస్థితి ఉందని నారాయణ వ్యాఖ్యానించారు. దేశంలో విద్యావ్యవస్థను పూర్తిగా ప్రైవేటీకరించి వ్యాపార రంగంగా మార్చడం వల్లే ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. విద్య, వైద్య రంగాలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని బలోపేతం చేస్తే ఇటువంటి ఘటనలకు అడ్డుకట్ట వేయవచ్చని ఆయన సూచించారు.

# నీట్‌లో ఉచిత శిక్షణ
### టిజిఎస్‌డబ్ల్యుఆర్‌ఇఐఎస్ ఆధ్వర్యంలో లాంగ్‌టర్మ్ కోచింగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టిజిఎస్‌డబ్ల్యుఆర్‌ఇఐఎస్) ఆధ్వర్యంలో నీట్ 2027 లాంగ్‌టర్మ్ శిక్షణకు అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థినీ, విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ సెక్రెటరీ (ఎఫ్‌ఎసి) కంభంపాటి శారద ఒక ప్రకటనలో తెలిపారు. 2026–27 విద్యా సంవత్సరానికి హైదరాబాద్‌లోని చిలుకూరు టిజిఎస్‌డబ్ల్యుఆర్ ఫౌండేషన్ సిఓఇలో బాలురకు, మహేంద్రహిల్స్ ఫౌండేషన్ సిఓఇలో బాలికలకు ఉచితంగా శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణకు మొత్తం 200 సీట్లు అందుబాటులో ఉండగా, బాలురకు 100, బాలికలకు 100 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో ఏదైనా విద్యాసంస్థలో ఇంటర్మీడియట్ (బైపిసి) చదివి ఉత్తీర్ణులై, నీట్2026 పరీక్షకు హాజరైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, ఇడబ్ల్యుఎస్ తదితర అర్హత కేటగిరీలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన విద్యార్థులు టిజిఎస్‌డబ్ల్యుఆర్‌ఇఐఎస్ అధికారిక వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్‌లోని పూర్తి వివరాలను పరిశీలించి దరఖాస్తు ఫారాన్ని పొందవచ్చని తెలిపారు. పూర్తిగా నింపిన దరఖాస్తుతోపాటు అవసరమైన ధ్రువపత్రాలను జత చేసి సంబంధిత డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ (డిసిఓ)కు సమర్పించాలని సూచించారు. డిసిఓల వివరాలు సంస్థ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు రుసుము లేదని, ఆగస్టు 22వ తేదీ దరఖాస్తుల స్వీకరణకు చివరి గడువు అని కంభంపాటి శారద స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకుని వైద్య విద్యలో తమ లక్ష్యాలను సాధించాలని ఆమె సూచించారు.

## సచివాలయ ఉద్యోగులకు
# రూ.15 లక్షల జీవిత బీమా
### 15 నుంచి కొత్త పథకం అమలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సహకార పరపతి సొసైటీ సభ్యులకు శుభవార్త అందించింది. సభ్యులు, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో రూ.15 లక్షల జీవిత బీమా (లోన్ ఇన్సూరెన్స్) పథకాన్ని ప్రారంభించనుంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15 నుంచి ఈ పథకం అందుబాటులోకి రానుంది.ఈ విషయాన్ని సొసైటీ అధ్యక్షుడు రేండ్ల రాజేష్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సచివాలయం, శాసనసభ (అసెంబ్లీ), లోక్‌భవన్ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సేవలందిస్తున్న సొసైటీ.. సభ్యుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మే 2025లో నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఉద్యోగుల ప్రయోజనాల కోసం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు రాజేష్ తెలిపారు. తాజాగా రూ.15 లక్షల జీవిత బీమా పథకాన్ని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా సభ్యుల కుటుంబాలకు మరింత ఆర్థిక భద్రత కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
కూకట్‌పల్లి సర్కిల్-52

Lr No: 14/CMC/KPC-52/EE/2026-27 తేది: 11.08.2026

**NIT No.** 14/CMC/KPC52/EE/2026-27, తేది: 11.08.2026, **పని పేరు:** సిఎంసి, కూకట్‌పల్లి సర్కిల్-52 పరిధిలో తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో రోడ్డు పునరుద్ధరణ పనులు, **అంచనా విలువ:** రూ.49.50లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 12.08.2026 మ.01:00గం.ల నుండి 17.08.2026 మ.02:00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీమతి టి.రాజేశ్వరి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సిఎంసి, కూకట్‌పల్లి సర్కిల్-52. **సెల్ నెం.** 8897507674. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కూకట్‌పల్లి సర్కిల్-52, సిఎంసి.
DIPR R.O. No. : 7727-PP/CL/ADVT/2026-27, Date: 12-08-2026

**గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్**
ఇ-వేలం & కొటేషన్ నోటీసు

టెండర్ నోటీసు నం. EE-IV/GWMC/CTN-05/e-proc/2026-27, తేదీ: 11.08.2026

పనుల వివరాలు:

GWMC కమిషనర్ ఆమోదం మేరకు, ఇ-వేలం పనుల కోసం ఆన్‌లైన్ టెండర్ విధానం ద్వారా ''ఇ-వేలం'' ప్లాట్‌ఫారమ్‌లో టెండర్లు పిలవడమైనవి. టెండర్ & వేలం నోటీసుతో పాటు పనుల జాబితా జతచేయబడింది. **3 రోజుల కొటేషన్ నోటీసు:** ప్రారంభ తేదీ: 12-08-2026 ఉ.10.00 గం.లకు. ముగింపు తేదీ: 17-08-2026 సా.4.00 గం.లకు. **డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ ::** 12-08-2026 ఉ. 10.00 గం.ల నుండి, **డౌన్‌లోడ్ చివరి తేదీ ::** 17-08-2026 సా.04.00 గం.ల వరకు. **స్క్రాప్ (పాత సామాగ్రి) ఇ-వేలం కోసం:** వేలం ప్రారంభ తేదీ :: 14-08-2026 సా.05.00 గం.ల నుండి, వేలం ముగింపు తేదీ :: 21-08-2026 సా.05.00 గం.లకు, బిడ్ల ప్రారంభం :: 21-05-2026 సా.05.00 గం.లకు. **సంప్రదించవలసిన వివరాలు:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, GWMC, వరంగల్. ఈమెయిల్: ee.elec.gwmc@gmail.com, సంప్రదించవలసిన నంబర్: 9000099663. ఇ-వేలం వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. ఇ-టెండర్లు https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి (EE ఎలక్ట్రికల్ / EE పర్యావరణం / EE వాహనాలు విభాగాల ద్వారా).

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్
DIPR R.O. No. : 7696-PP/CL/ADVT/2026-27, Date: 12-08-2026

తెలంగాణ ప్రభుత్వం
**రోడ్లు మరియు భవనాల శాఖ**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) కార్యాలయము, రంగారెడ్డి డివిజన్.

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు NIT నం. 05/RD/DB/HD/D2/2026-27/Tender, తేదీ: 06.08.2026.

గోషామహల్‌లోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), రంగారెడ్డి జిల్లా వారిచే, ''క్లాస్-V'' మరియు అంతకంటే పై స్థాయికి చెందిన నమోదిత సంస్థలు / కాంట్రాక్టర్ల నుండి **8 (ఎనిమిది)** పనులకు సంబంధించి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఆన్‌లైన్‌లో టెండర్లు స్వీకరించబడతాయి. **పనుల విలువలు: 1)** రూ. 7.43 లక్షలు, **2)** రూ. 4.71 లక్షలు, **3)** రూ. 4.40 లక్షలు, **4)** రూ. 8.33 లక్షలు, **5)** రూ. 3.37 లక్షలు, **6)** రూ. 7.53 లక్షలు, **7)** రూ. 7.34 లక్షలు, **8)** రూ. 7.55 లక్షలు. ఇతర వివరాలను **11.08.2026 సాయంత్రం 4.00 గంటల** నుండి www.e-procurement.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
**టెండర్లు స్వీకరించడానికి చివరి తేదీ: 18.08.2026, మధ్యాహ్నం 3.30 గంటల వరకు.**
**టెండర్లు తెరిచే తేదీ: 18.08.2026, సాయంత్రం 4.00 గంటలకు.**

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), రంగారెడ్డి డివిజన్.
DIPR R.O. No. : 7765-PP/CL/ADVT/2026-27, Date: 12-08-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్**

| NIT No & Date | పని పేరు | అంచనా విలువ | ప్రారంభ తేది & సమయం | బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం | ఇఇ పేరు & చిరునామా |
| --- | --- | --- | --- | --- | --- |
| 12/DB/EE-II/ Alwal Circle/ MMC/ 2026-27, Dt: 12.08. 2026 | ఎంఎంసి, మల్కాజ్‌గిరి జోన్, అల్వాల్ సర్కిల్-02 పరిధిలోని ION డిజిటల్ వద్ద బోర్‌వెల్ పద్ధతి ద్వారా రోడ్డు వర్షపు నీటి సేకరణ మరియు భూగర్భ జలాల పునరుజ్జీవన వ్యవస్థ నిర్మాణం. | రూ. 3.09 లక్షలు | 13.08.2026 మ.12.00 గం.లకు | 17.08.2026 మ.12.00 గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ - II, అల్వాల్ సర్కిల్-2, ఎంఎంసి. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.eprocurement.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, అల్వాల్ సర్కిల్-2, ఎంఎంసి
DIPR R.O. No. : 7809-PP/CL/ADVT/2026-27, Date: 12-08-2026

GHMC
**గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్**
EE-CIR-34 (GZ), 5వ అంతస్తు, గోల్కొండ జోనల్ ఆఫీస్, అబిడ్స్, జిహెచ్ఎంసి.

NIQ No.01/EE/CIR-34/GZ/GHMC/2026-27 తేదీ: 11.08.2026

కింద పేర్కొన్న ఐటెమ్స్ ధర నిర్ధారణ కోసం non–Sor ఐటెమ్స్‌కు కొటేషన్లు ఆహ్వానించబడ్డాయి.

| క్ర.సం. | వస్తువు వివరణ | యూనిట్ |
| --- | --- | --- |
| 01 | MCB 25 AMPS | 6.00 సంఖ్యలు |
| 02 | MEP వారు ఎలక్ట్రికల్, మెకానికల్ పనులతో పాటు అన్ని లైటింగ్ ఫిక్చర్ల ఫిట్టింగ్, ఇన్‌స్టాలింగ్ ఛార్జీలతో సహా అవసరమైన అన్ని పనులను అందిస్తున్నారు. | 1.00 సంఖ్యలు |
| 03 | పనిని పూర్తి చేయడానికి ఇంజినీరింగ్ ఇన్‌చార్జి ఆదేశించిన విధంగా (18ఫీట్ల ఎత్తు, ఒక అడుగు వ్యాసం) తలభాగం గల అలంకార (CI) కాస్ట్ ఐరన్ దీప స్తంభాన్ని సప్లయ్ చేసి, అమర్చడం. ఇది IS : 210 FG 200 లేదా దానికి సమానమైన ప్రమాణాలకు అనుగుణంగా ఉండే ఉన్నత శ్రేణి కాస్ట్ ఐరన్‌తో తయారుచేయబడింది. కళాత్మకంగా రూపొందించబడింది. అలంకారంగా పోతపోయబడింది. ఇప్పటికే ఉన్న కాస్ట్ ఐరన్‌పై అమర్చడానికి అనువైనది. ఇందులో టాప్ కవర్, డిఫ్యూజర్, బేస్ కాలర్‌తో సహా అన్ని అనుబంధ పరికరాలతో పాటు వాతావరణ నిరోధకత కోసం రెండు పూతలతో పూర్తి చేయబడింది. పై భాగంలో 4లైట్లు, వాటి కనెక్షన్ అవసరమైన ఫిక్సింగ్ ఏర్పాట్లతో సహా సరఫరా చేయబడుతుంది. | 1.00 సంఖ్యలు |
| 04 | జంక్షన్ మరియు బోర్డుకు కొత్త రూపాన్ని సూచించే శిల్పం, మార్గాన్ని చూపించే సూచిక, శిల్పం వ్యూహాత్మకంగా సరైన ప్రకాశం మరియు సందేశంతో ఉంచబడుతుంది. ఇది మొత్తం జంక్షన్‌కు మరియు డిజైన్‌కు విలువను జోడిస్తుంది. | 1.00 సంఖ్యలు |
| 05 | ఫోకస్ లైట్లు (40వాట్) | 10.00 సంఖ్యలు |
| 06 | ఫోకస్ లైట్లు (9 వాట్) | 4.00 సంఖ్యలు |
| 07 | కాస్ట్ ఐరన్ ల్యాంప్ పోస్ట్ లైట్లు (20వాట్) | 4.00 సంఖ్యలు |
| 08 | గ్రిల్ ల్యాంప్ పోస్ట్ లైట్లు (20వాట్) | 20.00 సంఖ్యలు |
| 09 | శిల్పాల కోసం హాలోజెన్ లైట్లు (30/20వాట్) | 4.00 సంఖ్యలు |
| 10 | 50-63A TP MCB 10 KA సప్లయ్, C/D కర్వ్ ISI మార్క్ 1.00 సంఖ్యలు | 1.00 సంఖ్యలు |
| | మరిన్ని వివరాల కోసం దయచేసి కార్యాలయ చిరునామాను సంప్రదించండి | |

**కొటేషన్ల స్వీకరణ ప్రారంభ తేదీ : 11.08.2026 ఉదయం 11గంటలు**
**కొటేషన్లు స్వీకరించడానికి చివరి తేదీ : 18.08.2026 మధ్యాహ్నం 3.00గంటల వరకు.**

ప్రతిష్టాత్మకమైన తయారీదారులు / అధీకృత డీలర్లు / రిజిస్టర్డ్ ఏజెన్సీల నుండి సీల్డ్ కొటేషన్లు ఆహ్వానించబడ్డాయి. ఏదైనా అదనపు సమాచారం మరియు సీల్డ్ కొటేషన్ల కవర్లను క్రింది చిరునామాలో సమర్పించగలరు.
పేరు & చిరునామా అధికారి సెల్ నెంబర్. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, Cir-34, GHMC, 5th floor, గోల్కొండ జోనల్ ఆఫీస్, హైదరాబాద్. Ph.No.7993360287

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ Cir 34 (GZ) GHMC.
DIPR R.O. No. : 7707-PP/CL/ADVT/2026-27, Date: 12-08-2026

## అర్హులైన వయోవృద్ధులకు పెన్షన్లు మంజూరు చేయాలి

సిపిఐ నాయకుడు కారుకూరి నగేష్ డిమాండ్



ప్రజాపక్షం/మంచిర్యాల : తెలంగాణలో అర్హులైన వయోవృద్ధుల నుంచి పెన్షన్ దరఖాస్తులు స్వీకరించి, పెన్షన్లు మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కారుకూరి నగేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా పాత మంచిర్యాలలో సిపిఐ ప్రజా పోరు యాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో వయోవృద్ధులకు పెన్షన్లు అందించాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరించడం దారుణమన్నారు. హామీల అమలులో కాలయాపన చేస్తే ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని హెచ్చరించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని కోరారు. సెప్టెంబర్ 1న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ నాయకులు జోగుల మల్లయ్య, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, మిరియాల రాజేశ్వరరావు, నర్సింగరావు, రామన్న, బొడ్డు లక్ష్మణ్, కొత్తపల్లి మహేష్, దేవి పోచన్న, వేముల సంతోష్, రాకేష్ పాల్గొన్నారు.

## బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ ప్రజా చైతన్య యాత్ర

రాష్ట్ర సిపిఐ కంట్రోల్ కమిషన్ కార్యదర్శి మిట్టపల్లి



ప్రజాపక్షం/బెల్లంపల్లి : బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బెల్లంపల్లి పట్టణంలో సిపిఐ ప్రజా చైతన్య యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సిపిఐ కంట్రోల్ కమిషన్ కార్యదర్శి మిట్టపల్లి వెంకట స్వామి, బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్ మాట్లాడుతూ ఉచిత విద్య, వైద్యాన్ని ప్రభుత్వమే అందించాలని, ఉపాధి అవకాశాలు పెంచాలని డిమాండ్ చేశారు. ధరల పెరుగుదలను అరికట్టాలని, పంటలకు కనీస మద్దతు ధర చట్టబద్ధత కల్పించాలని, బ్యాలెట్ పేపర్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. బెల్లంపల్లి రోడ్డు విస్తరణలో ఉపాధి కోల్పోయిన వారికి పునరావాసం కల్పించాలని, ఖాళీ భూముల కబ్జాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. సిపిఐ నాయకులు బొల్లం పూర్ణిమ, చిప్ప నరసయ్య, అక్కెపల్లి బాబు, లక్ష్మీ నారాయణ, కొల్లు బానేష్, జాడి పోషం, గుండా చంద్రమాణిక్యం, సోని పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రితో ఎంపి అరవింద్ భేటీ



ప్రజాపక్షం/నిజామాబాద్: ఎంపి అరవింద్ కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి డాక్టర వీరేంద్రకుమార్‌ను బుధవారం న్యూఢిల్లీలో కలిసారు. నియోజకవర్గంలోని దివ్యాంగుల సంక్షేమం, సాధికారతపై చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. దివ్యాంగుల సమస్యలు,సంక్షేమ పథకాలు, సహాయక పరికరాల పంపిణీ, ప్రభుత్వ సేవల సులభతపై ఎంపి వివరించారు. వీల్‌చైర్లు, వినికిడి పరికరాలు, కృత్రిమఅవయవాల కోసం అంచనా శిబిరాలు విస్తరించాలని కోరారు. విద్య, ఉపాధి, అవకాశాలు పెంచటంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాప్రదేశాల్లో అందుబాటు సౌకర్యాలు మెరుగుపర్చాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో కేంద్ర పథకాలు అర్హులందరికి చేరేలా పని చేస్తున్నామని ఎంపీ తెలిపారు. కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపి విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ దివ్యాంగుల సంక్షేమానికి అవసరమైన సహకారమందిస్తామని హామీనిచ్చారు.

## కార్మికులకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలి

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి విలాస్



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : ఎఐటియుసి అనుబంధ మెడికల్ కాంట్రాక్ట్ యూనియన్ జిడ్డి ఖానా శాఖ సమావేశం బుధవారం ఘనంగా జరిగింది. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ ఎస్.విలాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.కార్మికులకు నెలకు కనీస వేతనంగా 26,000 చెల్లించాలని, పీఎఫ్,ఈఎస్ఐ సౌకర్యాలు తక్షణమే కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 కార్మిక కోడ్‌లు కార్మిక వ్యతిరేకమైనవని, వాటిని వెంటనే రద్దు చేయాలని పేర్కొన్నారు. సెప్టెంబర్ 6, 7, 8 తేదీలలో కరీంనగర్‌లో జరగనున్న ఎఐటియుసి రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.జిడ్డి ఖానా నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక సమావేశంలో మెడికల్ కాంట్రాక్ట్ యూనియన్ జిడ్డి ఖానా శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గౌరవాధ్యక్షులు కామ్రేడ్ కే. శ్రీనివాసాచారి అధ్యక్షులు కామ్రేడ్ రాజేందర్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్యా రమేష్ కార్యదర్శి వినోద్ ఉపాధ్యక్షులు సత్యనారాయణ, సునీత కోశాధికారులు భాగ్యలక్ష్మి ,ఎన్. లక్ష్మి కమిటీ సభ్యులు శ్యామ్సన్, బందన్న, లావణ్య, సంగీత, డి. రాజమణిఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు కామ్రేడ్ ఎస్.ఎన్. రెడ్డి,పలువురు సీనియర్ నాయకులు, కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రింట్ మీడియా నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాపక్షం/బాల్కొండ : మండల ప్రింట్ మీడియా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. అధ్యక్షులుగా ప్రజాపక్షం విలేకరి తొగటి మురళి మోహన్, ప్రధాన కార్యదర్శిగా రాజుల రామనాథం, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నార్ల రాజు, ఉపాధ్యక్షులుగా కల్లెం భోజన్న, కోశాధికారిగా షేక్ షాదుల్లాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. ఈ కార్యవర్గం సంవత్సరం పాటు కొనసాగుతుందని సభ్యులు తెలిపారు. సమావేశంలో సభ్యులు బ్రహ్మరౌతు నర్సింగరావు, కట్కం శంకర్, వెంకటేష్, షేక్ యూసుఫ్, భూమేశ్వర్ పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం / జైపూర్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జైపూర్ మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయాన్ని ఆయన సందర్శించి తరగతి గదులు, వసతి, వంటశాల, కొనసాగుతున్న మరమ్మత్తు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని అధికారులను ఆదేశించారు. మరమ్మత్తు పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం చెన్నూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి నూతన భోజనశాలను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తరగతుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అలాగే గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి అదనపు గదుల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాలో నేరాలు.. దర్యాప్తులో వేగం పెంచాలి

జిల్లా ఎస్‌పి శ్రీనివాసరావు



ప్రజాపక్షం/మెదక్ : జిల్లాలో నేరాల నియంత్రణతో పాటు కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని మెదక్ జిల్లా ఎస్ పి డి వి శ్రీనివాస రావు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఎస్ పి మాట్లాడుతూ పోక్సో, గ్రేవ్, నాన్ గ్రేవ్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతిని సమీక్షించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, గ్రేవ్ కేసుల్లో శాస్త్రీయ ఆధారాలతో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నిందితులకు శిక్షపడేలా చూడాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్, బ్లూకోల్ట్స్, నైట్ పెట్రోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు జియోట్యాగింగ్ చేపట్టాలని, ప్రతిరోజూ డ్రంక్ డ్రైవ్ తనికీలు నిర్వహించి ఓవర్‌లోడ్ వాహనాలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

## ధరల పెరుగుదలను అరికట్టలేని మోదీ రాజీనామా చేయాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తాజుద్దీన్




ప్రజాపక్షం/సంగారెడ్డి : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిపిఐ ప్రచార యాత్ర లోభాగంగా భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ సమితి పిలుపు మేరకు ఆగస్టు 6 నుండి 14వ తేదీవరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నప్రజా సమస్యల పరిష్కార ప్రచార యాత్రను బుదవారం ఉదయం సధాశివపేట పట్టణంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం .తాజద్దీన్. ప్రారంబించారు.కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను విమర్శిస్తూ పెరుగుతున్న ధరలు ,నిరుద్యోగం, రైతు కూలీ సమస్యలు విద్యా వైద్యం పేదలకు అందుబాటులో ఉండాలని అన్నారు.పాండు, సాదీక్, అలీ ముస్తాఫా, యాక్యూబ్ ,శ్రీనివాస్ నాయక్, పూలమ్మ, ఎం.గంగమ్మ టీ.బుజ్జమ్మ, దేవి ,బిపాషా, రాజమ్మ, రహిమా ,రఫీ, దుర్గమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సభకు పటిష్ఠ ఏర్పాట్లు

కలెక్టర్ ప్రతీక్ జైన్



ప్రజాపక్షం/సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లాలో ఈ 15న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ సభకు పటిష్టమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబందిత శాఖల అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటన నేపథ్యంలో బుదవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ పరితోష్,పంకజ్, అడిషనల్ ఎస్పీ చైతన్యరెడ్డి, అడిషనల్ కలెక్టర్లు సంగీత ,పాండు పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ శ్యామ్‌ప్రసాద్ లాల్ తో కలిసి కలెక్టర్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. సీఎం పర్యటన రూట్ మ్యాప్ భద్రతా ఏర్పాట్లు హెలిప్యాడ్, సభా వేదిక ,పార్కింగ్ ,ట్రాపిక్, నియంత్రణ తదతర అంశాలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం పర్యటనకుఏ విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఏలాంటి అసౌకర్యాం కలగకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. హెలిప్యాడ్ నుంచి సీఎం ప్రయాణించే మార్గం ,సభావేదిక, రాకపోకలు, వాహనాల పార్కింగ్, రహదారులు ,విద్యుత్ ,త్రాగునీరు. పారిశుద్ధ్యం ,తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. స్థానిక అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించనున్న బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు, ప్రజాప్రతనిధులు, హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబందిత అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ఏ ర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పటిష్ఠమైన భద్రతా ప్రణాళికను అమలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. హెలీప్యాడ్, సీఎం రూట్ ,సభాప్రాంగణం, పార్కింగ్ ప్రాం తాలు, ట్రాపిక్, నియంత్రణ తదితర ప్రాంతాల్లో భద్రత చర్యలను సమన్వయంతో చేపట్టాలని సూచించారు. జిల్లా అదికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రి బాత్రూంలో పసికందు మృతదేహం

సదాశివపేటలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన దారుణం

ప్రజాపక్షం/సంగారెడ్డి : సదాశివపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఒళ్లు గగుర్పొడిచే విషాదకర సంఘటన ఒకటి బయటకు వచ్చింది. స్థానిక సిహెచ్ ఆసుపత్రిలోని మరుగుదొడ్డిలో ఓ మగ బిడ్డ చనిపోయి పడి ఉన్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 7వ తేదిన పేట ప్రభుత్వ ఆసుపత్రిలో మద్యాహ్నం రెండున్నర గంటల ప్రాంతంలో అక్కడే ఉన్న బాత్రూంలో గుట్టు చప్పుడు కాకుండా ఎవరికి ఎలాంటి అనుమానం రాకుండా ఎవరో వచ్చి అప్పుడే పుట్టి చనిపోయిన మగ బిడ్డను మరుగుదొడ్డిలో పడేసి వెళ్లారు. కాగా ఆసుపత్రిలో ఉన్న సిబ్బంది. అదే రోజు మద్యాహ్నం 3.20 గంటల ప్రాంతంలో ఈ విషయాన్ని గుర్తించారు.పోలీసులకు సమాచారం అందించారు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు మరుగుదొడ్డిలో మగ బిడ్డ ఏలా చనియోయాడు అనే కోణంలో విచారణ చేస్తున్నారు. పేట ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగిన ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపుతోంది.పోలీసులు సీసీ పుటేజ్ ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు. ఈ కేసు విచారణలో భాగంగా స్థానిక ఆశ వర్కర్ల ద్వార ఆ రోజు ఎక్కడెక్కడ ప్రసవాలు జరిగే అవకాశాలు ఉన్నాయి అనే వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. చుట్టుపక్కల ఉన్న గ్రామాలకు కూడా ఈ విషయాన్ని చేరవేసి మృతి చెందిన చంటి బిడ్డ తల్లి ఎవరు. అనే కోణంలో విచారణ సాగుతున్నట్లు సీఐ వెంకటేష్ మాట్లాడుతూ తెలిపారు. అప్పుడే పుట్టిన మగ బిడ్డను ఎవరో కావాలని చంపేసి మృతి చెందిన అనంతరం ఎవరకి అనుమానం రాకుండా ఉండేందుకు ముందుగా పథకం ప్రకారంగానే ఆసుపత్రి బాత్రూంలో పడేస వెళ్లినట్లు తెలుస్తోంది. 7నమా ఆసుపత్రిలో కేవలం ఒక ప్రసవం మాత్రమే జరగగా ఆ మహిళలకు ఆడపిల్ల పుట్టింది. ఇక్కడ జన్మనించిన ఆడపిల్ల బ్లడ్ గ్రూప్ O నెగిటివ్ ,కానీ మరుగుదొడ్డిలో పడేసి వెళ్లిన మగ బిడ్డ బ్లడ్ గ్రూప్ మాత్రం O పాజిటీవ్ గా తేలింది. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్నకొంత మంది మా సిబ్బంది సహకారంతోనే చనిపోయిన మగ బిడ్డను ఇక్కడే తెచ్చి మరుగుదొడ్డిలోవేసినట్లు మాకు అనుమానం కలుగుతుంది. అక్రమ సంబంధం నేపథ్యంలో ఎక్కడో ప్రైవేటు ఆసుపత్రిలో ప్రసవం అనంతరం బిడ్డను కావాలనే చంపి ఇక్కడే పడేసి వెళ్లినట్లుగా స్పష్టమవుతుందని తెలిపారు.

## పాఠశాలల సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు వినతి

ప్రజాపక్షం/ఎడపల్లి: ఎడపల్లి మండల కేంద్రం శివారులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, తెలంగాణ రాష్ట బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను బుధవారం జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ భవేష్ మిశ్రా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ కందగట్ల రాంచందర్ కలెక్టర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. విద్యాలయాల్లో నెలకొన్న పలు సమస్యలను సర్పంచ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు సరిపడా బెడ్స్ లేవని, ఖాళీగా ఉన్న హిందీ ఉపాధ్యాయురాలి పోస్టును వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఎడపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఖాళీగా ఉన్నా పీఈటీ పోస్టును భర్తీ చేయాలని, శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ కేంద్రాన్ని తాత్కలికంగా ఇందిరమ్మ మోడల్ హౌస్ కి మార్చాలని వినతి పత్రం సమర్పించారు. సర్పంచ్ విన్నవించిన సమస్యలపై స్పందించిన కలెక్టర్ భవేష్ మిశ్రా సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. సర్పంచ్‌తో పాటు బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లెపూల శ్రీనివాస్, కంజరి ప్రదీప్ కుమార్, రాఘవేందర్, మారసాయి పాల్గొన్నారు.

## గిరిజనుల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు

కలెక్టర్ కె. హరిత

ప్రజాపక్షం /జైనూర్ : జిల్లాలోని అర్హులైన పేద గిరిజనులకు ఆర్థికంగా తోడ్పాటు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కె.హరిత తెలిపారు. బుధవారం లింగాపూర్ మండలం చోర్ పల్లి గ్రామంలో తెలంగాణ సమ్మిళిత జీవనోపాధుల కార్యక్రమంలో భాగంగా కుటుంబాలకు ఉత్పాదకత యూనిట్ల పంపిణీ, ఊట కుంటలలో చేప పిల్లల విడుదల కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక కమిషనర్ శ్రీలక్ష్మి, జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జైనూర్ మార్కెట్ కమిటి చైర్మన్ కుద్మెత విశ్వనాథ్‌లతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. తిర్యాణి, లింగాపూర్ మండలాల్లోని ఎంపిక చేసిన గ్రామాల్లో గిరిజనులకు గేదెలు, మేకల పెంపకం, పిండి గిర్నీల ఏర్పాటు ద్వారా జీవనోపాధి కల్పించి పేదరికం నుంచి బయటకు వచ్చేలా చర్యలు చేపడుతున్నామని వివరించా రు.ఊట కుంటలలో చేప పిల్లలను వదిలి మాట్లాడారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, దుస్తుల తయారీ, పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు, బస్సుల నిర్వహణ ద్వారా మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు సంరక్షించాలని పిలుపునిచ్చారు.

## ఉచిత రెసిడెన్షియల్ పోలీస్ కోచింగ్

జిల్లా ఎస్పి నితికా పంత్



ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : తెలంగాణ ప్రభుత్వం పోలీసు శాఖలో వివిధ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసిన నేపథ్యంలో జిల్లా యువతకు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ అందించనున్నట్లు జిల్లా ఎస్పి నితికా పంత్ తెలిపారు. మొత్తం 139 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఫిజికల్ ట్రైనర్ల ఆధ్వర్యంలో తరగతి బోధనతో పాటు శారీరక శిక్షణ, ఉచిత వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల యువతీ యువకులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సమీప పోలీస్ స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాల ని ఎస్పి తెలిపారు. 15న నిర్వహించే ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపిన వారికి శిక్షణ ఇస్తామన్నారు.

## చెట్ల పొదల్లో ఆడ శిశువు

ప్రజాపక్షం/నిజామాబాద్: మోపాల్ మండల కేంద్రం నుంచి సిర్పూర్ వెళ్లే రోడ్డులోని బిసి హాస్టల్ సమీపంలో అప్పుడే జన్మించిన ఆడశిశువును గుర్తు తెలియని వ్యక్తులు చెట్ల పొదల్లో వదిలివెళ్లారు. పసికందు ఏడుపులు గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమందించటంతో 108 అంబులెన్స్‌లో పసిబిడ్డను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



## కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాపక్షం/మెదక్ : మెదక్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విధానంలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ నితిన్ కాబ్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాంట్రాక్ట్ విధానంలో 4 ప్రొఫెసర్లు, 5 అసోసియేట్ ప్రొఫెసర్లు, 6 సీనియర్ రెసిడెంట్లు, 3 ట్యూటర్ల పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపల్ వెల్లడించారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఆగస్టు 13 నుంచి ఆగస్టు 14 ,2026 మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీ, మెదక్‌లో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. అదేవిధంగా మెడికల్ కాలేజీలో ఔట్సోర్సింగ్ ప్రాతిపదికన పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన వివిధ ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 156 పోస్టులకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు.

**ఔట్సోర్సింగ్ పోస్టుల వివరాలు :** అనస్థీయా టెక్నీషియన్ 8, ఆడియోమెట్రిక్ టెక్నీషియన్ 1, ఆడియో విజువల్ టెక్నీషియన్ 1, బార్బర్ 6, బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ 3, కార్పెంటర్ 1 క్యాటలాగర్ 1, చైల్డ్ సైకాలజిస్ట్ 1, సీటీ టెక్నీషియన్ 4, డేటా ఎంట్రీ ఆపరేటర్ 37, డెంటల్ టెక్నీషియన్ 1, దోబీ/ప్యాకర్ 6, ఈసీజీ టెక్నీషియన్ 4, ఎలక్ట్రీషియన్ 6, గ్యాస్ ఆపరేటర్ 4, ల్యాబ్ అటెండర్ 19, మ్యూజియం అసిస్టెంట్ కమ్ ఆర్టిస్ట్ 1, ఆఫీస్ సబార్డినేట్ 24, ప్లంబర్ 2, సైకియాట్రిక్ సోషల్ వర్కర్ 1, రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్ 7, రేడియాలజీ టెక్నీషియన్ 1, రికార్డు క్లర్క్/రికార్డు




అసిస్టెంట్ 2, రిఫ్రాక్షన్ ఆప్టిషియన్ 1, స్పీచ్ థెరపి 1, థియేటర్ అసిస్టెంట్ 2, ఓటీ టెక్నీషియన్/ అనస్థీషియా 10,ఔట్సోర్సింగ్ పోస్టులకు ఆగస్టు 13, 2026 ఉదయం 11 గంటల నుంచి ఆగస్టు 20. 2026 మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీ, మెదక్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. పోస్టుల వారీగా విద్యార్హతలు, దరఖాస్తు ఫారం, నిబంధనలు తదితర పూర్తి వివరాల కోసం www. gmcmedak.org అధికారిక వెబ్ సైట్ ను సందర్శించాలని కళాశాల ప్రిన్సిపాల్ సూచించారు.

# 'ఎల్ నినో' ప్రభావంతో ఆలస్యమైన వరి నాట్లు

ప్రజాపక్షం / రెబ్బెన : ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు ఆలస్యంగా కురవడంతో ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలో వరి సాగు ఆలస్యమైంది. ముఖ్యంగా కుంటలు, చెరువుల కింద ఉన్న పొలాల్లో నాట్ల పనులు వాయిదా పడ్డాయి. జులై చివరి వారం, ఆగస్టు మొదటి వారంలో కురిసిన వర్షాలకు నీటి వనరులు నిండటంతో రైతులు ప్రస్తుతం ఉత్సాహంగా నాట్ల పనుల్లో నిమగ్నమయ్యారు. మండల వ్యవసాయ అధికారి దిలీప్ తెలిపిన వివరాల ప్రకారం ఇప్పటివరకు మండలంలో 2,500 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు అదనంగా 1,500 ఎకరాల్లో రైతులు మళ్లు సిద్ధం చేశారు. మొత్తం 4,000 ఎకరాల్లో నాటు పనులు వేగంగా సాగుతున్నాయి.



**ప్రత్యామ్నాయ పంటలే మేలు :దిలీప్**

నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని వ్యవసాయ అధికారి దిలీప్ సూచించారు. కంది, పెసర, మొక్కజొన్న, పత్తి వంటి తక్కువ నీటితో పండే పంటలను ఎంచుకుంటే నష్టభయం తగ్గుతుందని ఆయన పేర్కొన్నారు. రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చేలు దున్ని నాట్లకు సిద్ధం చేసినట్లు తెలిపారు. వట్టి వాగు నుంచి నీటిని వదిలితేనే నాట్లు వేసే వీలుంటుందని, అధికారులు వెంటనే స్పం దించి కాలువలకు నీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

## విద్యార్థి హక్కుల పోరాటంలో ఎఐఎస్ఎఫ్ ముందంజ



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎఐఎస్ఎఫ్) 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్మల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి.నాయకులు సంఘం జెండాను ఆవిష్కరించి, విద్యార్థి ఉద్యమాల్లో ఏఐఎస్ఎఫ్ పోషించిన చారిత్రాత్మక పాత్రను గుర్తుచేసుకున్నారు. 1936 ఆగస్టు 12న ఆవిర్భవించిన ఏఐఎస్ఎఫ్ నాటి నుండి నేటి వరకు విద్యార్థుల విద్యా, సామాజిక హక్కుల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని నాయకులు కోరారు.రాబోయే రోజుల్లో జిల్లాలోని విద్యార్థులందరినీ ఐక్యం చేసి విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలను మరింత విస్తృతం చేస్తామని పేర్కొన్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ప్రజాపక్షం/ధర్మపురి : ఫీల్డ్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారికి తగిన న్యాయం జరిగేలా కృషి చేస్తానని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హామీ ఇచ్చారు. బుధవారం జగిత్యాల జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం ప్రతినిధులు ధర్మపురి క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు పే స్కేల్ అమలు చేయాలని, ఈ అంశాన్ని రానున్న క్యాబినెట్ సమావేశంలో చర్చించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు. వారి సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి, ముఖ్యమంత్రితో పాటు పంచాయతీరాజ్ శాఖ మంత్రి, కమిషనర్‌లకు లేఖలు రాసి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు గడ్డం రమేష్, ప్రధాన కార్యదర్శి పొన్నం రాజా గౌడ్, జిల్లా ప్రతినిధులు, మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

**మైనారిటీ మహిళలకు సబ్సిడీ చెక్కుల పంపిణీ :** ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన పథకం కింద ధర్మపురి పట్టణ, మండల పరిధిలో ఎంపికైన 39 మంది మైనారిటీ మహిళలకు రూ.19.50 లక్షల విలువైన 100 శాతం సబ్సిడీ చెక్కులను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బుధవారం పంపిణీ చేశారు. ఒక్కో లబ్ధిదారుకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సబ్సిడీని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా ఎఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జగిత్యాల జిల్లా కార్యదర్శి అక్రమ్ మాలిక్, జిల్లా అధ్యక్షుడు మంద రాకేష్ మాట్లాడుతూ ఎఐఎస్ఎఫ్ చరిత్ర, విద్యార్థి ఉద్యమంలో సంస్థ పోషించిన కీలక పాత్ర గురించి వివరించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు ,మెరుగైన విద్యా వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు మనోజ్, ప్రణయ్,సాయి చందు, వరుణ్, సాయి, గాని, మనోహర్, రేవంత్, విష్ణు తేజ తదితరులు ఉన్నారు.

## లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



ప్రజాపక్షం/రామగిరి : సిపిఐ పార్టీ మొదలు పెట్టిన చైతన్య యాత్ర కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సిపిఐ పార్టీ ప్రజా చైతన్య యాత్ర బుధవారం మంథని సెంటినరీ కాలనీ మీదుగా 8 ఇంక్లైన్ కాలనీలోని షిర్కే బస్ స్టేషన్ వద్ద నుండి పాదయాత్ర చేసి తెలంగాణ చౌరస్తా వద్ద సభను ఏర్పాటు చేశారు సీపీఐ మండల కార్యదర్శి కందుకూరి రాజా రత్నం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం విచ్చేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు ఎండగట్టారు. ప్రజా చైతన్య యాత్రలో గౌతం గోవర్ధన్, గోసిక మోహన్, కోడెం స్వామి, కన్నెబోయిన కనకరాజ్, తాళ్ళపల్లి మల్లయ్య, కన్నం లక్ష్మి నారాయణ, ఎజ్జ రాజయ్య, ఆరేపల్లి మానస, నవీన్, జుల మోహన్, అసలా రమ పాల్గొన్నారు. ప్రజా చైతన్య యాత్ర చేస్తున్న నాయకులను అర్జీ 2 బ్రాంచ్ నాయకులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ప్రకాష్ ,మండల కార్యదర్శి కందుకూరి రాజా రత్నం, అర్జీ2 బ్రాంచ్ కార్యదర్శి గంధం సాంబశివరావు, సహాయ కార్యదర్శి శ్యాం సన్, ఓసిపి3 పిట్ సెక్రటరీ మోటపలుకుల మహేందర్, పిట్ సెక్రటరీ సెగ్గం శంకర్, వకీల్ పల్లి పిట్ సెక్రటరీ బొంత రాజు, ఏబ్ల్యూఎస్ పిట్ సెక్రటరీ తాళ్ళపల్లి నారాయణ, పుల్లయ్య, మదన్, మోహన్, కడారీ లింగయ్య, జాడి ఆంజనేయులు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘం ఎఐఎస్ఎఫ్



ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం

ప్రజాపక్షం/పెద్దపల్లి : అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు ఆర్నకొండ సాయి ఆజాద్ అధ్యక్షత వహించగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ముఖ్యఅతిథిగా హాజరై శ్వేత అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్నటువంటి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ పాఠశాలలలో, కళాశాలలలో మౌలిక సదుపాయాల కల్పించాలని, పెండింగ్‌లో ఉన్నటువంటి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని, మెస్, కాస్మోటిక్ చార్జీలను ధరలకు అనుగుణంగా పెంచాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమాలు, పోరాటాలు చేస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని ఆయన అన్నారు. విద్యార్థులకు అండ,ఏఐఎస్ఎఫ్ జెండా ఎల్లప్పుడూ ఉంటదని, అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) పెద్దపల్లి జిల్లా సమితి ఇచ్చే పిలుపులకు విద్యార్థి లోకం తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మనీషా, శ్రావణి, ఉర్మిళ, అశ్విని, స్వాతి, శ్రీయ, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ డెలివరీ ప్రక్రియ వేగవంతం



కలెక్టర్ చిత్రా మిశ్రా

ప్రజాపక్షం/కరీంనగర్ : 2025–26 వానకాలం, రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా రైస్ మిల్లర్లను ఆదేశించారు. సీఎంఆర్‌ను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, సంబంధిత గోదాముల్లో భద్రపరిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి నర్సింగరావు, జిల్లా మేనేజర్ రజనీకాంత్‌తో కలిసి రైస్ మిల్లర్లతో సీఎంఆర్ డెలివరీ ఎఫ్‌సిఐ గోదాంల ఖాళీ చేసే అంశంపై సమీక్ష నిర్వహించారు. రబీ సీజన్‌కు సంబంధించి మిల్లులకు కేటాయించిన ధాన్యం, ఇప్పటివరకు పూర్తయిన సీఎంఆర్ డెలివరీ, మిగిలిన పరిమాణం తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తికానిచోట సీఎంఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని త్వరగా ముగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎఫ్‌సీఐ గోదాములకు సీఎంఆర్ బియ్యాన్ని తరలించే ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. గోదాముల్లో సీఎంఆర్ బియ్యాన్ని భద్రపరిచే ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు రైస్ మిల్లర్లు పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నాటి నుండి నేటి వరకు విద్యార్థుల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : నాటి నుండి నేటి వరకు విద్యార్థుల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తూ 90 సంవత్సరాలు పూర్తి చేసుకుని 91వ సంవత్సరంలో అడుగుపెడుతున్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కుర్ర రాకేష్, మంద అనిల్ కుమార్లు అన్నారు. ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని ఎస్సీ కళాశాల బాయ్స్ హాస్టల్ ముందు ఏఐఎస్ఎఫ్ గర్ల్స్ కన్వీనర్ బర్రెంకల శ్రీహారిక జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి కుర్ర రాకేష్, మంద అనిల్ కుమార్ మాట్లాడుతూ స్వతంత్ర ఉద్యమంలో నేడు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమం చేసిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు పెండెల ఆదిత్య, సహాయ కార్యదర్శి భూక్యా సందీప్ నాయకులు తోట్ల రాజు, ప్రణయ్, వినయ్, సాయి, దీక్షిత్, సాయి గణేష్, అశ్విన్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజలకు సమర్థవంతమైన సేవలు

ఎస్‌పి అశోక్ కుమార్



ప్రజాపక్షం/జగిత్యాల : ప్రజలకు పోలీస్ సేవలు మరింత వేగంగా, సమర్థవంతంగా అందించేందుకు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బందితో జిల్లా ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. బ్లూ కోల్ట్, పెట్రో కార్స్ సిబ్బంది విజిబుల్ పోలీసింగ్, అత్యవసర స్పందన, నేర నియంత్రణ, నేరస్తులపై నిఘా, కమ్యూనిటీ పోలీసింగ్‌లో కీలక పాత్ర పోషించాలని సూచించారు. హాట్ స్పాట్‌ల వద్ద పెట్రోల్ వాహనాలను కొద్దిసేపు నిలిపి, అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పద వాహనాలు, కదలికలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. ముఖ్యంగా బ్యాంకులు, ఎటిఎంల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కంట్రోల్ రూమ్, పోలీస్ స్టేషన్, డయల్ 112 లేదా ప్రజల నుంచి అత్యవసర సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు తక్షణ సహాయం అందించాలి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించడం, బాధితులు, సాక్షుల నుంచి సమాచారం సేకరించడం, సంఘటనా స్థలాన్ని భద్రపరచడం వంటి చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు. రౌడీషీటర్లు, తరచూ నేరాలకు పాల్పడే వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగించాలని సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత పాఠశాలలు, కళాశాలలు, కాలనీలు, రెసిడెంట్ అసోసియేషన్లు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలతో తరచూ కమ్యూనిటీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనల్లో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తులను సకాలంలో గుర్తించి, వేగంగా స్పందించి వారి ప్రాణాలను కాపాడిన బ్లూ కోల్ట్, పెట్రోల్ కార్ సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తతతో, సమయస్ఫూర్తితో వ్యవహరించి విలువైన ప్రాణాలను కాపాడటం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిసిఆర్‌బి డిఎస్పి రవి కుమార్, బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బంది పాల్గొన్నారు.

# పారిశ్రామికవేత్తలుగా గిరిజనులు ఎదగాలి




మాజీ మంత్రి హరీష్‌రావు

ప్రజాపక్షం/సిద్దిపేట : ఎస్సీ, ఎస్టీ భూములకు పట్టాలు ఇస్తానని అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి.. లక్షల ఎకరాల అసైన్డ్ భూములు గుంజుకొని పేదలను రోడ్డు పాలు చేశారని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. లగచర్ల భూములను ఇవ్వమన్న పాపానికి లంబాడీ బిడ్డలను జైల్లో పెట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్నారు. గిరిజనుల భూములను లాక్కొని సిఎం రేవంత్‌రెడ్డి తన సోదరులు, అల్లునికి కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఎస్టీ ఎస్టీఎఫ్ నిధులు బడ్జెట్‌లో పెడుతున్నారని, సగం నిధులు నిధులు కూడ కావటం లేదని, యువతకు జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి ఎక్కడ ఉద్యోగాలు ఇచ్చిన దాఖలాలు లేవని హరీష్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ట్రైబర్ ఇండియన్ చాంబర్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ టిఐసిసిఐ ఆధ్వర్యంలో జరిగిన గిరిజన పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సు, సిద్దిపేట చాప్టర్ జిల్లా చాప్టర్ ప్రారంభోత్సవంలో మాజీ మంత్రి హరీష్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉద్యోగాలు వేతుక్కునే స్థాయి నుండి పదిమందికి ఉద్యోగాలు ఇచ్చే పారిశ్రామిక వేత్తలుగా గిరిజన యువతను మార్చాలని గొప్ప లక్ష్యంతో టిక్కి పనిచేస్తుందని అభినందించారు. సిద్దిపేట జిల్లాలో ఎస్టీ యువతి, యువకులు టిక్కి సేవలను సద్వినియోగం చేసుకోని నైపుణ్యాలను పెంచుకొని గొప్ప పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నారు.

**ఎల్వీ ఆసుపత్రిని సందర్శించిన హరీష్‌రావు**

సిద్దిపేట ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిని మాజీ మంత్రి హరీష్‌రావు బుధవారం సందర్శించారు. ప్రతి నెల 60శాతం సర్జరీలు పేదలకు ఉచితంగా జరగటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రతిరోజు 150కు పైగాకంటి పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, పాల సాయిరాం తదితరులు పాల్గొన్నారు.




## భద్రత, నేరాల నియంత్రణే లక్ష్యం

సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్

ప్రజాపక్షం/గజ్వేల్ : ప్రజల భద్రత, నేరాల నియంత్రణ తమ లక్ష్యమని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ స్పష్టం చేశారు. బుధవారం గౌరారంలో 16 సిసి కెమెరాలు ప్రారంభించారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రజల భద్రతను మరింత పటిష్టం చేయడం, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచడం లక్ష్యంగా చేపట్టిన సిద్దిపేట సురక్ష నేత్ర కార్యక్రమం చేపట్టినట్లు ఆమె తెలిపారు. ఇందులో భాగంగానే స్నేహ పౌల్ట్రీ ఫార్మ్ యాజమాన్యం అందించిన ఆర్థిక సహకారంతో 16 సిసి కెమెరాలు బిగించగా, ఈ ప్రాంతంలో నిరంతర నిఘా కొనసాగనున్నట్లు చెప్పారు. సిసి కెమెరాలు నేరాల నియంత్రణతో పాటు నేరాలు జరిగిన సందర్భంలో నిందితులను గుర్తించడంలో పోలీసులకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజలు కూడా తమ పరిసర ప్రాంతాల్లో సిసి కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని, సమాజ భద్రతలో భాగస్వాములు కావాలని సూచించారు. గౌరారంలో సిసి కెమెరాల ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందించిన స్నేహ పౌల్ట్రీ ఫార్మ్ యాజమాని రాంరెడ్డికి పోలీస్ శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నర్సింలు, సిఐ రవిరాజు, ఎస్సై ఆరోగ్యం, సర్పంచ్ కనకరాజు గౌడ్ పాల్గొన్నారు.

# నారాయణపూర్ కుడి కాలువ పూర్తి చేస్తాం

నారాయణపూర్ ప్రాజెక్ట్ అభివృద్ధికి రూ.43.50 కోట్లు మంజూరు చేయించా : ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



ప్రజాపక్షం/గంగాధర : చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్‌తోపాటు కుడి కాలువ నిర్మాణాన్ని పూర్తి చేసి ఇక్కడి భూములను సస్యశ్యామలం చేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నారాయణపూర్ రిజర్వాయర్ కింద ముంపునకు గురవుతున్న భూమలు, ఇండ్ల కోసం, కట్ట ఎత్తు పెంచడం, బండ్ పటిష్టం, కాలువల నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రూ.43.50 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలోనే కుడి కాలువ నిర్మాణ పనులను ప్రారంభిస్తామని ఏడాది కాలంలో పనులు పూర్తి చేసి నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి సాగునీటిని విడుదల చేయిస్తామని భరోసా ఇచ్చారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం నారాయణపూర్ రిజర్వాయర్ కోసం ఒక్క రూపాయి కేటాయించలేని ఎద్దేవా చేశారు. పని చేతకాని బిఆర్ఎస్ నాయకులు అబద్దాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. నారాయణపూర్ నిర్వాసితులకు అన్యాయం జగనివ్వమని దశలవారిగా ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని పేర్కొన్నారు. ప్రజలెవరు ప్రతిపక్షాల మాటలను నమ్మి ఆందోళన చెందవద్దని చొప్పదండి నియోజకవర్గ ప్రజలను తన కడుపులో పెట్టి కాపాడుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో గంగాధర, బోయినపల్లి మండలాల సర్పంచుల ఫోరం అధ్యక్షులు ముద్దం నగేష్, బీమ్‌రెడ్డి మహేశ్వర్ రెడ్డి, సర్పంచులు వేముల భాస్కర్, బారాజు ప్రభాకర్ రెడ్డి, బాసవేణి శ్రీనివాస్, ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, ఏనుగుల కనకయ్య, రోమాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు



కలెక్టర్ కోయ శ్రీహర్ష

ప్రజాపక్షం/పెద్దపల్లి : జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యారోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో వైద్యారోగ్య శాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వైద్య సేవలకు అవసరమైన సిబ్బంది నియామక ప్రక్రియను అవసరాలకు అనుగుణంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అందుబాటులో ఉన్న సిబ్బందిని అవసరమైన ఆసుపత్రులకు సర్దుబాటు చేసి ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆసుపత్రుల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వ ఆసుపత్రుల పరిసరాలు, వార్డులు, వైద్య గదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రజల నుంచి వచ్చే వైద్య సేవల సంబంధిత ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ పవిత్ర, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీధర్, సుల్తానాబాద్ డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రమాదేవి, వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ‘కెసిఆర్ కంటి వెలుగు’ పునఃప్రారంభం



వీర్నపల్లిలో కంటి అద్దాలు పంపిణీ చేసిన కెటిఆర్

ప్రజాపక్షం/వీర్నపల్లి : గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ‘కెసిఆర్ కంటి వెలుగు’ కార్యక్రమాన్ని వీర్నపల్లి మండల కేంద్రంలో పునఃప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా మండల అధ్యక్షులు గుజ్జుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో దాదాపు 5000 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 1371 మందికి కంటి అద్దాలు, 171 మందికి కంటి ఆపరేషన్లు అవసరం కాగా బుధవారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక ఎమ్మెల్యే కేటీ రామారావు చేతుల మీదుగా కంటి అద్దాలను అందించి, త్వరలో జిల్లా కేంద్రంలోని ఎల్‌వి ప్రసాద్ దవాఖానాలో ఉచిత ఆపరేషన్లు చేయిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ అధికారం శాశ్వతం కాదని, చేసిన మంచి పనులు కలకాలం నిలిచిపోతాయని, ముఖ్యమంత్రిగా కేసీఆర్ ముందుచూపుతో మంచి ఆలోచన చేసి ఈ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కంటి వెలుగు పథకాన్ని కొనసాగించకపోయిన, జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామని కెటిఆర్ స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలు ప్రజలకు త్వరగా చేరాలనే ఉద్దేశంతో నూతన మండలాలను, జిల్లాలను తమ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశామని, అందులో భాగంగా ఏర్పడ్డ వీర్నపల్లి మండలంలోని ప్రజలు జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్న తన గుండెకు చాలా దగ్గరగా ఉన్నారని, మండలాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్యతో పాటు, నాస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, సెస్ డైరెక్టర్ మాడ్గుల మల్లేశం, స్థానిక సర్పంచ్ మల్లారపు జోత్స్న, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు అరుణ్‌కుమార్, మాజీ జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు చాంద్ పాషా, మండల బీఆర్ఎస్ నాయకులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



## స్వాతంత్ర్యం కోసం పోరాడిన విద్యార్థి సంఘం ఎఐఎస్ఎఫ్

ఎఐఎస్ఎఫ్ మాజీ నాయకుడు వొద్దమల్ల విజయ్ భాస్కర్

ప్రజాపక్షం/కరీంనగర్ : ఎఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం కరీంనగర్ నగరంలోని తెలంగాణ చౌక్ వద్ద ఎఐఎస్ఎఫ్ శ్వేతా అరుణ పతాకాన్ని ఎఐఎస్ఎఫ్ మాజీ నాయకుడు, సీనియర్ జర్నలిస్ట్ విజయ్ భాస్కర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ్ భాస్కర్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కోసం మద్దతు తెలిపి ఉద్యమించిన ఏకైక విద్యార్థి సంఘం ఎఐఎస్ఎఫ్ అని అన్నారు. చదువుతూ పోరాడు చదువుకై పోరాడు అనే నినాదంతో విద్యలో అందరికీ సమాన అవకాశాలు రావాలని, ప్రభుత్వాలు విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అలుపెరుగని పోరాటం నిర్వహిస్తున్న చరిత్ర ఎఐఎస్ఎఫ్‌కు ఉందన్నారు. పాలక ప్రభుత్వాలు విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేసి విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని, స్వాతంత్రం కోసం ఉద్యమించిన సంఘం ఏఐఎస్ఎఫ్‌లో నూతన విద్యార్థులు చేరాలని విజయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి బోనగిరి మహేందర్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నునవత్ శ్రీనివాస్ నాయక్, ఉప్పల శాంతికుమార్, నగర నాయకులు కసిరెడ్డి సందీప్ రెడ్డి, బోయినీ విష్ణు, జోత్స్న పాల్గొన్నారు.

## కాళేశ్వరం జలాలతో కళకళలాడుతున్న చెరువులు

ఎమ్మెల్యే గంగుల కమలాకర్

ప్రజాపక్షం/కొత్తపల్లి : కాళేశ్వరం జలాలతో కరీంనగర్ నియోజకవర్గ పరిధిలోని కొత్తపల్లి మండలం బావుపేట శివారు బావు చెరువు నిండి మత్తడి దూకడంతో మండలంలోని పలు గ్రామాల రైతులు హర్షాతిరేకాల మధ్య వన భోజన వేడుకలను నిర్వహించారు. ఈ ప్రత్యేక వేడుకలకు కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ముఖ్య అతిథిగా హాజరై రైతన్నలతో కలిసి ఉత్సాహంగా గడిపారు. ఎమ్మెల్యే కమలాకర్ బావుచెరువు వద్ద కొలువైన మైసమ్మ తల్లికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెరువులో పసుపు, కుంకుమలు,పూలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రైతన్నలతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఈ ప్రాంతం ఒక సాధారణ గ్రామంగా ఉండేదని గుర్తు చేశారు. ఎల్నినో ప్రభావం వల్ల ఈ ఏడాదిపాటు నీరు పొదుపుగా వాడుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంచాల ఆంజనేయులు, మాజీ ఎంపిపి పిల్లి శ్రీలత మహేశ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేని మధు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, దావ మనోహర్, కడార్ల శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# పిఎంఇజిపి రుణాల అక్రమాలపై కొరడా

సత్తుపల్లి డిసిసిబి మేనేజర్ సస్పెన్షన్

విచారణలో లేని యూనిట్ల పేరుతో రుణాల వ్యవహారం వెలుగులోకి

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పిఎంఇజిపి రుణాల మంజూరులో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వచ్చిన అక్రమాలపై వరుసగా వెలువడిన కథనాలు అధికార యంత్రాంగంలో కదలికకు దారితీశాయి. సత్తుపల్లి డిసిసిబిలో పిఎంఇజిపి (ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకం) రుణాల వ్యవహారంపై 'ప్రజాపక్షం' దినపత్రికతో పాటు పలు పత్రికలు వరుస కథనాలు ప్రచురించడంతో అధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు టెస్కాబ్ అధికారులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. విచారణ సందర్భంగా అధికారులు పరిశీలించిన రికార్డులు, రుణాలకు సంబంధించిన వివరాలు, యూనిట్ల స్థితిగతులపై పలు అంశాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ముఖ్యంగా వాస్తవంగా లేని యూనిట్లను ఉన్నట్లుగా చూపిస్తూ రుణాల ప్రక్రియ కొనసాగించినట్లు విచారణలో గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ వ్యవహారంలో భారీ స్థాయిలో అవకతవకలు జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలిన నేపథ్యంలో




సత్తుపల్లి డిసిసిబి మేనేజర్ జంగం కిషోర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. డిసిసిబి సిఇఒ కృష్ణ ఆదిత్య బుధవారం ఈ విషయాన్ని వెల్లడించారు. టెస్కాబ్ అధికారులు సమర్పించిన విచారణ నివేదిక ఆధారంగానే మేనేజర్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం అందిన నివేదిక ప్రాథమిక స్థాయిలో ఉందని, పూర్తిస్థాయి విచారణ నివేదిక అందిన అనంతరం బాధ్యులపై మరింత కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

### వరుస కథనాలతో కదిలిన యంత్రాంగం

పిఎంఇజిపి రుణాల మంజూరులో అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఈ అంశంపై 'ప్రజాపక్షం'తో పాటు ఇతర పత్రికలు వరుసగా కథనాలు ప్రచురించాయి. రుణాలు మంజూరైన యూనిట్ల వాస్తవ పరిస్థితి, బ్యాంకు రికార్డుల్లో నమోదైన వివరాలు, క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితుల మధ్య వ్యత్యాసాలపై కథనాలు ప్రశ్నలు లేవనెత్తాయి. అయితే సత్తుపల్లి డిసిసిబిలో జరిగినట్లు చెబుతున్న వ్యవహారంలో క్షేత్రస్థాయిలో లేని యూనిట్లను ఉన్నట్లుగా చూపించడం, వాటి ఆధారంగా రుణాల ప్రక్రియ చేపట్టడం వంటి అంశాలు విచారణలో బయటపడినట్లు అధికారులు పేర్కొంటున్నారు. దీంతో రుణాల మంజూరులో సంబంధిత అధికారులు ఏ స్థాయిలో పరిశీలన జరిపారు? క్షేత్రస్థాయి తనిఖీలు సక్రమంగా జరిగాయా? రికార్డుల్లోని వివరాలను ఎవరు ధ్రువీకరించారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రాథమిక విచారణలోనే అక్రమాలు వెలుగులోకి రావడంతో డిసిసిబి మేనేజర్‌పై సస్పెన్షన్ వేటు పడటం ఈ వ్యవహారాన్ని బ్యాంకు యంత్రాంగం తీవ్రంగా పరిగణిస్తున్నదనే సంకేతంగా కనిపిస్తోంది. అయితే మొత్తం వ్యవహారంలో ఇంకా ఎవరెవరి పాత్ర ఉంది? రుణాల మంజూరులో ఏ స్థాయిలో లోపాలు జరిగాయి? నిబంధనలను ఎవరు ఉల్లంఘించారు? రుణాల మొత్తం ఎంత? వాస్తవంగా యూనిట్లు ఎన్ని ఉన్నాయి? లేని యూనిట్ల పేరుతో ఎంత మొత్తం రుణాలు మంజూరయ్యాయి? వంటి అంశాలపై పూర్తిస్థాయి విచారణలో స్పష్టత రావాల్సి ఉంది. పూర్తి నివేదిక అందిన తర్వాత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఇఒ కృష్ణ ఆదిత్య స్పష్టం చేయడంతో ఈ వ్యవహారంలో మరిన్ని చర్యలు ఉండే అవకాశం కనిపిస్తోంది. రైతులకు ఇబ్బందులు లేకుండా బ్యాంకు సేవలుమరోవైపు పిఎంఇజిపి రుణాల వ్యవహారంలో చోటుచేసుకున్న ఆరోపణల ప్రభావం సాధారణ రైతులు, ఖాతాదారులు, రుణగ్రహీతలపై పడకుండా డిసిసిబి యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని సిఇఒ తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వారి సౌకర్యార్థం బ్యాంకు సేవలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే వారిని ఎంతటి స్థాయిలో ఉన్నా ఉపేక్షించబోమని ఆయన హెచ్చరించారు. కిందిస్థాయి అధికారులు చేసే తప్పిదాలను కూడా నిర్లక్ష్యం చేయబోమని, బ్యాంకు నిబంధనలు, విధివిధానాలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వరుస కథనాల నేపథ్యంలో ప్రారంభమైన విచారణతో సత్తుపల్లి డిసిసిబిలో తొలి చర్యగా మేనేజర్ సస్పెన్షన్ చోటుచేసుకుంది. ఇక పూర్తిస్థాయి విచారణ నివేదికలో ఇంకెన్ని విషయాలు వెలుగులోకి వస్తాయి? బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## పోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదు..జరిమానా

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఖమ్మం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2023 సెప్టెంబర్ నెలలో పాఠశాలకు వెళ్తున్న బాలికకు మాయమాటలు చెప్పి ఓ యువకుడు లైంగికదాడికి పాల్పడగా ఆ కేసులో నిందితుడికి జీవిత ఖైదు, రూ.57 వేల జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి డాక్టర్ పుల్లభట్ల పోగడ కృష్ణార్జున్ బుధవారం తీర్పు వెల్లడించినట్లు టూటౌన్ సిఐ బాలకృష్ణ తెలిపారు. సూర్యాపేట జిల్లా అంజనాపురి కాలనీకి చెందిన నిందితుడు అల్లి రాకేష్ గతంలో ఘటన జరిగిన సమయంలో ఖమ్మంలోని బాధిత బాలిక ఇంటిపక్కన అద్దెకు ఉండేవాడన్నారు. పాఠశాలకు వెళ్లే సదరు బాలికతో పరిచయం పెంచుకుని మాయామాటలు చెప్పి బయటకు తీసుకువెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడని తెలిపారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు గతంలో వివిధ సెక్షన్లతో పాటు పోక్సో చట్టం కింద కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేపట్టి నిందితుడు రాకేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించామన్నారు. సదరు కేసుకు సంబంధించి సాక్ష్యాధారాలతో కోర్టులో దాఖలు చేశామన్నారు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాధారాలు, వైద్య నివేదికలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడిపై మోపిన నేరం రుజువు కావడంతో ఈ తీర్పు ఇచ్చినట్లు సిఐ తెలిపారు. ప్రాసిక్యూషన్ త్వరితగతిన పూర్తిచేసినందుకు అదనపు ప్రాసిక్యూటర్ జమ్ముల శరత్‌కుమార్ రెడ్డి వాదించగా అప్పటి విచారణాధికారి ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, ప్రస్తుత ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, భరోసా లీగల్ అధికారిణి ఎం. ఉమారాణి, కోర్టు కానిస్టేబుల్ తల్లా రమణ, లైజనింగ్ ఆఫీసర్ శ్రీకాంత్, హోంగార్డ్ ఆయూబ్, చిట్టిబాబును పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఈ సందర్భంగా అభినందిచినట్లు సిఐ తెలిపారు.

## గురుకుల పాఠశాలను పరిశీలించిన సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్



**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండలం అడివిమల్లెల గురుకుల పాఠశాలను సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల, వసతి గృహంలోని పరిస్థితులను పరిశీలించి, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, పారిశుద్ధ్య పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎలుకల నిర్మూలనకు తక్షణమే సమగ్ర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వసతి గృహం మరియు ఇతర ప్రాంతాల్లో ఎలుకలు ప్రవేశించకుండా దెబ్బతిన్న మెస్ లను వెంటనే మరమ్మతు చేయాలని, అవసరమైన చోట కొత్త మెష్ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే పాఠశాల, వసతి గృహ ప్రాంగణాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి, క్రమం తప్పకుండా పెస్ట్ కంట్రోల్ చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి స్పష్టం చేశారు. ఎలుకల నిర్మూలన, మెస్ మరమ్మతులు తదితర అవసరమైన పనులను వెంటనే పూర్తి చేసి, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

## నిరుద్యోగ యువతకు సువర్ణ అవకాశం

డాక్టర్ కాపా మురళీకృష్ణ



**ప్రజాపక్షం/వైరా:** వైరా నియోజకవర్గంలో డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని జిల్లా కాంగ్రెస్ మెడికల్ హెల్త్ అధ్యక్షుడు డాక్టర్ కాపా మురళీకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ.. గత ఏడాది వైరా కేంద్రంగా జాబ్‌మేళా నిర్వహించి పలువురు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన నేపథ్యంలో మరోసారి ప్రైవేటు కంపెనీలు, బ్యాంకింగ్ సంస్థల హెచ్‌ఆర్ విభాగాలతో సమన్వయం చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు. దరఖాస్తులను 16 వరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద అందించాలని సూచించారు. నియోజకవర్గంలోని డిగ్రీ పాసైన నిరుద్యోగ యువతీ, యువకులు తమ విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు రెస్యూమ్ తీసుకెళ్లి దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అర్హత ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం చంద్రశేఖర్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వీరంశెట్టి సీతారాములు, సర్పంచ్ బాలాజీ, మచ్చా బుజ్జి, పెద్దప్రోలు లక్ష్మయ్య, అన్వర్ తోటకూర శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## 'శ్రీ చైతన్య'లో 3రోజుల వర్క్‌షాప్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని శ్రీ చైతన్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ (ఆటోనమస్)లో పిసిబి డిజైన్ హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ అనే అంశంపై మూడురోజుల వర్క్‌షాప్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రముఖ సెమికండక్టర్ నిపుణులు, రిసోర్స్ పర్సన్ భాను ప్రకాష్, సీనియర్ టెక్నికల్ హెడ్, అం బ్సెట్ టెక్నోవేషన్ సంబంధిత విషయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మినారాయణ, ఇసిఇ విభాగధిపతి డాక్టర్ రాజేష్, కళాశాల ట్రైనింగ్ డీన్ డాక్టర్ సుదర్శన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, డిప్లొమా ఇంచార్జ్ కృష్ణప్రసాద్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సుజాత, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు జన చైతన్య యాత్ర ముగింపు సభ

ఖమ్మంలో భారీ ప్రదర్శన

హాజరుకానున్న కూనంనేని, బాగం

సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** 'బద్లావ్ జరూరీ హై' పేరుతో సిపిఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపు మేరకు ఖమ్మం జిల్లాలో జరిగిన జన చైతన్య యాత్ర ముగింపు సభ గురువారం ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. 6న ప్రారంభమైన జన చైతన్య యాత్ర 250 గ్రామాల్లో సాగిందని ఆయన తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకోవడంతో పాటు మోదీ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించడం జరిగిందన్నారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయకపోతే ప్రజా వ్యతిరేకత ఎదుర్కొనక తప్పదని హెచ్చరిస్తూ గ్రామాల్లో ప్రచారం చేయడం జరిగిందన్నారు. గుర్తించిన సమస్యలు పరిష్కరించాలని హామీల అమలుపై స్పందించక పోతే పోరాట కార్యాచరణ రూపొందించుకుని ఆందోళనను ఉధృతం చేస్తామని సురేష్ తెలిపారు. ముగింపు సందర్భంగా ఖమ్మంలో మూడు ప్రాంతాల నుంచి ప్రదర్శన నిర్వహించనున్నామని సురేష్ తెలిపారు. మొదటి ప్రదర్శన ఖమ్మం నయాబజార్ జూనియర్ కళాశాల నుంచి బయలుదేరి గాంధీచౌక్ మీదుగా జెడ్‌పి సెంటర్‌కు చేరుకుంటుందని, రెండవ ప్రదర్శన అల్లిపురం క్రాస్ రోడ్డు నుంచి ప్రారంభమై ముస్తఫానగర్, బోనకల్ రోడ్డు మీదుగా జెడ్‌పి సెంటర్‌కు చేరుకుంటుందన్నారు. మూడవ ప్రదర్శన రోటరీ నగర్ సిపిఐ కార్యాలయం నుంచి బయలుదేరి మమత రోడ్డు, ఇల్లందు క్రాస్ రోడ్డు మీదుగా జెడ్‌పి సెంటర్‌కు చేరుకుంటుందని, జెడ్‌పి సెంటర్ నుంచి మహా ప్రదర్శన పాత బస్టాండ్ మయూరిసెంటర్ మీదుగా భక్తరామదాసు కళాక్షేత్రానికి చేరుకుంటుందన్నారు. భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగే సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని సురేష్ తెలిపారు.

## ప్రతీ ఇంటి నుంచి చెత్త సేకరించాలి

కమిషనర్ అభిషేక్ అగస్త్య

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రతీ ఇంటి నుంచి చెత్తను తప్పనిసరిగా సేకరించాలని ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. బుధవారం ఖమ్మం నగరంలోని నాల్గవ డివిజన్‌లో కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో కమిషనర్ మాట్లాడి ట్రాక్టర్, ఆటోలు ఏ సమయానికి వస్తున్నాయి, చెత్త సేకరిస్తున్నారా లేదా, డ్రైనేజీలను శుభ్రం చేస్తున్నారా, పారిశుద్ధ్య సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాన్ని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ఏ సమయానికి విధులకు హాజరవుతున్నారు, చెత్త సేకరణ, రూట్ మ్యాప్ ప్రకారం వాహనాలు తిరుగుతున్నాయా వంటి వివరాలను తెలుసుకున్నారు. డైలీ రూట్ మ్యాప్ బుక్స్, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతీ రోజు ట్రాక్టర్లు, ఆటోలు తమకు కేటాయించిన రూట్ మ్యాప్ ప్రకారం ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాలన్నారు. డివిజన్లలో కాలువలలో పేరుకుపోయిన మట్టి, పూడిక, గడ్డిని పూర్తి స్థాయిలో తొలగించాలన్నారు. నీటి ప్రవాహానికి ఆటంకం కలగకుండా చూడాలన్నారు. ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా శుభ్రంగా ఉంచాలని జవాన్, సిబ్బందిని ఆదేశించారు. సమయపాలనతో విధులు నిర్వహించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

## మద్యం మత్తులో బంజార నాయకుడు హల్‌చల్

రెండు గుంటల భూమి ఇస్తే ఓకే: లేకపోతే అంతుచూస్తానని బెదిరింపులు




**ప్రజాపక్షం/చంద్రుగొండ:** ఏజెన్సీ చట్టాలను అడ్డుపెట్టుకొని మండలంలో అధికారులను బెదించడం పరిపాటిగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల సమాచారం చట్టం ప్రకారం రెవెన్యూ భూముల వివరాలను తెలుసుకున్న బంజరా నాయకుడు చంద్రుగొండ సబ్ రిజిస్ట్రార్‌ను గత కొంతకాలంగా రెండు గుంటల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, రెవెన్యూ అధికారుల నుంచి ఎటువంటి హామీ రాకపోవడంతో మద్యం సేవించిన సదరు బంజార నాయకుడు 11న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోకి చొరబడి సబ్ రిజిస్ట్రార్‌ను నేరుగా బెదిరించాడనే విమర్శలున్నాయి. గంటన్నర పాటు రెవెన్యూ కార్యాలయంలో దర్జాగా కూర్చొని బెదిరిస్తుండటంతో విసుగు చెందిన సబ్ రిజిస్ట్రార్ చంద్రుగొండ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడం, అక్కడకు పోలీసులు వచ్చినా ఎటువంటి చర్యలు తీసుకోకపోగా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించి, రాచమర్యాదలతో పోలీసులు సదరు నాయకుడిని అక్కడి నుంచి పంపించేశారు. నన్ను బెదిరించి, కార్యాలయ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిని కనీసం పోలీసులు అదుపులోకి తీసుకొలేదని సబ్ రిజిస్ట్రార్, ఉన్నతాధికారులు, తోటి తహసీల్దార్ వద్ద వాపోయినట్లు విశ్వసనీయ సమాచారం. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోకి దౌర్జన్యంగా ప్రవేశించటమే కాకుండా మద్యం మత్తులో విధులకు ఆటంకం కలిగించిన బంజార నాయకునిపై చర్యలకు పోలీసు, రెవెన్యూ శాఖలు జంకటం పట్ల పలు అనుమానాలు మండల ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఇదే పని సామాన్యులు చేస్తే ఊరుకుంటారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## ఎఐఎస్‌ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవం




**ప్రజాపక్షం/మధిర:** 91 ఏళ్ల విద్యార్థి ఉద్యమ స్ఫూర్తితో ప్రభుత్వ విద్యను కాపాడేందుకు పోరాడదామని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఎఐఎస్‌ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మధిర నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట ఉన్న ఎఐఎస్‌ఎఫ్ దిమ్మె వద్ద జెండాను మడుపల్లి లక్ష్మణ్ ఎగరవేశారు. ఈ సందర్భంగా మడుపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ.. 'చదువు –పోరాడు' అనే నినాదంతో విద్యార్థుల హక్కుల కోసం సాగిన 91 ఏళ్ల ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు మరింత బలమైన ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన జాతీయ విద్యా విధానం 2020ను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఉచిత నాణ్యమైన విద్య, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ సౌకర్యాలను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ మధిర నియోజకవర్గ నాయకులు మణికంఠ, మండల కన్వీనర్ సుశాంత్, పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్ కమిటీ ఉపాధ్యక్షులు అశోక్, అక్బర్, హుస్సేన్, జస్వంత్, రిత్విక్, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రిమినల్ ట్రాకింగ్ సిస్టమ్‌పై పట్టుసాధించాలి: సిపి సునీల్‌దత్




**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** నేరాల పరిశోధన, నిందితుల గుర్తింపును వేగవంతం చేసేందుకు క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ సిస్టమ్‌పై ఎస్‌హెచ్‌ఒలు పట్టు సాధించాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. బుధవారం స్థానిక త్రీటౌన్ పోలీసు స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు తనిఖీ చేసి అక్కడ ఉన్న ఫిర్యాదు దారులతో మాట్లాడారు. విచారణ నివేదికలు, సిసిటిఎన్‌ఎస్ అప్‌లోడ్, జనరల్‌డైరీ రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్‌లో వస్తున్న అధునాతన పద్ధతులను అందిపుచ్చుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లో డేటా నమోదు, దర్యాప్తు ప్రక్రియలో పారదర్శకత, సాంకేతిక మెరుగుపరచటంలో ఈ వ్యవస్థ అత్యంత కీలకమన్నారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ సమన్స్, ఈ సాక్ష్యం వంటి వాటిని విస్తృతంగా ఉపయోగించాలని సిబ్బందికి తెలియజేశారు. ఈ తనిఖీల్లో సిపి వెంట టౌన్ ఎసిపి ఎస్‌వి రమణమూర్తి ఉన్నారు.

## ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలి

కలెక్టర్ దివాకర టిఎస్

వెలుగుమట్లలో ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని పరిశీలన

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వం పేద కుటుంబాలకు గౌరవ ప్రదమైన జీవనాన్ని అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని తమ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బుధవారం ఖమ్మం నగర పరిధిలోని వెలుగుమట్ల ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటి నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, నిర్మాణ దశ వివరాలను తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీసి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. లబ్ధిదారులకు అవసరమైన



సాంకేతిక సూచనలు అందిస్తూ నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యేలా సహకరించాలన్నారు. లబ్ధిదారులకు సకాలంలో ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. అధికారులు సమన్వయంతో పనులు గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్‌డిఒ శ్రీనివాస్, అర్బన్ తహసీల్దార్ జయచంద్ర, ఇఇ జగ్గారావు, హౌజింగ్ ఎఇలు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'విద్యుత్ ఉచ్చు'కు అటవీ శాఖ బీట్ ఆఫీసర్ బలి!

అక్రమ వేటను అడ్డుకునే క్రమంలో విషాదం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** అటవీ జంతువులను అక్రమంగా వేటాడేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చు అటవీ శాఖ ఉద్యోగి ప్రాణాలను బలిగొన్న విషాద ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలో చోటు చేసుకుంది. వన్యప్రాణాలు వేట కోసం విద్యుత్ తీగలు ఏర్పాటు చేసినట్లు సమాచారం అందడంతో విధి నిర్వహణలో భాగంగా సంఘటనా ప్రాంతానికి వెళ్లిన బీట్ ఫారెస్ట్ ఆఫీసర్(ఎఫ్‌బిఒ)బానోత్ నవీన్ విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందారు. నకిరిపేట గ్రామ పరిధిలో మంగళవారం రాత్రి జరిగిన ఈ ఘటన అటవీ శాఖలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఎస్‌ఐ మేడా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం నకిరిపేట గ్రామ పరిధిలో కొంత మంది అటవి జంతువులను వేటాడేందుకు ప్రమాదకరంగా విద్యుత్ తీగలను ఏర్పాటు చేసినట్లు అటవీ అధికారులకు సమాచారం అందింది. సమాచారంలో టిఆర్‌ఒ కురుసం అనార్కలి, ఎఫ్‌బిఒ బానోత్ నవీన్‌తో పాటు అటవీ శాఖ సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ విద్యుత్ తీగలను గుర్తించి, వాటిని ఏర్పాటు చేసిన వ్యక్తుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో అటవి జంతువుల కోసం అమర్చిన విద్యుత్ తగలకు ఎఫ్‌బిఒ బానోత్ నవీన్ తగలడంతో ఒక్కసారి విద్యుత్ ఘాతానికి గురయ్యారు. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. నవీన్ మృతికి కారణమైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఆవుల నాగిరెడ్డి, దాసరి నరేష్, తాటి వీరబాబులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టిఆర్‌ఒ కురుసం అనార్కలి బుధవారం బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అటవి జంతువులను వేటాడేందుకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పాల్వంచ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సతీష్ దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. అక్రమ వేటను అరికట్టడంతో పాటు వన్యప్రాణుల కోసం విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అటవీ ప్రాంతాల్లో నిఘాను మరింత పెంచాలని, అనుమానాస్పద విద్యుత్ తీగలు, ఉచ్చులు కనిపిస్తే అటవీ లేదా పోలీసు అధికారులకు సమాచారం అందించాలని కోరుతున్నారు. వన్యప్రాణుల రక్షణ కోసం విధులు నిర్వహిస్తూ ప్రాణాలు కోల్పోయిన బానోత్ నవీన్ మృతి పట్ల అటవీ శాఖ సిబ్బంది, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అక్రమ వేటను అడ్డుకునే క్రమంలో ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని పలువురు కోరుతున్నారు.

## వాలిన విద్యుత్ తీగలకు మరమ్మతులు



ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** మండల పరిధిలోని తాళ్లచెరువు గ్రామ పరిధిలో చెరువు సమీప వ్యవసాయ పొలాల్లో ప్రమాదకరంగా కిందకు వాలిపోయిన విద్యుత్ తీగలపై 'ప్రజాపక్షం'లో గత నెలలో 'విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి రైతుల బలి' అనే కథనానికి విద్యుత్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. రైతుల ప్రాణాలకు ముప్పుగా మారిన విద్యుత్ తీగలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, వెంటనే మరమ్మతులు సరిచేశారు. గత కొంతకాలంగా విద్యుత్ తీగలు కిందకు వాలిపోవడంతో వ్యవసాయ పనులను వెళ్లే రైతులు, కూలీలు, పశువులకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను 'ప్రజాపక్షం' దిపత్రిక వెలుగులోకి తీసకురావడంతో అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగే వరకు వేచి చూడకుండా సమస్యను పరిష్కరించిన విద్యుత్ అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి అధికారుల దృష్టికి తీసుకెళ్లిన 'ప్రజాపక్షం' విలేకరిను రైతులు అభినందించారు. భవిష్యత్‌లోనూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌తీగలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి ముందస్తు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## సెంట్రల్ జైలులోని ప్రజ్వల్ రేవణ్ణ బ్యారక్‌లో సెల్‌ఫోన్

- అసిస్టెంట్ సూపరింటెండెంట్‌పై వేటు

**న్యూఢిల్లీ :** రేప్ కేసులో అరెస్టై బెంగుళూరులోని సెంట్రల్ జైలులో ఉన్న ప్రజ్వల్ రేవణ్ణ బ్యారక్ నుంచి ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు కర్ణాటక జైళ్ల శాఖ డిజి అలోక్ కుమార్ తెలిపారు. జైలులో ఈనెల11న సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ నిర్వహించిన సోదాల్లో ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పరప్పన అగ్రహార పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ బ్రాంచ్ ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోందని అలోక్ కుమార్ చెప్పారు. ఒక పెన్ డ్రైవ్ కూడా రేవణ్ణ వద్ద దొరికినట్లు ప్రచారం జరిగినా అధికారంగా వెల్లడించలేదు. మరోవైపు, ఈ ఘటనలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఈరన్న రంగాపురను సస్పెండ్ చేశారు. అలాగే, విషయంపై వివరణ ఇవ్వాలని బెంగళూరు సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. వాస్తవానికి జైలులో అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై ఆగస్టు 6 తేదీనే ప్రజ్వల్ రేవణ్ణ బ్యారక్‌ను జైలు అధికారులు తనిఖీ చేశారు. అయితే, ఆ సమయంలో ఎలాంటి నిషేధిత వస్తువులు దొరకలేదు. దీంతో సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ (సిసిబి) అధికారుల బృందం మంగళవారం తనిఖీలు నిర్వహించింది. మధ్యాహ్నం సుమారు 1 గంటకు, సిసిబి డిసిబి హరిబాబు, రాజా ఇమామ్ ఖాసింల నేతృత్వంలో 80 మందికి పైగా సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. రాత్రి వరకు జైలులోని ప్రతి బ్యారక్‌లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో 10కి పైగా మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. మరికొందరి వద్ద నిషేధిత వస్తువులు ఉన్నట్లు గుర్తించినట్లు సీసీబీ వర్గాలు తెలిపాయి. ఈ విషయంపై సిసిబి అధికారులు పరప్పన అగ్రహార పోలీస్ స్టేషన్ ఫిర్యాదు నమోదు చేశారు.

ఫారం VI
(సెక్షన్ ఉప నియమం (1) యొక్క నియమం -19)
మరియు సెక్షన్ 11(1) యొక్క చట్టం -30/2013)

తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూ సేకరణ) శాఖ
ప్రాథమిక ప్రకటన

గెజిట్ నెం: 105/2026 తేది : 30.07.2026
ఫైల్ నెం: జి/942/2026 తేది : 30.07.2026
ఆర్.డి.ఒ & యల్.ఎ.ఒ
ఫైల్ నెం: ఎఫ్/4992/2026 తేది : 24.07.2026

ప్రజా ప్రయోజనము నిమిత్తం అనగా మక్తల్-నారాయణపేట - కోడంగల్ ఎత్తిపోతలపథకంలో భాగంగా కానుకుర్తి చెరువు పునరొధరణ కొరకు నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండలం, కానకుర్తి గ్రామం పరిదిలో మొత్తం విస్తీర్ణం **ఎ. 1.12 గుంటలు** భూమి అవసరమై ఉన్నదని తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్ నారాయణపేట వారు భావించుచున్నారు.
తెలంగాణ ప్రభుత్వం మక్తల్ నారాయణపేట - కోడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయే భూ నిర్వాసితులకు 2013 భూ సేకరణ, పునరావాసం మరియు పునస్తాపన లో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు చట్టంలోని అధ్యాయం 2 మరియు 3 యొక్క వర్తింపు నుండి మినహించడానికి తేది: 10 06.2026 నాడు G.O,Ms .No.11 Irrigation & CAD(LA) Department జారీ చేసింది. అందువలన అ చట్టం లోని సెక్షన్ 4 (1) ప్రకారం సామాజిక ప్రభావ అంచనా నిర్వహించబడలేదు. జిల్లా కలెక్టర్ నారాయణపేట గారు రెవిన్యూ డివిజనల్ అధికారిని భూ సేకరణ ఆధికారిగాను మరియు అదనపు కలెక్టర్ (రెవెన్యు) గారిని భాదిత కుటుంబాల పునరావాసం మరియు పునస్తాపన కోసం నిర్వాహకుడిగా ఉత్తర్వులు నెం. జి/107/2025, తేది: 18.07.2026 ద్వారా నియమించబడారు.
అందువలన పై తెల్పిన సదరు ప్రాజెక్టు కొరకు నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండలం, కానకుర్తి గ్రామం యొక్క మొత్తం విస్తీర్ణం **ఎ.1.12 గుంటలు** విస్తీర్ణం గల భూమి ఈ దిగువ తెల్పిన విధంగా వివరణాత్మక వివరణ ప్రకారం స్వాధీనత కొరకు ప్రతిపాదించడమైనదని తెలుపడమైనది.

| క్ర.సం. | సర్వే నెం. | [illegible] | [illegible] | [illegible] | ఆసక్తిగల వ్యక్తుల పేర్లు | సరిహద్దులు | | | | చెట్లు | | కట్టడాలు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | ఉ | తూ | ప | ద | [illegible] | [illegible] | రకం | [illegible] |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 191/1/1 | [illegible] | [illegible] | 0.08 | లడ్డి మల్లమ్మ భర్త నర్సిములు | 199 | 270 | 190 | 192 | - | - | - | - |
| 2 | 191/3/1 | [illegible] | [illegible] | 0.09 | పేరు మల్లయ్య తండ్రి హన్మయ్య | 199 | 270 | 190 | 192 | - | - | - | - |
| 3 | 191/అ | [illegible] | [illegible] | 0.03 | అమృతమ్మ భర్త చిన్న బాలప్ప | 199 | 270 | 190 | 192 | - | - | - | - |
| 4 | 191/2/1/1 | [illegible] | [illegible] | 0.04 | చాపలి శేఖర్ తండ్రి నర్సప్ప | 199 | 270 | 190 | 192 | - | - | - | - |
| 5 | 199అ/1/1 | [illegible] | [illegible] | 0.07 | మాణిక్యప్ప తండ్రి పకీరప్ప | 198 | 191 | 200 | 195 | - | - | - | - |
| 6 | 199/అ 1/1 | [illegible] | [illegible] | 0.02 | మాణిక్యప్ప తండ్రి పకీరప్ప | 198 | 191 | 200 | 195 | - | - | - | - |
| 7 | 197/ ఉ1/1 | [illegible] | [illegible] | 0.01 | కుర్వ మహేష్ తండ్రి పెద్ద నర్సప్ప | 222 | 196 | 198 | 222 | - | - | - | - |
| 8 | 197/ఊ/1 | [illegible] | [illegible] | 0.03 | కుర్వ ఆశప్ప తండ్రి ఈరప్ప | 222 | 196 | 198 | 222 | - | - | - | - |
| 9 | 197/ఊ/1 | [illegible] | [illegible] | 0.02 | పట్టాదారుడు కుర్వ ఆశప్ప తండ్రి ఈరప్ప కాస్తుదారుడు కుర్వ మహేష్ తండ్రి పెద్ద నర్సప్ప | 222 | 196 | 198 | 222 | - | - | - | - |
| 10 | 197/ఉ/1 | [illegible] | [illegible] | 0.02 | కుర్వ మంజుల భర్త ఆశప్ప | 222 | 196 | 198 | 222 | - | - | - | - |
| 11 | 197/ఊ/1 | [illegible] | [illegible] | 0.01 | పట్టాదారుడు కుర్వ ఆశప్ప తండ్రి ఈరప్ప కాస్తుదారుడు కుర్వ మంజుల భర్త ఆశప్ప | 222 | 196 | 198 | 222 | - | - | - | - |
| 12 | 197/అ/1/1/1 | [illegible] | [illegible] | 0.01 | నారాయణ తండ్రి చిన్న ఉషన్న | 222 | 196 | 198 | 222 | - | - | - | - |
| 13 | 198/అ 1/1/1/2 | [illegible] | [illegible] | 0.02 | మాణిక్యప్ప తండ్రి పకీరప్ప | 202 | 195 | 199 | 197 | - | - | - | - |
| 14 | 198/అ 1/1/1/2 | [illegible] | [illegible] | 0.01 | పట్టాదారుడు మాణిక్యప్ప తండ్రి పకీరప్ప కాస్తుదారుడు గురుగల్ల అంజిలప్ప తండ్రి హన్మన్న | 202 | 195 | 199 | 197 | - | - | - | - |
| 15 | 198/అ 1/1/1/2 | [illegible] | [illegible] | 0.03 | పట్టాదారుడు మాణిక్యప్ప తండ్రి పకీరప్ప కాస్తుదారుడు కుర్వ ఆశప్ప తండ్రి ఈరప్ప | 202 | 195 | 199 | 197 | - | - | - | - |
| 16 | 198/అ 1/1/1/2 | [illegible] | [illegible] | 0.03 | ముష్షిఫా మాణిక్యప్ప తండ్రి పకీరప్ప | 202 | 195 | 199 | 197 | - | - | - | - |
| మొత్తం: ఎ. 1.12 గుంటలు | | | | | | | | | | | | | |

భూసేకరణ, పునరావాసం మరియు పునరావాస చట్టం 2013 (కేంద్ర చట్టము నెం. 30/2013) లో న్యాయమైన సక్రమ పరిహారం మరియు పారదర్శక హక్కు యొక్క సెక్షన్ 11 (1) యొక్క నిబంధనల ప్రకారం పైన పేర్కొనబడిన వారందరికి ఈ ప్రకటన రూపొందించబడింది.
భూమి యొక్క ప్లాన్ జిల్లా కల్లెక్టర్, నారాయణపేట మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, నారాయణపేట భూ సేకరణ వారి కార్యాలయములో ఏదైనా పని దినములలో పరిశీలించుకొనవచ్చును. తెలంగాణ ప్రభుత్వం/కలెక్టర్ కం సరియైన ప్రభుత్వము సదరు చట్టం యొక్క సెక్షన్ 12లో తెలిపిన మరియు నిర్దేశిత విధంగా వారి పనిని సరిగా చేపట్టుట కొరకు అవసరమైన అన్ని ఇతర చట్టాలను చేయుటకు & భూమిలోనికి ప్రవేశించుటకు మరియు సరిగా చేయుటకు ఏదేని భూమి యొక్క ఎత్తుపల్లాలు తీసుకొనుటకు సబ్ సాయిల్ త్రావ్వుటకు లేదా బోర్ వేయుటకు రెవిన్యూ డివిజనల్ అధికారి మరియు అతని సిబ్బందిని అధికారిగా అధికారమిచ్చుటకు.
చట్టం సెక్షన్ 11 (4) క్రింద కలెక్టర్ యొక్క ముందస్తు ఆమోదాలు లేకుండా ఈ ప్రకటన ప్రచురించిన తేది నుండి భూమి యొక్క ఏదేని లావాదేవీలు అనగా అమ్మకాలు/ కొనుగోలు మొదలైనవి లేదా అటువంటి భూముల పై ఏవేని ఋణభారములు సృష్టించుటకు కారణమగుట లేదా ఏదేని లావాదేవి ఏ వ్యక్తి చేయరాదు.
పరిహారం యొక్క సంప్రదింపుల ద్వారా సెటిల్‌మెంట్ కొరకు ఆసక్తి / ప్రభావితమయే వ్యక్తులందరి నుండి క్లెయింలు మరియు సేకరణకు అభ్యంతరాలు ఏమైనా ఉంటె భూమిలో ఆసక్తి గల వ్యక్తులు చట్టం యొక్క సెక్షన్ 15 క్రింద ఏర్పాటు ప్రకారం ఈ నోటిఫికేషన్ ప్రచురించిన తేది. నుండి 60 (అరువది) రోజుల లోపల భూమిలో ఆసక్తి గల వ్యక్తులచే జిల్లా కల్లెక్టర్ / అధికృత సమక్షంలో సమర్పించవచ్చు.

సం/- భూసేకరణ అధికారి & రాజస్వ మండలాధికారి నారాయణపేట
సం/- అదనపు కలెక్టర్(రెవిన్యూ) నారాయణపేట
సం/- జిల్లా కలెక్టర్ నారాయణపేట
DIPR RO NO. 645/LA/PP/Advt/Pub/2026-27

## ప్రతిపక్షాల నిరసనలు
# కొనసాగుతున్న ప్రతిష్టంభన



**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్ ప్రకారం పార్లమెంట్‌లో ముందుకు వెళ్లాలని ప్రయత్నిస్తుండగా, విద్యార్థి నిరసనకారులపై జులై 20న జరిగిన పోలీసు చర్యపై చర్చ జరపాలని ప్రతిపక్షం డిమాండ్ చేస్తుండటంతో పార్లమెంటు రాజకీయ ప్రతిష్టంభనలో కొనసాగుతోంది. వర్షాకాల సమావేశాలు 118వ రోజైన బుధవారం కూడా ఉభయసభల్లో ప్రతిపక్ష సభ్యులు నిరసనలు వ్యక్తం చేశాయి. కేంద్ర హోంమంత్రి సభకు ఎందుకు రావడం లేదని, అయోధ్యలోని రామాలయంలో విరాళాల చోరీపై, జులై 20న 'పార్లమెంట్ మార్చ్' సందర్భంగా విద్యార్థులు, యువతపై పోలీసుల అమానుష చర్య, పెల్లెట్ గన్‌ల వినియోగం అమిత్ షా సభకు వచ్చిన సమాధానం చెప్పాలనే తమ డిమాండ్‌ను కొనసాగిస్తూ ఉభయసభల్లోనూ ప్రతిపక్ష పక్ష ఎంపిలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ వెల్‌వైపు దూసుకెళ్లి ఆందోళన చేశారు. అయితే అధికార, ప్రతిపక్ష పక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొన్న నేపథ్యంలో, వర్షాకాల సమావేశాల ముంగిపునకు ముందు రోజు బుధవారం లోక్‌సభ ఎలాంటి చర్చ లేకుండానే వివాదాస్పద ఎఫ్‌సిఆర్‌ఎ సవరణ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపి, గనులు, ఖనిజ అభివృద్ధి చట్టాలను సవరించే బిల్లును ఆమోదించి, సభను మరుసటి రోజుకు వాయిదా వేసింది. లోక్‌సభ ఉదయం ప్రారంభం కాగానే స్పీకర్ ఓమ్ బిర్లా నిరసన చేస్తున్న ప్రతిపక్ష సభ్యులతో మాట్లాడుతూ, వారి వైఖరి, ఆలోచనలు అధికార పక్షంతో విభిన్నంగా ఉన్నప్పటికీ, యావత్ దేశం సభ సజావుగా పనిచేయాలని కోరుకుంటోందన్నారు. నిరసనలు చేయడం, నినాదాలు చేయడం ద్వారా సభ ప్రతిష్టను దెబ్బతీయడం సరికాదన్నారు. అయితే ప్రతిపక్ష తమ నిరసనలను కొనసాగించడంతో సభా కార్యకలాపాలను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. అనంతరం లోక్‌సభ కార్యకలాపాలు తిరిగి ప్రారంభమైన అనంతరం, ఎఫ్‌సిఆర్‌ఎ సవరణ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపాలని ప్రభుత్వం ప్రతిపాదించగా, ఆ తీర్మానాన్ని సభ ఆమోదించింది. ఈ బిల్లు మైనారిటీలను లక్ష్యంగా చేసుకుందని ఆరోపిస్తూ, దానిని ఉపసంహరించుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వ మొండి వైఖరి అవలంబించింది. ఈ బిల్లులో మైనారిటీలకు వ్యతిరేకంగా ఉన్న ఒక్క నిబంధననైనా చూపించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపక్షాలకు సవాలు విసిరారు. కొద్దిసేపు వాయిదా పడిన అనంతరం, మధ్యాహ్నం 3 గంటలకు సభ తిరిగి సమావేశమై గనులు, ఖనిజాల బిల్లును ఆమోదించింది. ప్రతిపక్షాల నిరసనల మధ్య, నీట్ అంశంపై విద్యార్థుల ఆందోళనపై తక్షణమే చర్చ ప్రారంభించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, దీని గురించి షా ఇప్పటికే స్పీకర్‌కు లేఖ రాశారని రిజిజు అన్నారు. కాగా, జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనల అంశాన్ని అధికార పక్షం కూడా లేవనెత్తడంతో ప్రతిష్టంభన కొనసాగడంతో, సభాపతి సభను గురువారం ఉదయం 11 గంటల వరకు వాయిదా వేశారు.

### ఎన్‌సిడిసి విస్తరణ బిల్లుకు రాజ్యసభ ఆమోదం

దేశంలోని సహకార సంఘాలకు నేరుగా రుణాలు, గ్రాంట్లు మంజూరు చేసేలా, 'నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్' (ఎన్‌సిడిసి) పరిధిని విస్తరించే బిల్లును రాజ్యసభ బుధవారం ఆమోదించింది. అయితే హోం మంత్రి అమిత్ షా సభకు గైర్హాజరు కావడం, అయోధ్య రామ మందిర విరాళాల చోరీకి నిరసనగా ప్రతిపక్ష ఇండియా కూటమి సభ్యులు రాజ్యసభ నుండి వాకౌట్ చేశారు. ఉదయం 11 గంటలకు వాయిదా పడిన సభ, మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి సమావేశమైనప్పుడు, హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా తరపున సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ ప్రవేశపెట్టిన జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (సవరణ) బిల్లు, 2026పై చర్చను చేపట్టాలని డిప్యూటీ చైర్మన్ హరివంశ్ సభ్యులను కోరారు. ప్రతిపక్ష ఎంపిలు నినాదాలు కొనసాగిస్తుండగానే, ఆ బిల్లుపై మాట్లాడాలని చైర్మన్ బిజెపి ఎంపి రామ్‌రావ్ సఖారామ్ వాడ్‌కుటేను పిలిచారు. ఈ సమయంలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే జోక్యం చేసుకోవడానికి ప్రయత్నించగా, కేవలం చర్చలో ఉన్న బిల్లుపై మాత్రమే మాట్లాడాలని చైర్మన్ ఆయనను కోరారు. 'ఈ బిల్లు ఎవరి పేరు మీద ఉందో వారు... ఏదో కారణం చేత (సభకు) గైర్హాజరైతే ఫర్వాలేదు... కానీ అది ప్రతిరోజూ జరగకూడదు,' అని హోం మంత్రి షాను ఉద్దేశిస్తూ ఖర్గే అన్నారు. సభ నాయకుడు జెపి నడ్డా జోక్యం చేసుకుంటూ కాంగ్రెస్ నాయకుడు సభను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ఆ తర్వాత సభాపతి వాడ్కుటేను తన ప్రసంగాన్ని కొనసాగించమని కోరగా, చర్చ కొనసాగుతుండగా ఇండియా కూటమి ఎంపిలు వాకౌట్ చేశారు. అంతకుముందు, సిపిఐ(ఎం)కు చెందిన జాన్ బ్రిట్టాస్‌పై బిజెపి ఎంపి సుష్మితా దేవ్ చేసిన అవమానకరమైన వ్యాఖ్యలపై చెలరేగిన గందరగోళం కారణంగా ఎలాంటి కార్యకలాపాలు జరపకుండానే సభ వాయిదా పడింది.

## రాజకీయ లబ్ధి పొందినప్పుడు
# రాష్ట్ర అంశమని గుర్తులేదా?

- రామాలయ విరాళాల సేకరణలో అవకతవకలపై ప్రియాంకగాంధీ ఫైర్
- బిజెపి వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ నేత
- పార్లమెంట్ ఆవరణలో విపక్ష ఎంపిల నిరసన ప్రదర్శన



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో ప్రతిపక్ష ఎంపిలు బుధవారం కూడా నిరసన ప్రదర్శన నిర్వహించారు. అయోధ్యలోని రామ మందిరంలో విరాళాల అపహరణ, గత నెలలో విద్యార్థి నిరసనకారులపై పోలీసుల దురాగతాలకు నిరసనగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా సహా ప్రతిపక్ష ఎంపిలు ఆందోళన చేపట్టారు. నీట్ పేపర్ లీక్ అంశంపై జులై 20న విద్యార్థులు నిర్వహించిన పార్లమెంట్ మార్చ్ సందర్భంగా వారిపై పోలీసులు దురాగతాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్‌కు వచ్చి ప్రకటన చేయాలని కూడా వారు డిమాండ్ చేశారు. ప్లకార్డులు పట్టుకుని, ఎంపిలు పార్లమెంట్ మకర ద్వారం ముందు నిలబడి 'అమిత్ షా సదన్ మే ఆవో', 'అమిత్ షా మాఫీ మాంగో', 'చందా చోర్, కహా మిలేంగే, బిజెపి కే దఫ్తర్ మే' వంటి నినాదాలు చేశారు. ప్రధానంగా కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, టిఎంసిలకు చెందిన ప్రతిపక్ష ఎంపిలు 'చందా కిస్నే లూటా?' అని రాసి ఉన్న ఒక పెద్ద బ్యానర్ వెనుక బారులు తీరి, బిజెపికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ప్రియాంకాగాంధీ మీడియాతో మాట్లాడుతూ రామమందిర విరాళాల సేకరణలో జరిగిన అవినీతిపై పార్లమెంటులో సమాధానం చెప్పడానికి ప్రభుత్వం నిరాకరిస్తోందని, దీనిని 'రాష్ట్ర పరిధిలోని అంశం' అని పేర్కొంటోందని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా కేంద్రంపై మండిపడ్డారు. అయితే, లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆ ఆలయం ద్వారా రాజకీయ లబ్ధి పొందడానికి బిజెపి ఏమాత్రం వెనుకాడలేదని ఆమె విమర్శించారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ముగింపు దశకు చేరుకున్నా సభలో కొనసాగుతున్న ప్రతిష్టంభన గురించి ప్రింయాకను మీడియా ప్రశ్నించగా, 'ప్రజల పట్ల ప్రభుత్వానికి బాధ్యత లేదని ఇది స్పష్టం చేస్తోంది. ఎందుకంటే, ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిన, ప్రకటన చేయాల్సిన వేదిక ఇదే కదా' అని బుదులిచ్చారు. 'భారీ నిరసనలు జరిగాయి; కేవలం ఢిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా, అన్ని ప్రాంతాల నుండి యువత బయటకు వచ్చారు. వారిపై లాఠీచార్జి చేశారు. బాష్పవాయువు ప్రయోగించారు, పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరిపారు. బిహార్‌లో నిరసనకారులపై ఎకె47ను కూడా ఉపయోగించారు. దీనికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత తమకు ఉందని ప్రభుత్వం భావించడం లేదు; కనీసం అది ఎలా జరిగిందనే దానిపై ఒక ప్రకటన కూడా చేయడం లేదు. అసలు ఎవరు ఆదేశించారు?' అని పార్లమెంట్ భవన సముదాయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ ప్రియాంకా గాంధీ ప్రశ్నించారు. రామమందిర విరాళాల దుర్వినియోగం గురించి ప్రస్తావిస్తూ, దేశం నలుమూలల నుండి విరాళాలు వచ్చాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. శ్రీరామునిపై కేవలం మన దేశంలోనే కాకుండా మలేషియా, ఇండోనేషియా, థాయిలాండ్ వంటి దేశాల్లోనూ ప్రజలకు అచంచలమైన విశ్వాసం ఉందన్నారు. ఇప్పుడు బిజెపి సర్కార్ దీనిని రాష్ట్ర పరిధిలోని అంశం అని పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. 'ఎన్నికలకు ముందు ప్రచారం నిర్వహించి, దాని ద్వారా రాజకీయ లబ్ధి పొందాల్సి వచ్చినప్పుడు ఇది రాష్ట్ర పరిధిలోని అంశం కాలేదు. కానీ ఇప్పుడు మాత్రం రాష్ట్ర పరిధిలోని అంశం అయిపోయింది' అని బిజెపినుద్దేశించి ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రామమందిరాన్ని ప్రారంభించారు. ఆయన ఒక రాష్ట్రానికి మాత్రమే కాకుండా దేశం మొత్తానికి ప్రధానమంత్రి. ప్రారంభోత్సవానికి దేశం నలుమూలల నుండి ప్రజలు వచ్చారు. ఇప్పుడు మాత్రం ఇది రాష్ట్ర పరిధిలోని అంశమని, పార్లమెంటులో సమాధానం చెప్పమని అంటున్నారు. విరాళాలు మాయమయ్యాయి. ఇదంతా ఏమిటి?' అని ప్రియాంక గాంధీ ప్రశ్నించారు.

## ఢిల్లీ 'సిజెపి వాలంటీర్ల మీటింగ్‌కు ...
# మోకాలడ్డిన అధికార బిజెపి
### 'ఒత్తిడి'తో 'సరైనా' హాల్ బుకింగ్ క్యాన్సల్, అభిజీత్ దీప్కే ఆగ్రహం

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) కార్యకలాపాలను నిరోధించేందుకు అధికార బిజెపి తన కుటిల ఆలోచనలు అమలు చేస్తోంది. అధికార బిజెపి ఒత్తిడి కారణంగా ఢిల్లీలోని 'నరైనా'లో జరగాల్సిన సిజెపి వాలంటీర్ల సమావేశం రద్దు అయ్యింది. ఈ సమావేశం జరగాల్సిన బ్యాంకెట్ హాల్ యాజమాన్యం బిజెపి ఒత్తిడికి తలొగ్గి చివరినిమిషంలో బుకింగ్‌ను రద్దు చేసిందని బుధవారం సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆరోపించారు. సమావేశం రద్దుఅ అయిన అనంతరం అభిజీత్ దీప్కే విలేకరులతో మాట్లాడారు. నిర్వాహకులు వేదికను రిజర్వ్ చేసుకున్నారని, అయితే, తాము అక్కడకు చేరుకున్నప్పుడు యాజమాన్యం 'మా మీద ఒత్తిడి ఉన్న కారణంగా మీకు హాల్ ఇవ్వలేం' అని చెప్పారని దీప్కే తెలిపారు. సమీపంలోని ఇతర వేదికల వద్ద కూడా తాము ఇలాంటి తిరస్కరణనే ఎదుర్కొన్నామని, కాక్రోచ్ జనతా పార్టీ సమావేశాల కోసం వేదికలు కేటాయించకుండా అధికార బిజెపి ప్రజలను భయపెడుతోందని అభిజీత్ దీప్కే ఆరోపించారు. 'బెదిరించినా మేం భయపడం' అని ఆయన హెచ్చరించారు. విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసిన 'నీట్' పేపర్ లీక్ వివాదంపై జంతర్ మంతర్ వద్ద జరిపిన ఒక ఆందోళన అనంతరం ఒక సంస్థాగత నిర్మాణాన్ని ఏర్పాటు చేసుకునేందుకు సిజెపి తన జాతీయ బృందాన్ని ప్రకటించి, అభిజీత్ దీప్కేను జాతీయ కన్వీనర్‌గా నియమించిన కొద్దిరోజులకే ఈ పరిణామం చోటుచేసుకుంది. అభిజీత్ దీప్కే నాయకత్వంలో 36రోజులపాటు జరిగిన ఈ నిరసనకు దేశ వ్యాప్తంగా విద్యార్థులు, యువ వాలంటీర్లతోపాటు ప్రతిపక్ష నాయకులు కూడా మద్దతు తెలిపారు. పర్యావరణ హక్కుల కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ జూన్ 28న నిరసనలో చేరి నిరవధిక నిరాహారదీక్ష చేపట్టారు. ఆయన ఆరోగ్యం క్షీణించిన నేపథ్యంలో సోనమ్ వాంగ్‌చుక్‌ను సఫ్దర్‌జంగ్ హాస్పిటల్‌కు తరలించారు. ప్రభుత్వంతో జులై 25న చర్చలు జరిపిన అనంతరం సిజెపి, తమ దేశవ్యాప్త నిరసనను ఉపసంహరించుకున్నారు.

# 19న సిడబ్ల్యుసి భేటీ

**న్యూఢిల్లీ :** విద్యార్థుల సమస్యలు, రామమందిర విరాళాల చోరీ వంటి అంశాలపై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే కార్యాచరణతో పాటు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించేందుకు కాంగ్రెస్ వర్కింగ్ పార్టీ ఢిల్లీలో 19న సమావేశం కానుంది. వచ్చే ఏడాది ప్రారంభంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ సన్నద్ధతను కూడా ఈ సమావేశంలో సమీక్షించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, పార్టీకి చెందిన ఇతర సీనియర్ నాయకులు హాజరుకానున్నారు.

# నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలను తొలగించండి

- రాజ్యసభ చైర్మన్‌కు సిపిఐ ఎంపి సందోష్ కుమార్ లేఖ
- కమ్యూనిస్టులను ఉద్దేశించి ఆర్థికమంత్రి చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరం

**న్యూఢిల్లీ :** కమ్యూనిస్ట్ ఉద్యమంపై ఆర్థిక మంత్రి చేసిన వ్యాఖ్యలను రాజ్యసభ రికార్డుల నుంచి తొలగించాలని రాజ్యసభ చైర్మన్, ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్‌కు సిపిఐ ఎంపి పి.సందోష్ కుమార్ లేఖ రాశారు. ఆదాయపు పన్ను (సవరణ) ఆర్డినెన్స్– 2026ను తిరస్కరించాలని కోరుతూ ప్రవేశపెట్టిన తీర్మానంపై సోమవారం రాజ్యసభలో జరిగిన చర్చకు సమాధానమిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన అభ్యంతరకరమైన, కించపరిచేలా ఉన్నాయన్నారు. సిపిఐ(ఎం) ఎంపి జాన్ బ్రిట్టాస్‌ను ప్రస్తావిస్తూ ఆర్థిక మంత్రి కమ్యూనిస్టులు 'అంతా పిరికివాళ్లు' అని పేర్కొంటూ, కమ్యూనిస్టు ఉద్యమంపై తీవ్రమైన వ్యాఖ్యలు చేయటాన్ని సందోష్ కుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజకీయ విభేదాలను వ్యక్తిగత దూషణలకు లేదా ఒక రాజకీయ ఉద్యమాన్ని మొత్తం అవమానించేలా దిగజారే వ్యాఖ్యలు తగవని అన్నారు. కమ్యూనిస్టులు 'అంతా పిరికివాళ్లు' అని అనడం ఎలాంటి వాదనలోనైనా ప్రతివాదనగా ఉండకూడదనిదని, ఇది భారతదేశ ప్రజా జీవితంలో సుదీర్ఘమైన, విశిష్టమైన చరిత్ర కలిగిన ఒక ఉద్యమంపై చేసిన రాజకీయ దూషణ అని ఆయన అన్నారు. కమ్యూనిస్టులు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారని, జైలు శిక్షలను, వలసవాద అణచివేతను ఎదుర్కొన్నారని,ప్రజాస్వామ్యం, కార్మికుల హక్కులు, సామాజిక న్యాయం, ప్రజల హక్కుల కోసం జరిగిన పోరాటాలలో అపారమైన త్యాగాలు చేశారని సందోష్ గుర్తు చేశారు. ఇటువంటి అవమానకరమైన వ్యాఖ్యతో ఈ చరిత్రను కొట్టిపారేయడం చారిత్రకంగా అన్యాయమని, అలాగే పార్లమెంటులో ప్రసంగిస్తున్న ఒక కేంద్ర మంత్రి గౌరవానికి తగనిదని అన్నారు. పార్లమెంటరీ నిబంధనలు, సంప్రదాయాలకు అనుగుణంగా, రాజ్యసభ అధికారిక రికార్డుల నుండి అభ్యంతరకరమైన వ్యాఖ్యలను తొలగించాలని రాజ్యసభ చైర్మన్‌కు పి. సందోష్ కుమార్ కోరారు. తీవ్రమైన రాజకీయ విభేదాలు, బలమైన చర్చలు ఎన్నడూ వ్యక్తిగత దూషణలకు లేదా ఒక మొత్తం రాజకీయ సిద్ధాంతం, ఉద్యమంపై సామూహిక దాడులకు సాకుగా మారకూడదని పార్లమెంటు గౌరవం కోరుతుందని ఆయన అన్నారు. సభ గౌరవాన్ని, పార్లమెంటరీ చర్చల ప్రమాణాలను నిలబెట్టడానికి చైర్మన్ తగిన చర్యలు తీసుకుంటారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## 'కాంప్రమైజ్డ్ పిఎం'...
# భారతదేశ ప్రయోజనాలను అమ్ముకున్నారు

- యుఎస్ కోర్టు అదానీ కేసును కొట్టివేయడంతో ప్రధానిపై రాహుల్‌గాంధీ విమర్శలు

**న్యూఢిల్లీ :** అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీపై ఉన్న క్రిమినల్ అభియోగాలను అమెరికా ఫెడరల్ జడ్జి శాశ్వతంగా కొట్టివేసిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీని తీవ్రంగా విమర్శించారు. 'రాజీపడిన ప్రధానమంత్రి' భారతదేశ ప్రయోజనాలను అమ్ముకోవాల్సి వచ్చిందని, దీని వెనక కంటికి కనిపించే దానికంటే చాలా ఎక్కువ ఉందని, దీనికి భారతదేశం భారీ మూల్యం చెల్లిస్తోందని లోక్‌సభలో ప్రతిపక్షనేత అయిన రాహుల్‌గాంధీ ధ్వజమెత్తారు.అదానీ, అతని మేనల్లుడు సాగర్ అదానీలపై ఉన్న అభియోగాలను కొట్టివేయాలన్న అమెరికా న్యాయశాఖ అభ్యర్థనను అమెరికా కోర్టు ఆమోదించినట్లు వచ్చిన మీడియా నివేదిక స్క్రీన్ షాట్‌ను రాహుల్ గాంధీ 'ఎక్స్' పోస్ట్‌లో పంచుకున్నారు. 'కంటికి కనిపించే దానికంటే చాలా ఎక్కువ ఉంది' అని ఆయన తన పోస్ట్‌లో తెలిపారు. అమెరికా ఫెడరల్ న్యాయమూర్తి గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీలపై ఉన్న క్రిమినల్ అభియోగాలను శాశ్వతంగా కొట్టివేశారు. తద్వారా, దాదాపు రెండేళ్లుగా ఓడరేవుల నుంచి ఇంధన రంగం వరకు వ్యాపారాలు చేసే ఈ బహుళ వ్యాపార సంస్థను వేధిస్తోన్న ఒక ప్రధానమైన న్యాయ అడ్డంకిని తొలగించారు. న్యూయార్క్ తూర్పు జిల్లా యుఎస్ జిల్లా జడ్జి నికోలస్ గరౌఫిస్ అభియోగాలను కొట్టివేయాలన్న న్యాయ శాఖ అభ్యర్థనను ఆమోదించారు. న్యాయ ప్రక్రియ పట్ల 'వినయం'తో, 'ప్రగాఢమైన గౌరవం'తో దేశం తీసుకున్న నిర్ణయాన్ని తాను అంగీకరిస్తున్నానని చెబుతూ ఆ తీర్పును అదానీ స్వాగతించారు. ఆగస్టు 10న జారీచేసిన 47పేజీల ఉత్తర్వులో గౌతమ్ అదానీ, సాగర్ అదానీ, అదానీ గ్రీన్ ఎనర్జీ మాజీ సిఇఓ వినీత్ జైన్‌పై ఉన్న అభియోగపత్రంలోని రెండు, మూడు, నాలుగు అభియోగాలను కొట్టివేయాలన్న న్యాయశాఖ రూల్ 48(ఎ)అభ్యర్థనను గరౌఫిస్ మంజూరు చేశారు. ఈ అభియోగంలో సెక్యూరిటీస్ మోసం కుట్ర, వైర్–ఫ్రాడ్ కుట్ర, సెక్యూరిటీల ఫ్రాడ్ ఉన్నాయి. ఈ కొట్టివేతలు మోసంతో కూడినవి, అంటే, ఆరోపణలను మళ్లీ దాఖలు చేయడానికి వీల్లేదు. ఈ కొట్టివేత ప్రాసిక్యూటర్ విచక్షణ మేరకు తీసుకున్నదే తప్ప ఆరోపణలపై ఇచ్చిన తీర్పు కాదని న్యాయమూర్తి నొక్కిచెప్పారు.ఈ తీర్పును ప్రభుత్వ నిర్ణయంతో ఏకీభవిస్తునట్లుగా గానీ లేదా కేసు యోగ్యతపై అభిప్రాయంగా గానీ ఎవరూ పొరపాటుగా భావించకూడదని గరౌఫిస్ తీర్పులో రాశారు.






ర్యాలీలో తెలంగాణ ప్రతినిధులు



## ఎఐఎస్‌ఎఫ్‌ది గర్వించే చరిత్ర

(మొదటి పేజీ తరువాయి)

చేరుకున్నారు. ఎఐఎస్‌ఎఫ్ గీతంతో కార్యక్రమం ప్రారంభమైంది. విద్యార్థులను ఉద్దేశించి ఎఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ప్రస్తుత ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ ప్రసంగిస్తూ భారతదేశ మొట్టమొదటి విద్యార్థి సంఘంగా ఎఐఎస్‌ఎఫ్‌కు స్వాతంత్ర్య ఉద్యమంలో గర్వించదగిన చరిత్ర ఉందని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో హేము కలానీ, కనకలతా బారువా, అనేక ఇతర ఎఐఎస్‌ఎఫ్ నాయకులు చేసిన త్యాగాలను ఆమె ప్రస్తావించారు.ఎఐఎస్‌ఎఫ్ నాయకుడు రోషన్ కుమార్ విద్యార్థుల భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఐక్యత, వారి గళం బలంగా వినిపించడం కోసం ఎఐఎస్‌ఎఫ్ పోరాటం కొనసాగిస్తుందని విశ్వజీత్ కుమార్ నొక్కి చెప్పారు. బారాబంకీ జిల్లా అధ్యక్షుడు జస్‌బీర్ సింగ్ బగ్గా నేతృత్వంలోని సిక్కు కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధికారులు సభ ప్రాంగణానికి వచ్చి అమర్‌జీత్ కౌర్‌కు తల్వార్‌ను ప్రదానం చేసి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్ర సమితి సభ్యుడు రణధీర్ సింగ్ సుమన్, ఎఐఎస్‌ఎఫ్ బ్రిజ్‌మోహన్ వర్మ, వినయ్ సింగ్, ప్రవీణ్ వర్మ, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ముజమ్మిల్ జాహిద్ అలీ, ఉపాధ్యక్షుడు నోమాన్ ఖాన్, అరుణ్ ప్రకాశ్, రాష్ట్ర కార్యదర్శి సతీష్ కుమార్, సంయుక్త కార్యదర్శి చంద్రభాన్, అభిషేక్ వర్మ, మనీష్ చౌదరి, రీనా మౌర్య, అలోక్‌కుమార్, ఆదిత్యవర్మ, తదితరులు పాల్గొన్నారు.

## వేగంగా తగ్గిపోతున్న చమురు నిల్వలు

### జలసంధి వెంటనే తెరవాలని ఐఇఎ హెచ్చరిక

**పారిస్:** ప్రపంచవ్యాప్తంగా చమురు నిల్వలు వేగంగా తగ్గిపోతున్నాయని అంతర్జాతీయ ఇంధన పర్యవేక్షక సంస్థ (ఐఇఎ) హెచ్చరిక చేసింది. తక్షణం హోర్ముజ్ జలసంధిని తెరవాలని, జలసంధి ద్వారా రాకపోకలను ప్రారంభించాలని కోరింది. జలసంధిలో రాకపోకలు స్తంభించడంవల్ల ప్రపంచదేశాల్లో చమురు సంక్షోభం తలెత్తింది. గత ఏడాది ఏప్రిల్ తర్వాత చమురు నిల్వలు 7.9 బిలియన్ బ్యారెళ్ళకంటే తక్కువస్థాయికి పడిపోయాయని గమనించినట్లు ఐ.ఇ.ఎ తన తాజా నివేదికలో స్పష్టం చేసింది. ఈ ఏడాది చివరినాటికి చమురు మార్కెట్ తిరిగి మిగులు దశకు చేరుకుంటుందని తొలుత అంచనావేసినప్పటికీ ఈ పరిస్థితులు కనిపించడంలేదని, తక్షణం హోర్ముజ్ జలసంధి ద్వారా రాకపోకలను పునరుద్ధరించాల్సిన ఆవశ్యకత పెరిగిందని పేర్కొంది. చమురు సరఫరా పునరుద్ధరణలో లోపాలవల్ల ప్రామాణిక ముడిచమురు ధరలు రెండు నెలల గరిష్ఠస్థాయికి పెరిగాయని నివేదిక తెలియజేసింది.

# జలసంధి తెరవాలంటే షరతులు ఒప్పుకోవాల్సిందే

**అమెరికాకు ఇరాన్ అగ్రశ్రేణి భద్రతాధికారి రెజాయీ హెచ్చరిక**


**టెహ్రాన్:**ఆరు షరతులను అమెరికా అంగీకరిస్తేనే హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరుస్తామని కొత్తగా నియమితుడైన ఇరాన్ అత్యున్నత జాతీయ భద్రతా అధికారి (ఎస్ఎన్ఎస్‌సి) మొహ్సిన్ రెజాయీ స్పష్టం చేశారు. టెహ్రాన్‌లో ఉన్న చైనా రాయబారి జోంగ్ పియాతో సమావేశం సందర్భంగా రెజాయీ పశ్చిమాసియా పరిణామాలపై స్పందించారు. ఇరాన్ షరతులను అమెరికా ఒప్పుకున్నప్పుడు మాత్రమే జలసంధిని తిరిగి తెరవడం సాధ్యపడుతుందని స్పష్టం చేశారు. అమెరికా–ఇజ్రాయెల్ దేశాలు పర్షియన్ గల్ఫ్‌లో దురాక్రమణ చర్యలకు పాల్పడటంతో ఈ ఏడాది మార్చి నెలారంభం నుండి హోర్ముజ్ జలసంధిని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్‌జిసి) స్వాధీనం చేసుకుంది.



పశ్చిమాసియాలో ప్రాంతీయ మిత్రదేశాలపై యుద్ధం ముగించాలని, స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయాలని, యుద్ధనష్టపరిహారం చెల్లించాలని, పశ్చిమాసియాను ఖాళీ చేసి వెళ్ళిపోవాలని, ఇంకెప్పుడూ భవిష్యత్తులో ఇరాన్‌ను బెదిరించే చర్యలకు పాల్పడకూడదని మూడు రోజుల క్రితం ఇరాన్ షరతులు విధించింది. అమెరికా తన వైఖరిని మార్చుకోవాలని, లేకపోతే పరిస్థితిలో ఎలాంటి మార్పు ఉండదని రెజాయీ అన్నారు. కొన్ని వారాలుగా ఇరుపక్షాలమధ్యా జరుగుతున్న చర్చల్లో మధ్యవర్తుల ద్వారా మరికొన్ని షరతులను కూడా అమెరికాకు తెలియజేశామని ఆయన చెప్పారు. ఇరాన్ పొరుగుదేశం ఒమన్‌తో కలిసి ఈ జలసంధిని నిర్వహించడంపై ఒక ఒప్పందానికి వస్తే, హోర్ముజ్‌ను తిరిగి తెరవడం లేదా మూసే ఉంచడం అనే విషయంపై ఆ ఒప్పందం ఎలాంటి ప్రభావం చూపించబోదని, అమెరికా దిగి వచ్చేవరకూ జలసంధి తెరవబోమని చెప్పారు.

**జలసంధి పూర్తిగా అమెరికా నియంత్రణలోనే ఉంది:ట్రంప్**

హోర్ముజ్ జలసంధి పూర్తిగా అమెరికా నియంత్రణలోనే ఉందని డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇరాన్ పాలకులను తాము నమ్మే పరిస్థితి లేదని అన్నారు. "నేను ఇరాన్‌ను నమ్మను, ఇరాన్‌ను నేను నమ్ముతానని ఎందుకు అనుకుంటున్నారు? అసలు ఇరాన్‌ను నమ్మేవారిలో చివరి వ్యక్తిని నేనే" అన్నారు. ఒహియోలో పర్యటించిన తర్వాత మేరీల్యాండ్ జాయింట్ బేస్‌లో పాత్రికేయులతో ట్రంప్ మాట్లాడుతూ, వారు నిరంతరం అబద్ధాలు చెబుతూనే ఉన్నారని విమర్శించారు. చర్చల సందర్భంగా వారు అన్నీ అసత్యాలే మాట్లాడారని, మాట తప్పారని విమర్శించారు. హోర్ముజ్ జలసంధి ఇంకా పూర్తిగా మా నియంత్రణలోనే ఉంది అని చెప్పారు. ఐదు నెలలుగా జరుగుతున్న యుద్ధం వల్ల జలసంధిలో నౌకల రాకపోకలు ఆగిపోయాయి. తాజా సమాచారం ప్రకారం ఆరు నౌకలు మాత్రమే జలసంధిలో ప్రయాణం చేశాయి.



**ఇరాన్‌కు వెళ్ళే నౌకపై అమెరికా దాడి**

ఇరాన్ ఓడరేవుకు వెళ్ళేందుకు ప్రయత్నం చేసిన ఒక నౌకపై అమెరికా సెంట్‌కామ్ దళాలు దాడి చేశాయి. పనామా జెండాతో వెళుతున్న నౌకపై హెలికాప్టర్ నుండి దాడి చేసినట్లు సెంట్‌కామ్ ప్రకటించింది. జలసంధిలో ఇరాన్ ఓడరేవులపై అమెరికా అమలు చేస్తున్న దిగ్బంధనాన్ని ఉల్లంఘించేందుకు పనామా జెండా నౌక ప్రయత్నం చేసినందువల్లనే నౌకలోని ఇంజిన్ గదిపై క్షిపణి దాడి చేశామని తెలిపింది. పదే పదే హెచ్చరికలు చేసినప్పటికీ పట్టించుకోలేదని, దీంతో అమెరికా ఎంహెచ్–60 హెలికాప్టర్ నుండి ఎంవి వేలా నోవా నౌకపై క్షిపణి దాడి చేసిందని సెంట్‌కామ్ తెలియజేసింది. జులై 14వ తేదీన ఇరాన్ ఓడరేవులపై అమెరికా సైన్యం దిగ్బంధనాన్ని పునరుద్ధరించిన తర్వాత ఈ విధంగా ఉత్తర్వులను ఉల్లంఘించిన నౌకలపై దాడి చేయడం ఇది మూడవసారి. ఇప్పటివరకూ 55 నౌకలను ఇరాన్ ఓడరేవులకు వెళ్ళనీయకుండా దారిమళ్ళించామని, మరో మూడు నౌకలను స్వాధీనం చేసుకున్నామని తెలియజేసింది. సెంట్‌కామ్ దళాలు ఈ ఏడాది ఏప్రిల్ 13వ తేదీ నుండి జూన్ 18వ తేదీ వరకూ మొదటి విడతగా ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనం అమలు చేశాయి. ఈ ఓడరేవులకు నౌకలను వెళ్ళనివ్వలేదు. ఈ ఓడరేవుల నుండి నౌకలను బయటకు రానీయలేదు. ఈ 35 రోజుల కాలంలో 140 నౌకలను ఇరాన్ ఓడరేవులకు వెళ్ళకుండా సెంట్‌కామ్ దారిమళ్ళించగా, మరో తొమ్మిది నౌకలను స్తంభింపజేసింది.

## దక్షిణ లెబనాన్‌లో కార్చిచ్చు సృష్టించిన ఇజ్రాయెల్

**బీరూట్:**దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ ఉద్దేశపూర్వకంగా కార్చిచ్చు సృష్టించింది. దీంతో అటవీ ప్రాంతాలు దగ్ధం అవుతున్నాయి. దక్షిణ లెబనాన్ అంతటా ఆలివ్ తోటలు,వ్యవసాయ పంట భూముల్లో మంటలు సృష్టించిందని అగ్నిమాపకదళం పేర్కొంది.దళాలు వాటిని అదుపు చేసే పనిలో ఉన్నాయి. కఫర్ షౌబా గ్రామానికిపైన ఉన్న పర్వతంపైన అడవుల్లో బాంబులు వేసి ఇజ్రాయెల్ సైన్యం మంటలు సృష్టించిందని దళాలు చెప్పాయి. ఆగస్టు ఐదో తేదీ నుండి ఈ గ్రామంలో కార్చిచ్చు వ్యాపించింది. కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటినుండీ ఐడిఎఫ్ డ్రోన్లు వచ్చి నిప్పును రాజేసే పదార్థాలను అటవీ ప్రాంతాల్లో జారవిడుస్తున్నాయని దళాలు పేర్కొన్నాయి. పగటిపూట కూడా నిప్పురాజుకునేవిధంగా వృక్షసంపదపై నిప్పురాజేసే పదార్థాలు జారవిడుస్తున్నారు.లెబనాన్–ఇజ్రాయెల్ సరిహద్దుల్లో ఉన్న కఫర్ చౌబా,జెజ్జిన్,పశ్చిమ బెకా లోయల మధ్య ఉన్న పెద్ద దట్టమైన అడవులలో కార్చిచ్చును ఇజ్రాయెల్ ఆయుధాలు రగిలించాయి. గడచిన శుక్రవారం మధ్యాహ్నం అటవీప్రాంతంలో డ్రోన్లు నిప్పును రాజేసే ఆయుధాలు జారవిడవడంతో కఫర్ చౌబాలో మంటలు చెలరేగాయని పౌర రక్షణకేంద్రం అధిపతి సమీర్ హర్దాన్ చెప్పారు.

# పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక సహకారానికి ఇరాన్ సిద్ధం: మసూద్ పెజెష్కియన్

**టెహ్రాన్:**పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక సహకారాన్ని లోతుగా పెంపొందించుకోవడానికి ఇరాన్ సంసిద్ధంగా ఉందని ఆ దేశ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ పునరుద్ఘాటించారు. చమురు రవాణా సమస్యలను అధిగమించే విషయంపై చర్చించేందుకు టెహ్రాన్ పర్యటనకు వెళ్ళిన పాకిస్థాన్ హోంశాఖామంత్రి సయ్యద్ మొహ్సిన్ రెజా నక్వీతో ముఖాముఖీ సంభాషణ సందర్భంగా, రాజకీయ,ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక సంబంధాలను,సహకారాన్ని పాకిస్థాన్‌తో విస్తరించుకోవడానికి ఇరాన్ సిద్ధంగా ఉందని పెజెష్కియన్ చెప్పారు. రెండు దేశాల ప్రజలమధ్య ఉన్న గాఢమైన చారిత్రక,సాంస్కృతిక సంబంధాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇరాన్‌తో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి పాకిస్థాన్ ప్రభుత్వం చూపిస్తున్న నిబద్ధతను ఆయన ప్రశంసించారు. పాకిస్థాన్ నాయకత్వ నిబద్ధత ఎంతో విలువైనదన్నారు.పరస్పర ఆసక్తి ఉన్న రంగాలలో సంబంధాలను విస్తరిస్తామన్నారు.రెండు దేశాలమధ్యా సంబంధాలకు ఉన్న ప్రాముఖ్యతను కూడా ఆయన ఉద్ఘాటించారు. ఈ సంబంధాలవల్ల ఈ ప్రాంతంలో స్థిరత్వం,భద్రత చేకూరుతుందన్నారు. పాక్ మంత్రి నక్వీ మాట్లాడుతూ, రెండు దేశాలమధ్య విదేశీయాన సంబంధాలు ఉన్నాయన్నారు. ద్వైపాక్షిక సహకారాన్ని పటిష్ఠం చేసేందుకు తమదేశం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఇప్పటికే చేసుకున్న ఒప్పందాలను అమలు చేయడంపై చిత్తశుద్ధిని పునరుద్ఘాటించారు. ముస్లిం ప్రపంచంలో బహిరంగ ఆణ్వాయుధ బలం ఉన్న ఏకైక దేశం పాకిస్థాన్ మాత్రమే. ఇటీవల మక్కాలో సౌదీ అరేబియా చొరవచేసి టర్కీ,పాకిస్థాన్‌లతో చేసుకున్న రక్షణ ఒప్పందం సంచలనాత్మకంగా మారింది.



## వసూలు చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మొండి బకాయిదారులుగా మారిన మిల్లర్లకు కేటాయించే ధాన్యాన్ని మహిళా సంఘాలకు అప్పగిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతి సీజన్‌లో ధాన్యం నిల్వకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే తగిన కార్యాచరణ రూపొందించాలన్నారు. ధాన్యం భారీగా వచ్చే నల్గొండ, సూర్యాపేట, నిజామాబాద్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాల్లో సైలో బ్యాగ్ నిర్మాణాలను పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో సైలో బ్యాగ్ నిర్మాణాలకు నియోజకవర్గానికి 50 నుంచి 100 ఎకరాల భూమిని కేటాయిస్తామని సీఎం తెలిపారు. వీటి నిర్మాణానికి సంబంధించి రెవెన్యూ, పౌరసరఫరాలు, మహిళా సంక్షేమ శాఖల మంత్రులతో సమావేశం ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వీబీ జీ రామ్ జీ లో ఫ్లాట్ ఫాం నిర్మాణానికి అవకాశం ఉన్నందున, పొలాలలో ప్లాట్‌ఫాంలు నిర్మించి జర్మన్ టెంట్లతో ధాన్యం నిల్వకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. మండల, గ్రామ స్థాయిలో ఉన్న ప్రైవేటు గోదాములు, ధాన్యం నిల్వకు ఉపయోపపడే కల్యాణ మండపాలు, పాత థియేటర్లు, ఇతర షెడ్లను ముందుగానే గుర్తించి ధాన్యం నిల్వకు లీజుకు తీసుకోవాలన్నారు. సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, పౌరసరఫరాల సంస్థ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సౌత్ ఇండియా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తూడి దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దోషిగా జస్టిస్ వర్మ

(మొదటి పేజీ తరువాయి)

సమాధానాలలో,సంజాయిషీలో ఎంతమాత్రం నిష్కపటత్వం కనిపించలేదు.దాటవేత ధోరణితో మాట్లాడారు.నివాసంలో లెక్కల్లో చూపించని నగదు, దాటవేత సమాధానాలు,ఆనాడు లభ్యమైన సాక్ష్యాలన్నీ కలవరపరచేవిగా ఉండటంతో ఈ విషయంపై చట్టసభలో చర్చ జరిగింది. దాదాపు 200 మంది ఎంపీలు జస్టిస్ వర్మను పదవి నుండి తొలగించాలని ఒత్తిడి చేశారు. అత్యున్నతస్థాయీ చట్టసభ ఒత్తిడి భరించలేక వర్మ తన పదవికి రాజీనామా చేశారు.నిజానిజాలు తెలుసుకునేందుకు లోక్‌సభ స్పీకర్ ముగ్గురు సభ్యులతో ఒక దర్యాప్తు కమిటీ ఏర్పాటు చేశారు.మౌఖికంగా సేకరించిన సాక్ష్యాలు,డాక్యుమెంటరీ సాక్ష్యాలతో రెండు సంపుటాలుగా ఈ నివేదిక సమర్పించారు.క్ష్యులను విచారణ చేసినప్పుడు, అక్కడ లభించిన పత్రాలతో జస్టిస్ వర్మ చేసిన వాదనలను పోల్చి చూసినప్పుడు ఎంతమాత్రం ఆయనను నమ్మడానికి అస్కారంలేకుండా ఉందని, సాక్ష్యాలకు, ఆయనకు వాదనకు ఎంతమాత్రం పొంతన లేదని కమిటీ తన నివేదికలో పేర్కొంది. ఒక అత్యున్నతస్థాయీ న్యాయమూర్తి పదవిలో ఉండి కూడా ఆయన బాహాటత్వ ధోరణితో నిజాయతీగా వ్యవహరించలేదు. ర్యాప్తు జరుగుతున్నందువల్ల న్యాయమంత్రిత్వశాఖ ఆయన రాజీనామాను ఆమోదించలేదు. 2025 మార్చి 14వ తేదీన జస్టిస్ వర్మ అధికారిక నివాసంలో మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక దళాన్ని పిలిపించారు. అగ్నిమాపకదళం మంటలు ఆర్పుతున్న సమయంలో స్టోర్‌రూములో సగం కాలిపోయిన కరెన్సీ కట్టలు భారీ పరిమాణంలో కనిపించాయి. దీంతో ఆయన అవినీతి బండారం బయటపడింది.

## ప్రతిపక్షం వినబోదు

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపక్ష నాయకుడు అన్నారు. షా ఇమేజ్ అనే బెలూన్ గాలి పోయిందని, దాన్ని మళ్లీ నింపడానికి చివరి ప్రయత్నం జరిగిందని, కానీ 'ఆ బెలూన్ అప్పటికే పేలిపోయిందని' గాంధీ పేర్కొన్నారు. విద్యార్థుల నిరసనలతో సహా అన్ని అంశాలపై పార్లమెంటులో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని షా ప్రకటించిన నేపథ్యంలో కాంగ్రెస్ నేత ఈ వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తాను ఒక విలేకరుల సమావేశం నిర్వహించామని, అమిత్ షా కల్పిత కథనాలను వినడానికి ఆసక్తి లేదని మిగిలిన ప్రతిపక్షం కూడా స్పష్టంగా చెప్పిందన్నారు. ఆయన ఇచ్చే ఉపన్యాసం లేదా చర్చలో పాల్గొనడానికి తమకు ఏ మాత్రం ఆసక్తి లేదన్నారు. అయితే విద్యార్థులపై ఎవరు కాల్పులు జరిపారు? పోలీసులు జరిపారని ఎవరు ఆదేశించారు? ఒక విద్యార్థి కంటి చూపు పోయేలా ఎవరు చేశారు? ఒక విద్యార్థి చెవిలో ఎవరు కాల్చారు? లాఠీలు, మేకులతో కూడిన కర్రలతో విద్యార్థులను కొట్టాలని ఎవరు ఆదేశించారు? ఆ ఆదేశం ఎవరు ఇచ్చారు? ఆ ఆదేశాన్ని హోం శాఖ లేదా అమలు చేసిందా అనే విషయాలను తెలుసుకోవాలని ఉందని రాహుల్ అన్నారు. ఢిల్లీ పోలీసులు, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) రెండూ హోం శాఖ పరిధిలోని వ్యవస్థలేనని ఆయన పేర్కొన్నారు. 'మన పిల్లలపై కాల్పులు జరపాలని అమిత్ షా ఆదేశించారా లేదా? ఒకవేళ ఆదేశించి ఉంటే, ఆయన బాధ్యుడు కాబట్టి రాజీనామా చేయాలి; ఒకవేళ ఆదేశించకపోతే, ఆయన అసమర్థుడు కాబట్టి రాజీనామా చేయాలి' అని డిమాండ్ చేశారు. జార్ఖండ్‌లో జరుగుతున్న విద్యార్థుల నిరసనలో తాను మౌనంగా లేనని రాహుల్‌గాంధీ చెప్పారు. 'మా విద్యార్థులపై ఎలాంటి హింసను మేము సహించబోమని నా పత్రికా సమావేశంలో స్పష్టంగా చెప్పాను. నేను మౌనంగా లేను, ఈ విషయాన్ని బహిరంగంగా చెబుతున్నాను' అని ఆయన అన్నారు.

## ప్రశ్నలన్నింటికీ జవాబు

(మొదటి పేజీ తరువాయి)

వరకు ఏ రకమైన చర్చకైనా మేము సిద్ధంగా ఉన్నాము' అని షా పేర్కొంటూ, ప్రభుత్వానికి దాచాల్సిన విషయం ఏమీ లేదని స్పష్టం చేశారు. పార్లమెంట్ ఉభయ సభల కార్యకలాపాలకు సుదీర్ఘ అంతరాయం కలిగిన తర్వాత వర్షాకాల సమావేశాలు ముగియడానికి ఒక్క రోజు ముందు హోం మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. తాను చర్చ నుండి పారిపోతున్నానని ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలపై స్పందిస్తూ, హోం మంత్రి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'అదృశ్యం', 'పారిపోయినవారు' వంటి పదాలు భారతదేశ ప్రజా, పార్లమెంటరీ చర్చల్లో ఇటీవలే వినిపించడం మొదలయ్యాయని ఆయన అన్నారు. జులై 20న పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైనప్పటి నుండి తాను క్రమం తప్పకుండా పార్లమెంట్ భవనంలోని తన ఛాంబర్‌కు వస్తున్నానని, కానీ ప్రతిపక్షాలు ఉభయ సభల కార్యకలాపాలను జరగనివ్వడం లేదని చెప్పుకొచ్చారు. 'సభ కార్యకలాపాలు సాగనివ్వనప్పుడు లోపలికి వెళ్లడంలో అర్థం ఏముంది? చర్చ విషయానికి వస్తే, నీట్ అంశానికి సంబంధించిన విద్యార్థుల నిరసనల అన్ని కోణాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి కిరణ్ రిజిజు చాలా స్పష్టంగా చెప్పా రు' అని పార్లమెంట్ ప్రధాన ద్వారం మకర్ ద్వా ర్' బయట విలేకరులతో మాట్లాడుతూ ఆయన అన్నారు.

## జెపిసికి ఎఫ్‌సిఆర్‌ఎ బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

పార్లమెంట్ శీతాకాల సమావేశాల మొదటి వారం చివరి రోజులోగా తన నివేదికను లోక్‌సభకు సమర్పించాలని కమిటీని కోరారు. ఈ తీర్మానం ఆమోదం పొందకముందు, కాంగ్రెస్ ఎంపి కెసి వేణుగోపాల్ మాట్లాడుతూ, ఈ బిల్లును సంయుక్త కమిటీకి పంపుతున్న విషయం ప్రతిపక్షానికి ఇప్పుడే తెలిసిందని, ఈ చట్టం మైనారిటీలు, ఎన్‌జిఒలను లక్ష్యంగా చేసుకుందని ఆరోపించారు. ఇది స్పష్ఠంగా మైనారిటీలు, ఎన్‌జిఒలను లక్ష్యంగా చేసుకోవడానికేనని, ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నామని వేణుగోపాల్ పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తోసిపుచ్చారు. ఈ బిల్లును సభా కమిటీకి పంపాలని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలే స్వయంగా డిమాండ్ చేస్తున్నాయని ఆయన అన్నారు. 'ఈ బిల్లుపై వారికి ఏవైనా అభ్యంతరాలు ఉంటే, వారు జెపిసిలో మాట్లాడవచ్చు. ఇది ఏ మైనారిటీ వర్గాన్ని లక్ష్యంగా చేసుకోలేదు' అని రిజిజు అన్నారు. సభకు అధ్యక్షత వహించిన బిజెపి ఎంపి జగదంబిక పాల్, ప్రభుత్వం ఈ డిమాండ్‌కు అంగీకరించిందని, అందువల్ల సంయుక్త పార్లమెంటరీ కమిటీలో 'సమగ్ర చర్చ' జరుగుతుందని అన్నారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపి అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ, ఎఫ్‌సిఆర్‌ఎ బిల్లుకు ప్రతిపక్షమంతా వ్యతిరేకంగా ఉందని, సభకు హాజరు కానందుకు షాపై వ్యంగ్యంగా విమర్శించారు. ప్రతిపాదిత చట్టం మైనారిటీలకు వ్యతిరేకం కాదన్న రిజిజు వాదనను ప్రస్తావిస్తూ, వారు ఇప్పటివరకు తీసుకొచ్చిన ఏ బిల్లు మైనారిటీలకు వ్యతిరేకం కాదో ఆయన స్పష్టం చేయాలి అని యాదవ్ అన్నారు. డిఎంఎ ఎంపి టి.ఆర్.బాలు కూడా ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, మార్చి 25న లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఈ బిల్లు, దేశంలోని ప్రభుత్వేతర సంస్థలు (ఎన్‌జిఒలు), విదేశీ నిధులపై ప్రభుత్వ పర్యవేక్షణను కఠినతరం చేయాలని ప్రతిపాదిస్తోంది. ఒక సంస్థ తన ఎఫ్‌సిఆర్‌ఎ లైసెన్సును కోల్పోతే, దాని ఆస్తులను నిర్వహించడానికి, పారవేయడానికి ఒక ప్రత్యేక అధికార సంస్థను ఏర్పాటు చేయాలని ఇది కోరుతోంది. ఈ బిల్లులోని కొన్ని నిబంధనలు, క్రైస్తవ ఎన్‌జిఒలకు, మైనారిటీలు నడుపుతున్న సామాజిక సంక్షేమ, విద్యా సంస్థలకు అందే చట్టబద్ధమైన విదేశీ నిధులపై ప్రభావం చూపవచ్చని ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి. ప్రతిపాదిత ఈ చట్టం మతానికి ప్రత్యేకమైనది కాదని, విదేశీ విరాళాలను నియంత్రించడమే దీని లక్ష్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ బిల్లును సమగ్ర పరిశీలన కోసం ఒక సంయుక్త కమిటీకి పంపాలని నాగాలాండ్ ముఖ్యమంత్రి నైఫియు రియో, మిజోరం ముఖ్యమంత్రి లాల్దుహోమా గతంలోనే కేంద్రాన్ని కోరగా, మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ కె సంగ్మా కూడా దీనిలోని నిబంధనలపై కేంద్రానికి ఆందోళన వ్యక్తం చేశారు.

## టవర్స్‌కు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం చేపట్టింది. ఇందు కోసం క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ఇప్పటివరకు సుమారు 90 ఎకరాలను ఎంపిక చేశారు.

తొలి దశలో 18 చోట్ల 7,340 ఫ్లాట్ల నిర్మాణం చేపడుతుంది. హైదరాబాద్ పరిధిలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వీటిని నిర్మించనున్నారు. మల్కాజిగిరి కౌకూర్‌లో, శేరిలింగంపల్లి రాయదుర్గంలో, మహేశ్వరం జల్‌పల్లిలో, నాంపల్లిలో రెడ్‌హిల్స్‌లో నీలోఫర్ సైట్‌లో నిర్మించనున్నారు. సనత్‌నగర్‌లో పాటిగడ్డ, మలక్‌పేటలో గడ్డిఅన్నారం, ఇబ్రహీంపట్నం బండ్లగూడ, మేడ్చల్ పోచారం, రాజేంద్రనగర్ మైలార్‌దేవ్‌పల్లి, కుత్బుల్లాపూర్ గాజులరామారం, ఖైరతాబాద్ పరిధిలో హకీంపేట్ దర్గా వద్ద, జూబ్లీహిల్స్‌లో, అంబర్‌పేట సిటీ పోలీస్ లైన్స్‌లో, సికింద్రాబాద్ కంటోన్‌మెంట్ బోయిన్‌పల్లిలో, కార్వాన్ కుల్సుంపురా పోలీస్ క్వార్టర్స్‌లో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మించనున్నారు. రూ.807.40 కోట్లతో వీటి నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఒక్కో ఇందిరమ్మ ఇల్లు 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియా, 528 చదరపు అడుగుల బిల్టప్ ఏరియా ఉంటుంది. ఒక్కో ఫ్లాట్‌కు ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందిస్తుంది. ఒక్కో ఫ్లాట్‌కు లబ్ధిదారుడి వాటా రూ. 6 లక్షలు ఉంటుంది. రూ.6 లక్షల వరకు కుటుంబ వార్షిక ఆదాయం ఉన్న వారు ఈ పథకానికి అర్హులు. దరఖాస్తుదారుడికి క్యూర్ పరిధిలో సొంత ఇల్లు, ఫ్లాట్ లేదా ఫ్లాట్ ఉండకూడదు. ఒక కుటుంబానికి ఒక ఫ్లాట్ మాత్రమే కేటాయిస్తారు. దరఖాస్తుదారులు తాము నివసిస్తున్న అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ప్రాజెక్టుకే దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు సమయంలో ఎలాంటి సర్టిఫికెట్లు అవసరం లేదు. దరఖాస్తు ఫీజు రూ.100లు, టోకెన్ అడ్వాన్స్ రూ.10 వేలు చెల్లించాలి. ఫ్లాట్ కేటాయింపు జరగకపోతే ఈ డబ్బు తిరిగి చెల్లిస్తారు. ఫ్లాట్ కేటాయింపు జరిగితే ఆ మొత్తాన్ని లబ్ధిదారుడి వాటాలో సర్దుబాటు చేస్తారు. మీసేవ కేంద్రాలు, meeseva.telangana.gov.in, మీ సేవ వాట్సాప్ సర్వీస్ **8096958096** ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తుల స్వీకరణకు ఆగస్టు 15, 2026 చివరి తేదీగా నిర్ణయించారు. అర్హతలను పరిశీలించిన అనంతరం లాటరీ విధానంలో ఫ్లాట్లను కేటాయిస్తారు. ఫ్లాట్ల కేటాయింపుల్లో ఎస్సీలకు 14 శాతం, ఎస్టీలకు 5 శాతం, బీసీలకు 16 శాతం, దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్, క్లాస్4, పారిశుధ్య కార్మికులకు 10 శాతం రిజర్వేషన్ ఉంటుంది. మిగిలిన 50 శాతం ఫ్లాట్లు జనరల్ కేటగిరీకి కేటాయిస్తారు. అన్ని కేటగిరీలలో 30 శాతం ఫ్లాట్లను మహిళలకు రిజర్వ్ చేస్తారు. ప్రొవిజనల్ అలాట్‌మెంట్ సమయంలో రూ.1 లక్ష, ఆర్‌సిసి నిర్మాణం పూర్తయ్యాక రూ.2 లక్షలు, ఫినిషింగ్ దశలో మరో రూ. 2 లక్షలు, మిగిలిన మొత్తాన్ని ఫ్లాట్ అప్పగించే సమయంలో చెల్లించాల్సి ఉంటుంది.

**గృహ నిర్మాణ రంగంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది**

"హైదరాబాద్ నగరం నడిబొడ్డున పేదవాడి ఇంటికి పునాది వేయడం అంటే కేవలం ఒక భవనం నిర్మించడం కాదు.ఒక కుటుంబానికి భద్రత, ఒక తరానికి భరోసా, పేదవాడికి గౌరవంతో కూడిన జీవితం అందించడమే" అని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో ఇళ్ల నిర్మాణంపై బుధవారం అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి సంబంధించి గత నెల 20వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించామని, ఇప్పటివరకు సుమారు 50 వేల దరఖాస్తులు అందాయని మంత్రి తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని దరఖాస్తుల స్వీకరణ గడువును ఆగస్టు 15వ తేదీ వరకు పొడిగించినట్లు చెప్పారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం అర్హతలను పూర్తిస్థాయిలో పరిశీలించి, ఎలాంటి రాజకీయ జోక్యం, సిఫార్సులు, అవకతవకలకు తావులేకుండా అర్హులైన పేదల నుంచి పారదర్శక పద్ధతిలో డ్రా ద్వారా ఇళ్ల కేటాయింపు జరుగుతుందన్నారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం హైదరాబాద్ గృహ నిర్మాణ రంగంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందన్నారు.

## సభకు మాత్రం రారు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రయోగించిన నాటి నుంచి ప్రతిపక్షాలు ప్రతిరోజూ కేంద్ర హోం మంత్రి ప్రకటన కోసం పట్టుబట్టాయి. ఎందుకంటే ఘటన జరిగిన రాజధాని ఢిల్లీ పరిధిలో పోలీసులు, కేంద్ర బలగాలు ప్రత్యక్షంగా కేంద్ర హోం మంత్రి ఆధీనంలోనే ఉంటాయి. అందుకే ప్రత్యేకించి ఆయన సభకు రావాలని డిమాండ్ చేస్తున్నా, అమిత్ షా అటు రాజ్యసభ, ఇటు లోక్‌సభకు రాకుండా ముఖం చాటేశారు. అకస్మాత్తుగా సమావేశాలు ముగిసే ఒక రోజు ముందు తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని, స్వయంగా తానే జవాబిస్తానని అనడం ద్వారా, ఇన్ని రోజులు ప్రభుత్వం సభ వాయిదా వేసుకుంటూ పోయిన అప్రదిష్ట నుంచి దృష్టి మళ్ళించటమే కేంద్ర ప్రభుత్వం, హోం మంత్రి ఉద్దేశ్యంగా కనపడుతోంది. నిజంగా ఆయనకు చిత్తశుద్ధే ఉంటే, తొలి రోజు నుంచి ప్రతిపక్షాలు అనేకమార్లు వాయిదా తీర్మానం నోటీసులు ఇచ్చాయి. వాటిని ఆమోదింపజేస్తే, చర్చ జరిగే అవకాశం ఉండేది. పోనీ, తాము చర్చకు సిద్ధమేనని మొదట్లోనే అమిత్ షా స్వయంగా సభకు వచ్చి చెప్పినా పోయేది. ఇరవై రోజులకుపైగా సమావేశాలు వృథా అయ్యేవి కావు. అలా కాకుండా, సమావేశాలు ఒక్కరోజు కూడా సవ్యంగా జరగలేదనే అపఖ్యాతిని ప్రతిపక్షం ఖాతాలో వేసేందుకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజూ రెండు రోజులుగా సభలో చర్చకు సిద్ధమేనని చెబుతున్నారే తప్ప, అందుకు వాతావరణాన్ని సృష్టించలేకపోయారు.

**స్వంత శాఖల బిల్లులనే ప్రవేశపెట్టలేకపోయారు**

ఈ సారి పార్లమెంటు ముందు అమిత్ షా ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర హోం మంత్రిత్వ శాఖతో పాటు, సహకార శాఖకు సంబంధించిన అనేక ముఖ్యమైన బిల్లులు ఉభయ సభల ముందుకు వచ్చాయి. వందేమాతరం బిల్లు, కేరళ పేరును కేరళంగా మార్చే బిల్లు, జాతీయ సహకార అభివృద్ధి చట్ట సవరణ బిల్లులతో పాటు కీలకమైన విదేశీ విరాళాల చట్ట సవరణ(ఎఫ్‌సిఆర్‌ఎ) బిల్లులపై ప్రతిపాదకుడిగా అమిత్‌షా పేరే ఉంది. ఇన్ని బిల్లులు ప్రవేశపెట్టినా ఆయన మాత్రం సభ లోపలికి వచ్చిన దాఖలాలు లేవు. వాటిని ఆయా శాఖల సహాయ మంత్రులే ప్రవేశపెట్టారు. ఇదే విషయాన్ని ప్రతిపక్షాలు ప్రశ్నించగా, సహాయ మంత్రులు ప్రవేశపెట్టేందుకు నిబంధనలు అనుమతిస్తాయని కేంద్ర మంత్రులు చెప్పారు. అయితే, రాజ్యసభలో బుధవారం సహకార చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టే సమయంలో ప్రతిపక్ష నాయకుడు మల్లిఖార్జున ఖర్గే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏదో ఒక రోజు, ఏదో కారణంతో బిల్లు ప్రతిపాదించే మంత్రి రాలేదంటే అర్థం చేసుకోవచ్చని, కానీ ప్రతి రోజు ఇలాగే అయితే ఎలా అని ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. దానికి ట్రెజరీ బెంచ్‌ల నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. లోక్‌సభలో ఎఫ్‌ఆర్‌సిఎ బిల్లును జెపిసి పంపుతుండగా, కాంగ్రెస్ ఎంపి కె.సి.వేణుగోపాల్ అభ్యంతర పెడుతూ, బిల్లుపై అమిత్ షా పేరు ఉండడాన్ని ప్రస్తావించారు. ఆ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మరో వైపు 'అమిత్ షా మిస్సింగ్' అంటూ విపక్ష ఎంపిల చేస్తున్న నినాదాలకు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు గత రెండు రోజులుగా స్పందిస్తూ, ఆయన ఇక్కడే (పార్లమెంటు భవనంలోనే) ఉన్నారని, చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఆయనే జవాబిస్తారని చెప్పారు. ఆ సమయంలో కూడా హోం మంత్రి అమిత్ షా సభలో కనిపించలేదు. పార్లమెంటు ప్రాంగణంలో ఆయన ఛాంబర్‌లో ఉన్నారనే విషయాన్ని , ఆయన ఇక్కడే ఉన్నారని చెప్పడం ద్వారా సభలోనే ఉన్నారనే భావన కలిగించేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది. మొత్తమ్మీద సభ జరిగే సమయంలో సభకు రాకుండా అమిత్ షా పార్లమెంటుకు వచ్చి తన ఛాంబర్‌లో ఉన్నప్పటికీ, ఆయన సభలోనే ఉన్నట్లుగా ప్రజలను తప్పుదారి పట్టించేందుకు కేంద్ర మంత్రులు శతథా కృషి చేశారు. పైగా తాము చర్చకు సిద్ధమన్నా, ప్రతిపక్షాలే రాకుండా పారిపోయాయంటూ సభ వాయిదా పడిన అనంతరం మంత్రి కిరణ్ రిజిజు చతురతతో పాపాన్ని ప్రతిపక్షాలపై తోసేశారు.

వర్షాకాల సమావేశాల ప్రారంభంలో 'చలో సంసద్' ఘటనలపై చర్చకు పట్టుబడుతూ ప్రతిపక్షాలు ఇచ్చిన వాయిదా తీర్మానం నోటీసులు ఉభయ సభాధిపతుల తిరస్కృతికి గురయ్యాయి. ఆ తరువాత ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నిర్దిష్టంగా రెండు ప్రశ్నలకు జవాబు కోరుతూ కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. అందులో ఢిల్లీ పోలీసులు, రిజర్వ్ పోలీసు బలగాలు ప్రత్యక్షంగా కేంద్ర హోం మంత్రి పరిధిలోకే వస్తాయి కాబట్టి, విద్యార్థులపై పెల్లెట్ గన్ ప్రయోగించటానికి ఆదేశాలు ఎవరిచ్చారు? నాడు పోలీసులతో పాటు, సాధారణ దుస్తుల్లో ఉండి లాఠీఛార్జ్ చేసిన వ్యక్తులు ఎవరు? అని ప్రశ్నించారు. తన లేఖకు సమాధానం ఇప్పటికీ రాలేదని రాహుల్‌గాంధీ చెప్పారు. కాబట్టి తాము వాటిపై హోం మంత్రి ప్రకటనను కోరుతున్నామని, అంతే తప్ప చర్చకు జవాబు పేరుతో పేరుతో ఆయన పాఠాలు వినేందుకు సిద్ధంగా లేమని రాహుల్ గాంధీ, ప్రతిపక్ష ఎంపిలు డిమాండ్ చేస్తున్నారు. పైగా హోం మంత్రి బాధ్యత వహించి రాజీనామా డిమాండ్ కూడా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వర్షాకాల సమావేశాలు జరిగినన్ని రోజులు సభలోకి ప్రవేశించకుండా, సమావేశాలు ముగిసేందుకు ఒకరోజు ముందు అమిత్ షా ఒకరిద్దరు మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. తాను సమాధానమిచ్చేందుకు సిద్ధమేనని, చర్చను కోరుతూ ప్రతిపక్షాలు సరైన రీతిలో స్పీకర్‌కు నోటీసు ఇవ్వాలని అనడం ద్వారా నెపం నుంచి తప్పించుకునే యత్నం చేసారు. పైగా ప్రకటన ఇస్తే, పరిమితంగానే ఉంటుందని, చర్చకు జవాబివ్వడం సమగ్రంగా ఉంటుందన్నారు. నిజమే, ఏదైనా విషయంలో స్పీకర్ ముందస్తు అనుమతి తీసుకుని మంత్రులు సభ ముందు ప్రకటన చేయవచ్చు. దానిపై వివరణలు కోరే అవకాశం ఉంటుందే తప్ప పెద్దగా చర్చకు తావుండదు. కానీ, పార్లమెంటు సమావేశంలో ఉండగా, దానికి ఆమడ దూరంలో జరిగిన అసాధారణ ఘట్టాలపై ప్రకటన అనంతరం విపులంగా వివరణ కోరేందుకు విపక్షాలకు తగిన వెసులుబాటును ఇవ్వడంలో పెద్దగా అభ్యంతరమేమీ ఉండకపోవచ్చు. అయితే, ప్రభుత్వం కూడా నీట్ లీకేజీ, తదనంతర పరిణామాలపై చర్చకు సిద్ధమని అంటుందే తప్ప ప్రతిపక్షాలు కోరుతున్నట్లుగా నిరసన తెలియజేస్తున్న విద్యార్థులపై లాఠీఛార్జ్, పెల్లెట్ గన్‌ల గురించి కాదు. నీట్ లీకేజీ అంశంపై ఇప్పటికే ప్రశ్నపత్రాల లీకేజీపై సవరణ బిల్లు ప్రవేశపెట్టిన సమయంలో చర్చ జరిగింది. అప్పుడు సైతం ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతుండగా అధికార పక్షం అడ్డుకోవడంతో అర్థాంతరంగా ఆయన ముగించాల్సి వచ్చింది.

సమావేశాలు ప్రారంభమైన రోజు నుంచి ప్రధాని మోదీ సైతం పార్లమెంటు భవనంలోని తన కార్యాలయంలో ఉంటునప్పటికీ, ఇప్పటి వరకూ రాజ్యసభ, లోక్‌సభ లోపలికి వచ్చి కూర్చున్న దాఖలాలు లేవు. ఆయన సెల్ఫీ వీడియోల ప్రకటనలు, ఎన్‌డిఎ ఎంపిలలతో 'మంగళ్ మిలన్' పేరుతో కలయిక సమావేశాలలోనే బాహ్య ప్రపంచానికి కనపడుతున్నారు. ఢిల్లీ ఘటనలకు సమాధానం చెప్పాల్సిన హోం మంత్రి మాత్రం ఏమీ మాట్లాడకుండా చివరి రోజు విచిత్ర విన్యాసాలతో తప్పించుకునే పనిలో పడ్డారు.

## ఎత్తిపోతలు చేపట్టండి

(మొదటి పేజీ తరువాయి)

సామర్థ్యం పెంపునకు సంబంధించి సమగ్ర అధ్యయనం చేయాలని సిఎం రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గూడెందొడ్డి పంప్‌డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు సంబంధించి కన్సల్‌టెంట్‌ను నియమించాలని సిఎం ఆదేశించారు. సమావేశంలో సమీక్షలో సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సెక్రటరీ మాణిక్ రాజ్, రాష్ట్ర నీటి పారుదల శాఖ కార్యదర్శి ఈ.శ్రీధర్, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివ కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మరణించారా?

(మొదటి పేజీ తరువాయి)

తమ పార్టీకి చెందిన 20 లక్షలమంది కార్యకర్తలు,అభిమానులు,ప్రజలు వీధుల్లోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.ప్రజలు భారీసంఖ్యలో వీధులలోకి వస్తే వారిని అదుపు చేయడం సాధ్యంకాదని కూడా హెచ్చరించారు. 2023 ఆగస్టు ఐదో తేదీ నుండి వివిధ ఆరోపణలపై ఇమ్రాన్‌ఖాన్ జైలులో ఉంటున్నారు.పదవీచ్యుతుణ్ణి చేసిన తర్వాత దేశవ్యాప్తంగా ఆయనపై ఉద్దేశపూర్వకంగానే 250కి పైగా కేసులు వివిధ ప్రాంతాలలో నమోదయ్యాయి.

జైలులోనే ఆయన మరణించారని జర్నలిస్టు సయీద్ ఖాన్ చెప్పడంతో పాకిస్థాన్ వ్యాప్తంగా తీవ్ర ఆందోళన చెలరేగింది. ఆయన సజీవంగా ఉండకపోవచ్చునని రావల్పిండిలోని పాకిస్థాన్ ఆర్మీ జనరల్ కేంద్ర కార్యాలయంలో ఉన్న ముగ్గురు సీనియర్ అధికారులు భావిస్తున్నట్లు ఆ జర్నలిస్టు చెప్పారు. ఐతే ఈ ముగ్గురు అధికారులు కళ్ళతో స్వయంగా చూడలేదు. వారి దగ్గర నిర్ధారణలు లేవు. చాలాకాలంగా ఇమ్రాన్‌ఖాన్‌ను కలుసుకునేందుకు ఆయన న్యాయవాదులను, కుటుంబ సభ్యులను కూడా అనుమతించడంలేదు. దీంతో ఇంకా ఇంకా సందేహాలు పెరుగుతున్నాయి. ఆయనను చూపించాలని, వెంటనే సాక్ష్యాలు ఇవ్వాలని డిమాండ్లు పెరిగాయి. ఆయన స్థాపించిన పాకిస్థాన్ తెహ్రీక్–ఎ–ఇన్సాఫ్ పార్టీ నాయకులు కూడా తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆయన చూపు మందగించిపోయిందని, సరైన వైద్య సదుపాయం అందడంలేదని గతంలోనే వార్తలు వెలువడ్డాయి. దీంతో ఆయన కుటుంబ సభ్యులు జైలు బయట తీవ్ర ఆందోళన,నిరసన వ్యక్తం చేసిన సంఘటనలు జరిగాయి. ఇప్పుడు మళ్ళీ ఈ వార్త వెలువడింది.

# భారత్‌తో తొలి టెస్ట్.. శ్రీలంక జట్టు ఇదే!



రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా భారత్‌తో జరగనున్న తొలి మ్యాచ్‌లో బరిలోకి దిగే టెస్ట్ టీమ్‌ను శ్రీలంక క్రికెట్ బోర్డు ప్రకటించింది. ధనంజయ డిసిల్వా సారథ్యంలోని 16 మంది సభ్యులతో కూడిన జట్టు వివరాలను బుధవారం వెల్లడించింది. కమిందు మెండిస్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. సీనియర్లతో పాటు ఇటీవల టీమిండియా వామప్ మ్యాచ్‌లో ఆకట్టుకున్న పలువురు ఆటగాళ్లకు ఈ జట్టులో చోటు దక్కింది. వెటరన్ వికెట్ కీపర్ నిరోషన్ డిక్వెల్‌లో సుదీర్ఘ విరామం తర్వాత జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. ముగ్గురు అనామక ఆటగాళ్లకు ఈ జట్టులో చోటు దక్కింది. సీనియర్ బ్యాటర్ కుశాల్ మెండీస్ తొడ కండరాల గాయంతో ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. మణికట్టు సర్జరీతో పాతుమ్ నిస్సంక సేవలను శ్రీలంక కోల్పోయింది. దాంతోనే 33 ఏళ్ల నిరోషన్ డిక్వెల్లాకు పిలుపు దక్కింది. 2023లో శ్రీలంక తరపున అతను చివరి టెస్ట్ మ్యాచ్ ఆడాడు. స్పిన్‌కు అనుకూలంగా ఉండే గాలే మైదానంలో బలమైన భారత బౌలింగ్ యూనిట్‌ను ఎదుర్కోవడానికి సిద్ధమవుతున్న శ్రీలంక బ్యాటింగ్ ఆర్డర్‌కు అతని చేరిక బలాన్ని చేకూర్చనుంది. ఆఫ్ స్పిన్ ఆల్రౌండర్ కేశర నువంత, బ్యాటర్ పాసిందు సూర్య బండారా, సోనా దినుషా తొలిసారి శ్రీలంక టెస్ట్ టీమ్ పిలుపును అందుకున్నారు. ఇటీవల భారత్‌తో జరిగిన వామప్ మ్యాచ్‌లో నువాంత మూడు వికెట్లు తీసాడు. భారత్ ఎ జరిగిన అనధికారిక టెస్ట్‌లో ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. దాంతో అతనికి శ్రీలంక జట్టులో చోటు దక్కింది. ఆగస్ట్ 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్ట్ జరగనుంది.

**భారత్తో తొలి టెస్ట్‌కు శ్రీలంక టీమ్**

ధనంజయ డి సిల్వా (కెప్టెన్), కమిందు మెండిస్ (వైస్ కెప్టెన్), లహిరు ఉదార, నిషాన్ మదుష్క, దినేష్ చండిమల్, పసిందు సూర్యబండార, సోనాల్ దినుషా, నిరోషన్ డిక్వెల్లా (వికెట్), రమేష్ మెండిస్, ప్రబాత్ జయసూర్య, కేశర నువంత, మిలన్ ద్రువాల్నాండో, ఎష్ని ధృవాల్నాండో, ఎఫ్. మధుశంక.

# ఢిల్లీ క్యాపిటల్స్‌లోకి హార్దిక్ పాండ్యా?



ఐపిఎల్ 2027 మినీ వేలానికి ముందు టీమిండియా స్టార్ ఆల్రౌండర్, ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా ట్రేడింగ్ హాట్ టాపిక్‌గా మారింది. హార్దిక్ ట్రేడింగ్ గురించి పూటకో వార్త తెరపైకి వస్తుంది. పేలవ ప్రదర్శన నేపథ్యంలో ముంబై ఇండియన్స్‌ను వీడేందుకు హార్దిక్ పాండ్యా సిద్ధమవ్వగా.. అతన్ని తీసుకునేందుకు ఫ్రాంచైజీలు ఆసక్తి చూపిస్తున్నాయి. మరోవైపు హార్దిక్ పాండ్యాను అడ్డుపెట్టుకొని తమకు కావాల్సిన ఆటగాళ్ల కోసం ఆయా ఫ్రాంచైజీలతో ముంబై ఇండియన్స్ సంప్రదింపులు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో రోజుకో ఫ్రాంచైజీలో హార్దిక్ పాండ్యా చేరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

**కెప్టెన్సీ అడగడంతో..**

ముందుగా చెన్నై సూపర్ కింగ్స్‌తో హార్దిక్ పాండ్యా ట్రేడ్ డీల్స్ జరిపిన ముంబై ఇండియన్స్ ఆ తర్వాత సన్రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్ జెయింట్స్, కెకెఆర్‌తో చర్చలు జరిపినట్లు ప్రచారం జరిగింది. హార్దిక్ పాండ్యా తన పాత ఫ్రాంచైజీ గుజరాత్ టైటాన్స్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించాడని, అతన్ని తీసుకునేందుకు ఆఫ్రాంచైజీ కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. కానీ హార్దిక్ పాండ్యా కెప్టెన్సీ అడగడంతో అతని ట్రేడ్ తిరస్కరించినట్లు తెలుస్తోంది. తాజాగా ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోకి చేరేందుకు హార్దిక్ పాండ్యా సిద్ధమయ్యాడని సోషల్ మీడియా వేదికగా ప్రచారం జరుగుతోంది. ఎక్స్ వేదికగా హార్దిక్ పాండ్యా ఫొటోను ఢిల్లీ క్యాపిటల్స్ షేర్ చేయడం ఈ వార్తలకు బలం చేకూరుస్తోంది. గాయంతో భారత జట్టుకు దూరమైన హార్దిక్ పాండ్యా.. ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సిఒఇలో రిహాబిలిటేషన్ తీసుకుంటున్నాడు. పూర్తి ఫిట్నెస్ సాధించడానికి కష్టపడుతున్నాడు.


**మిన్న మణితో ఫొటో**

అయితే ఢిల్లీ క్యాపిటల్స్ మహిళల జట్టు ఆల్రౌండర్ మిన్ను మణి కూడా సిఒఇలోనే రిహాబిలిటేషన్ తీసుకుంటుంది. ఈ సందర్భంగా అక్కడే ఉన్న హార్దిక్ పాండ్యాతో కలిసి ఫొటో దిగింది. ఈ ఫొటోను ఢిల్లీ క్యాపిటల్స్ ఎక్స్ వేదికగా పంచుకుంది. 'ఇద్దరు భారత ఆల్రౌండర్లు కలుసుకున్నారు'అని క్యాప్షన్‌గా పేర్కొంది. దాంతో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోకి చేరేందుకు హార్దిక్ పాండ్యా సిద్ధమయ్యాడని నెటిజన్‌లో కామెంట్ చేస్తున్నారు. ఒకవేళ హార్దిక్ పాండ్యా ఢిల్లీకి ట్రేడ్ అయితే అతనికి బదులు కేఎల్ రాహుల్‌తో పాటు ఓ బౌలర్‌ను ముంబై అడగవచ్చు. ఢిల్లీ క్యాపిటల్స్‌కు అనుభవం కలిగిన కెప్టెన్ అవసరం ఉంది. హార్దిక్ పాండ్యాతో ఆ లోటును తీర్చుకోవాలనే యోచనలో ఢిల్లీ ఉంది. హార్దిక్ పాండ్యా అరంగేట్ర సీజన్‌లో ముంబై ఇండియన్స్ విజేతగా నిలిచిందని, గుజరాత్ టైటాన్స్‌కు కూడా అతను టైటిల్ అందించాడని, ఇప్పుడు ఢిల్లీకి అందివ్వబోతున్నాడని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.





# మాయా నాగరికతకు కొత్త భాష్యం!






మెక్సికోలోని ప్రాచీన మాయా నగరం ఎల్ పామర్ వద్ద శాస్త్రవేత్తలు అత్యాధునిక 3డి స్కానింగ్ సాంకేతికతతో 'స్టీలా 46' అనే శిలాశాసనాన్ని తిరిగి అధ్యయనం చేసి, మాయా నాగరికత చరిత్రను కొత్తగా అర్థం చేసుకునే కీలక ఆధారాన్ని కనుగొన్నారు. ఈ పరిశోధనలో శిలాశాసనంపై చెక్కబడిన 'లాంగ్ కౌంట్' తేదీ క్రీ.శ. 180 సంవత్సరానికి చెందినదని వారు నిర్ధారించారు. దీంతో మాయా లోతట్టు ప్రాంతాల్లో ఇప్పటివరకు తెలిసిన లిఖిత చరిత్ర కాలక్రమం మరింత వెనక్కి వెళ్లింది. మాయా నాగరికత ప్రపంచంలోని అత్యంత అభివృద్ధి చెందిన ప్రాచీన నాగరికతల్లో ఒకటి. ఖగోళ శాస్త్రం, గణితం, క్యాలెండర్ వ్యవస్థ, లిపి రచనలో వారు విశేష ప్రగతి సాధించారు. అయితే మాయా లోతట్టు ప్రాంతాల్లో లభించిన తొలి శాసనాల కాలం గురించి ఇప్పటివరకు శాస్త్రవేత్తల మధ్య చర్చ కొనసాగుతోంది. ఎల్ పామర్‌లోని స్టీలా 46పై ఉన్న శాసనాలు కాలక్రమేణా చెరిగిపోవడంతో వాటిని పూర్తిగా చదవడం కష్టమైంది. ఇక్కడే 3డి స్కానింగ్ కీలక పాత్ర పోషించింది. సాధారణంగా కనిపించని సూక్ష్మ అక్షరాలు, ఉపరితల మార్పులను డిజిటల్ పద్ధతిలో గుర్తించి పరిశోధకులు శాసనాన్ని పునర్నిర్మించారు. దాంతో క్రీ.శ. 180 తేదీని గుర్తించగలిగారు. ఈ ఆవిష్కరణ మాయా నాగరికతలో లిపి వినియోగం, రాజకీయ వ్యవస్థలు, రాజవంశాల చరిత్ర మనం ఊహించిన దానికంటే మరింత పురాతనమని సూచిస్తోంది. అంటే మాయా ప్రజలు రెండువేల సంవత్సరాల కిందటే సంక్లిష్టమైన చారిత్రక నమోదులను నిర్వహించే స్థాయికి చేరుకున్నారని ఈ శిలాశాసనం వెల్లడిస్తోంది.

# టోల్టెక్ నాగరికతకు ప్రతీకలు ఈ శిల్పాలు



మెక్సికోలోని హిడాల్గో రాష్ట్రంలోని టులా పురావస్తు ప్రదేశం వద్ద ఉన్న అట్లాంటియన్ విగ్రహాలు ప్రాచీన మెసోఅమెరికన్ కళా వారసత్వంలో అత్యంత ప్రసిద్ధ శిల్పాల్లో ఒకటి. ఇవి టోల్టెక్ నాగరికతకు చెందిన భారీ రాతి శిల్పాలు. క్రీ.శ. 900 నుంచి 1150 మధ్య కాలంలో టోల్టెక్‌ల రాజధాని అయిన టోలాన్ నగరంలో వీటిని నిర్మించినట్లు చరిత్రకారులు భావిస్తున్నారు. ముఖ్యంగా 10వ–11వ శతాబ్దాల మధ్య ఇవి రూపుదిద్దుకున్నట్లు పురావస్తు ఆధారాలు సూచిస్తున్నాయి. టోల్టెక్‌లు క్రీ.శ. 10వ నుంచి 12వ శతాబ్దాల మధ్య మధ్య మెక్సికో ప్రాంతంలో ప్రభావవంతమైన నాగరికతగా ఎదిగారు. వారు శిల్పకళ, వాస్తుశిల్పం, యుద్ధ వ్యూహాలు, మతపరమైన ఆచారాల్లో ప్రత్యేకత సాధించారు. టులా నగరం వారి రాజకీయ, సాంస్కృతిక కేంద్రంగా నిలిచింది. యోధ సంప్రదాయానికి ప్రాధాన్యం ఇచ్చిన టోల్టెక్ సమాజంలో యుద్ధం, రక్షణ, ఆధ్యాత్మిక విశ్వాసాలు పరస్పరం ముడిపడి ఉండేవి. టులాలోని అట్లాంటియన్ విగ్రహాలు నాలుగు భారీ మానవాకార శిల్పాల సమాహారం. ఒక్కో విగ్రహం సుమారు 4.5 మీటర్లు (15 అడుగులు) ఎత్తు ఉంటుంది. వీటిని ప్రధానంగా బసాల్ట్ రాయితో చెక్కారు. ఈ శిల్పాల్లో యోధుల రూపాన్ని చూపించారు. తలపై ప్రత్యేకమైన అలంకరణలు, శరీరంపై సైనిక దుస్తులు, చేతుల్లో ఆయుధాలు, రక్షణ కవచాలు కనిపిస్తాయి. వీరి చేతుల్లో ఈటెలు, కవచాలు ఉన్నట్లు చెక్కారు. శిల్పాలపై కనిపించే సూర్య చిహ్నాలు, యుద్ధ సంకేతాలు టోల్టెక్‌ల సైనిక శక్తిని ప్రతిబింబిస్తాయి. ఈ విగ్రహాలు టులాలోని క్వెట్జల్‌కోఆటల్ దేవాలయం పైభాగంలో నిలబడి ఉండేవి. క్వెట్జల్‌కోఆటల్ అనేది 'ఈకలతో కూడిన పాము దేవుడు'గా ప్రసిద్ధి చెందిన మెసోఅమెరికన్ దేవత. అట్లాంటియన్ విగ్రహాలు కేవలం ఆలయ నిర్మాణానికి ఆధారాలుగా మాత్రమే కాకుండా, దేవాలయాన్ని రక్షించే దివ్య యోధులుగా కూడా భావించబడ్డాయి. అందువల్ల వీటిలో మతపరమైన భావనలు, రాజశక్తి, సైనిక గౌరవం కలిసి కనిపిస్తాయి. టులా నగరం ఒకప్పుడు గొప్ప పట్టణ నాగరికతకు కేంద్రంగా ఉండేది. అక్కడ భారీ పిరమిడ్లు, వేడుకల ప్రాంగణాలు, బంతి ఆటల మైదానాలు, విస్తృతమైన శిల్ప సంపద ఉండేవి. అయితే 12వ శతాబ్దం నాటికి అంతర్గత సంఘర్షణలు, రాజకీయ మార్పులు, వనరుల సమస్యల కారణంగా టులా క్రమంగా క్షీణించింది. అయినప్పటికీ టోల్టెక్‌ల ప్రభావం తరువాతి అజ్టెక్ నాగరికతపై గణనీయంగా పడింది. వారి కళ, మత విశ్వాసాలు, నిర్మాణ శైలులను అజ్టెక్‌లు స్వీకరించారు. టులాలోని అట్లాంటియన్ విగ్రహాలు కేవలం రాతి శిల్పాలు మాత్రమే కావు. అవి ఒక ప్రాచీన సమాజం యొక్క యుద్ధ శక్తి, మత విశ్వాసాలు, కళా నైపుణ్యం, సామాజిక వ్యవస్థలకు ప్రతీకలు. వేల సంవత్సరాల తరువాత కూడా ఈ విగ్రహాలు టోల్టెక్ నాగరికత వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్న అరుదైన పురావస్తు వారసత్వంగా నిలిచాయి.




# 'విశ్వనాథ్ అండ్ సన్స్' ప్రీ రిలీజ్ వేడుక

తమిళ అగ్ర కథానాయకుడు సూర్య నటించిన తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మమితా బైజు కథానాయికగా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. ఈ చిత్రం ఈనెల14న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో రానుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ లోని కోట్ల విజయ్ భాస్కర్ రెడ్డి స్టేడియంలో ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో సూర్య మాట్లాడుతూ 28 ఏళ్ళ నుంచి మీరు నాపై ఈ ప్రేమను చూపిస్తున్నారు. 20 ఏళ్ల క్రితం గజినీ సినిమాలో నన్ను సంజయ్ రామస్వామిగా ఆదరించారు. అదే మ్యాజిక్ ని తీసుకురావాలని వెంకీ, వంశీ అనుకున్నారు. రాధిక వల్ల ఈ సినిమా మరింత ప్రత్యేకంగా మారింది. మమిత ఎనర్జిటిక్ గా నటించింది. వెంకీ సిన్సియర్ డైరెక్టర్. దర్శకుడు కంటే రచయితగా ఇంకా ఎక్కువ అభిమానిస్తాను. ఇంత గొప్పగా రాయడం మామూలు విషయం కాదు. వెంకీతో మళ్ళీ కలిసి పని చేయడం కోసం ఎదురు చూస్తున్నాను. సూర్య సన్నాఫ్ కృష్ణన్ ఎంతో ప్రేమ ఇచ్చారు. 'విశ్వనాథ్ అండ్ సన్స్' కూడా అంతే ప్రేమ ఇస్తారని కోరుకుంటున్నాను. అన్నారు. నటి రాధికా శరత్ కుమార్ మాట్లాడుతూ 'హైదరాబాద్‌లో ఇలాంటి ఒక వేడుకలో పాల్గొని చాలా సంవత్సరాలు అయింది. ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకమైనది. ఈ జనరేషన్ కి ఇది ముఖ్యమైన సబ్జెక్ట్. ప్రేమ, బంధం విలువను తెలియజేసేలా ఈ సినిమా ఉంటుంది. మనసుకి దగ్గరయ్యే సినిమాలు కొన్ని ఉంటాయి. సూర్య మనసున్న నటుడు. కళ్లలో నిజాయితీ ఉంటుంది. సూర్య నాకు చిన్నప్పటి నుంచి తెలుసు. మనసులో ఉన్న భయాలను వదిలి, ఎంతో కష్టపడి గొప్ప నటుడిగా ఎదిగాడు. సూర్య గొప్ప నటుడు మాత్రమే కాదు, గొప్ప వ్యక్తి. ఎందరికో సాయం చేస్తున్నారు అన్నారు. నిర్మాత కె.ఎల్. నారాయణ, నిర్మాత వై. రవిశంకర్, రామజోగయ్య శాస్త్రి , నటుడు హైపర్ ఆది, నిర్మాత వై. రవిశంకర్, నిర్మాత కె.ఎల్. నారాయణ, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ పాల్గొన్నారు.

# చిరంజీవికి వ్యతిరేకం కాదు

## ప్రమాణ స్వీకారంలో నూతన కార్యవర్గం స్పష్టీకరణ



తెలుగు ఫిలిం అండ్ టివి డ్యాన్సర్స్, డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ 2025–2027 సంవత్సరానికి సంబంధించి ఉప ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది. అసోసియేషన్ అధ్యక్షురాలు సుమలతా దేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి యూనియన్ నాయకులు, డ్యాన్సర్లు, డ్యాన్స్ డైరెక్టర్లు, సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉప ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గ సభ్యులు ఈ సందర్భంగా తమ బాధ్యతలను స్వీకరించి ప్రమాణం చేశారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షురాలు సుమలతా దేవి మాట్లాడుతూ. బైలా నిబంధనల ప్రకారమే నిర్ణయాలు తీసుకుని నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. యూనియన్ సభ్యులందరూ తమకు సహకరించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి జి. బాలకృష్ణ మాట్లాడుతూ చిరంజీవికి తాము వ్యతిరేకమని గతంలో కొన్ని వార్తలు వచ్చాయని, అవి వాస్తవం కాదని స్పష్టం చేశారు. హెల్త్ ఇన్సూరెన్స్ కోసం తమ అసోసియేషన్‌కు ఆర్థికంగా సహాయం చేసిన చిరంజీవికి, రామ్ చరణ్ కి కృతజ్ఞతలు తెలుపుతూ, వారికీ తాము జీవితాంతం రుణపడి ఉన్నామని తెలిపారు. సభ్యుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని, ప్రతి సభ్యుడికి హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. ఎన్నికైన నూతన కార్యవర్గం ఇదే. ప్రధాన కార్యదర్శి: జి. బాలకృష్ణ, కోశాధికారి: ఇశ్రాయేలు పిట్ట (వడివేల్), ఉపాధ్యక్షులు: జి. శంకర్, జాయింట్ సెక్రటరీ: పి. నాగమల్లేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ: జి. రవితేజ, కార్యవర్గ సభ్యులుగా పి. కన్నయ్య, జి. వెంకన్న, ఎం. రమేష్, ఎం. రాములు, కె. నిరంజని, సిహెచ్. సాయిలక్ష్మి ఎన్నికైయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత టి జీ విశ్వ ప్రసాద్, కొరియోగ్రాఫర్ షేక్ జానీ బాషా, నటుడు తాగుబోతు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విలక్షణమైన నటుడిగా ఎదుగుతాడు



## 'కొరియన్ కనకరాజు' సక్సెస్ మీట్‌లో చిరంజీవి

వరుణ్ తేజ్ నటించిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు'. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మించాయి. 7న వరల్డ్ వైడ్ థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ హౌస్ ఫుల్ కలెక్షన్స్ తో రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ మెగా బ్లాక్ బస్టర్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్ గా జరిగింది. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ ఇలాంటి విజయాలను సెలబ్రేట్ చేసుకోవాలి. ఒక సినిమా విజయం సాధిస్తే నటీనటులు, టెక్నీషియన్లు, నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు ఇలా ఎంతోమందిలో సంతోషం నింపుతుంది. ప్రతి ఒక్కరూ గుండెల నిండా ఆనందంతో 'కొరియన్ కనకరాజు' విజయాన్ని ఆస్వాదిస్తున్నారు. ఈ సినిమా విజయానికి ప్రధాన కారణం దర్శకుడు మేర్లపాక గాంధీ. జనాలకు నచ్చే అద్భుతమైన కంటెంట్‌ను అందించారు. ఒక సినిమా విజయంలో దర్శకుడి బాధ్యత ఎంతో ఉంటుంది. గాంధీ అద్భుతమైన దర్శకుడు. తను ఇలాంటి మరెన్నో మంచి సినిమాలు తీయాలని కోరుకుంటున్నాను. హారర్ కామెడీ సినిమాలు ఇదివరకు చాలా వచ్చాయి. కానీ 'కొరియన్ కనకరాజు'లో కొరియన్ ఫ్లేవర్‌ను, ఆ కల్చర్‌ను తీసుకురావడం చాలా గొప్ప ఆలోచన. ఈ విజయంలో ఆ ఆలోచన ప్రధాన కారణం. అందుకు దర్శకుడిని ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. ఈ సినిమా ఇంత కమర్షియల్‌గా అందరినీ అలరించిందంటే దానికి మరో ప్రధాన కారణం నా బిడ్డ వరుణ్ తేజ్. వరుణ్ మొదటి నుంచి వైవిధ్యమైన సినిమాలు, కథలు, పాత్రలు చేస్తున్నాడు. 'ముకుంద', 'కంచె', 'అంతరిక్షం' ఇలా ప్రతి సినిమా ప్రత్యేకంగా ఉంటుంది. ప్రతి సినిమాలో వైవిధ్యం చూపిస్తున్నాడు. ఆర్టిస్ట్‌గా నిలబడాలనే తపన అతనిలో ఉంది. నటుడిగా ప్రతి సినిమాతో తనను తాను నిరూపించుకుంటున్నాడు. ఇదే నమ్మకంతో ముందుకు వెళ్తే ఒక విలక్షణమైన నటుడిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటాడు.వరుణికు పర్సనల్‌గా ఒక మాట చెప్పాలి. ఇది వరుణ్ సక్సెస్ కాదు.. మా బుడ్డోడు వాయుతేజ్ సక్సెస్. ఈ సక్సెస్‌ను వాయు ఖాతాలో వేయాలి. తను మా లక్కీ చార్మ్ అని అన్నారు.

# నాన్‌స్టాప్‌గా నవ్వులు గ్యారెంటీ



## టీజర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో నరేష్


కామెడీ సినిమాలతో ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అల్లరి నరేష్ మరోసారి తనకు బాగా కలిసొచ్చిన జానర్‌లో సందడి చేయబోతున్నారు. ఆయన హీరోగా నటిస్తున్న ఫాంటసీ కామెడీ ఎంటర్‌టైనర్ 'రంభ ఊర్వశి మేనక'. చంద్ర మోహన్ చింతాడ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్లపై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, చార్టబస్టర్‌గా నిలిచిన 'నా కంటి మీద కనులే' పాట సినిమాపై ఆసక్తిని పెంచాయి. తాజాగా మేకర్స్ టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో అల్లరి నరేష్ మాట్లాడుతూ నేను సరైన కామెడీ సినిమా చేసి దాదాపు 10 సంవత్సరాలు అవుతోంది. 'నాంది' తర్వాత కొన్ని సీరియస్ సినిమాలు చేశాను. కాకపోతే నేను కామెడీని ఎప్పుడూ వదల్లేదు. ఒక మంచి స్క్రిప్ట్ కోసం ఎదురుచూస్తున్నాను. చాలా రోజుల తర్వాత చంద్ర మోహన్ వచ్చి ఈ కథ చెప్పారు. అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ సంస్థలతో కలిసి ఈ సినిమా చేయడం మరింత ఆనందాన్ని ఇచ్చింది. నేను చిన్నప్పటి నుంచి నాగార్జునకి పెద్ద అభిమానిని. 'నా సామిరంగ' సినిమాలో ఆయనతో కలిసి నటించాను. ఇప్పుడు ఆయన బ్యానర్‌లో సినిమా చేయడం ఒక అదృష్టంగా భావిస్తున్నాను. దాదాపు పదేళ్లుగా మీరు మిస్ అయ్యారనుకున్న నరేష్ను ఇందులో చూస్తారు. రెండున్నర గంటల పాటు మిమ్మల్ని ఎంటర్‌టైన్ చేయడానికి మేమంతా చాలా కష్టపడ్డాం. చైతన్ భరద్వాజ్ చాలా మంచి పాటలు ఇచ్చారు.ఈ ఈవెం ట్‌లో దర్శకుడు చంద్ర మోహన్ చిం తాడ, నిర్మాత రాజేష్ దండా, హీరోయిన్ రాశి సింగ్, హీరోయిన్ ప్రిష రాజేష్, నటి విష్ణుప్రి య, డైరెక్టర్ చంద్ర మోహన్ , రచయిత నందు, సం గీత దర్శకుడు భరద్వాజ్, ఎడిటర్ చోటా కె. ప్రసాద్ పాల్గొన్నారు.



# యదార్థ ఘటనలతో 'మేరంగి జంక్షన్'

యువన్ టూరింగ్ టాకీస్ పతాకం పై మాస్టర్ దివ్యాన్ష్ సమర్పణలో షకలక శంకర్, సాహితీ దాసరి, వినీత కందాల, సంపత్, ప్రభాకర్, రాధా కోహినూర్ ముఖ్య తారాగణంతో శివ గణేష్ రచన దర్శకత్వం లో రవి కృష్ణ గొల్లు, రాజేష్ గంగునాయుని, పెద్దింటి మోహన రావు, చొక్కపు రాములమ్మ, సీర గణపతి నాయుడు సంయుక్తంగా నిర్మిస్తున్న ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ చిత్రం 'మేరంగి జంక్షన్'. ఒక పాట , ఒక ఫైట్ మినహా టాకీ షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతానికి పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రారంభం అయ్యాయి. 'ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో మేరంగి అనే ఊరిలో జరిగే ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ కథే ఈ 'మేరంగి జంక్షన్'. యదార్థ సంఘటనల సమాహారంగా తెరకెక్కిన ఈ చిత్రం, పూర్తి కొత్త తరహా ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ల స్థాయిలో ప్రేక్షకులను అలరించేవిధంగా ఉంటుంది. షకలక శంకర్ ఏజెన్సీ ఏరియా లో పోలీస్ పాత్రలో నటించారని దర్శకుడు శివ గణేష్ చెప్పారు. ఒక పాట, ఒక ఫైట్ మినహా 47 రోజుల్లో టాకీ రెండు పాటలు పూర్తిచేశాం. అజయ్ పట్నాయక్ సంగీతంలో మేరంగి జంక్షన్ టైటిల్ సాంగ్, నీల వేణి అనే మెలోడీ పాట ప్రేక్షకులను అలరిస్తుంది. అలాగే కిరణ్ చేబ్రోలు సినిమాటోగ్రాఫీ అందించారు. ఈ ఏడాది చివరి మాసంలో చిత్రాన్ని విడుదల సన్నాహాలు చేస్తున్నామని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: పిజె రామ్, డిఒపి: కిరణ్ చేబ్రోలు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కుమార్ చలమల, రచన, దర్శకత్వం: శివ గణేష్.

# జూనియర్ ఎన్టీఆర్‌కు శస్త్రచికిత్స విజయవంతం



జూనియర్ ఎన్టిఆర్ షోల్డర్ కు ఆపరేషన్ విజయవంతంగా ముగిసింది. షోల్డర్ పెయిన్‌తో ఇటీవల కిమ్స్ ఆసుపత్రిలో చేరిన జూనియర్ ఎన్టీఆర్‌కు బుధవారం ఆపరేషన్ నిర్వహించినట్టు వైద్యులు తెలిపారు. జూనియర్ ఎన్టీఆర్ భుజానికి శాస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తయినని వైద్యులు పేర్కొన్నారు. జూనియర్ ఎన్టీఆర్ సురక్షితంగా ఉన్నారని, కోలుకుంటున్నారని కిమ్స్ వైద్యులు పేర్కొన్నారు. ఇటీవల షోల్డర్ నొప్పితో ఆసుపత్రికి చేరిన సంగతి తెలిసిందే. ఎన్టీఆర్‌కు ఆపరేషన్ జరగడంతో ఆయన నటిస్తున్న ప్రశాంత్ నీల్ చిత్రం షూటింగ్‌కు బ్రేక్ పడిందని చెప్పవచ్చు.



## తెలంగాణ గర్వించదగ్గ రైతు కవి గంగుల శాయిరెడ్డి..

రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జె.చిన్నారెడ్డి

**ప్రజాపక్షం/భువనగిరి** : తెలంగాణ ప్రాంతం నుంచి రైతు నేపథ్యంగా గొప్ప కవిత్వం రాసిన ఘనత కాపుబిడ్డ కవి గంగుల శాయిరెడ్డికి దక్కుతుందని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జె.చిన్నారెడ్డి అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో భువనగిరి పరిసర గ్రామం రామకృష్ణా పురంలోని అమేయ కృషి వికాస కేంద్రంలో జరిగిన కాపుబిడ్డ సాహిత్య సమాలోచన వ్యాస సంపుటి ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ ప్రాంతాన్ని సాహిత్యకంగా సురవరం ప్రతాప రెడ్డి లాంటి వాళ్ళు ఎంతో కృషి చేసి గొప్ప గుర్తింపును తెచ్చారు అని అన్నారు. గంగుల శాయిరెడ్డి కవి ఆంధ్ర మహాసభలు నడుస్తున్న కాలంలో రాసుకున్న కవిత్వం కాపుబిడ్డ గా తీసుకు వచ్చారన్నారు.మరుగున పడుతున్న ఇలాంటి సాహిత్యాన్ని సాహిత్య సదస్సులు నిర్వహించి ఇలా ఓ పుస్తకంగా తీసుకురావడం అభినందనీయమన్నారు. ఇందుకు ఆచార్య గంటా జలంధర్ రెడ్డి ని ప్రత్యేకంగా అభినందించారు. ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అమేయ కృషి వికాస కేంద్రం నిర్వాహకులు జిట్టా బాలరెడ్డి, జ్యోతి దంపతులు, భువనగిరి మున్సిపాలిటీ చైర్మన్ తంగెళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజులవెంకటేశ్వర్లు, నాయకులు ప్రమోద్ కుమార్, రమేష్ పాల్గొన్నారు.

## భూములు కోల్పోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సిందే

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం




**ప్రజాపక్షం/నాంపల్లి** : భవిష్యత్‌లో రాబోయే ఫ్యూచర్ సిటీ, బుల్లెట్ రైలు తదితర ప్రాజెక్టుల పేరుతో భూములు కోల్పోతున్న రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు. నాంపల్లి ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల ప్రజా పరిషత్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.మండలంలోని లక్ష్మణపురం ప్రాజెక్టుల పనులు నత్తనడకన సాగుతున్నాయని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆవేదన వ్యక్తం చేశారు.ప్రాజెక్టు పనుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు నష్టపరిహారం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి న్యాయం చేయాలని కోరారు. ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు.అలాగే మండలంలోని గ్రామాల మీదుగా ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీ,బుల్లెట్ రైలు వంటి ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం అందించడంతో పాటు వారి భవిష్యత్‌కు భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.మండలంలోని గ్రామాల్లో తాగు నీటి సమస్యలను మిషన్ భగీరథ అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించి ప్రజలకు నిరంతరం నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డి, నాయబ్ తహసీల్దార్ దోటి వెంకన్న,ఎంపీవో మధు,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జి.వెంకటేశ్వర్లు,ఆర్అండ్‌బీ ఏఈ వికాస్, వ్యవసాయ అధికారి బండారు శివ,ఏపీఎం శోభారాణి,ఐసీడీఎస్ విజయలక్ష్మి,ఏపీవో గుంటుక వెంకటేశ్వర్లు, విద్యుత్ ఏఈ,హౌసింగ్ ఏఈ పాల్గొన్నారు.

## జంట హత్యల కలకలం



**ప్రజాపక్షం/మోతె** : మండల కేంద్ర సమీపంలో భార్యభర్తల హత్య కలకలం సృష్టిస్తుంది. భార్యభర్తలను హత్య చేసి భూమిలో పాతిపెట్టిన సంఘటన చోటుచేసుకుంది. మోతె మండలం భీక్యా తండకు చెందిన హలావత్ నాగు (53), హలావత్ బుబా (46)లు భార్యభర్తలు పొట్టకూటి కోసం మోతె మండల కేంద్రానికి సేద్యం చేసుకుంటూ రెండు సంవత్సరాలుగా మోతె మండల కేంద్రంలో నివాసం ఉంటున్నారు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తల మీద కొట్టి వారిని హత్య చేసి ఇక్కడికి తీసుకువచ్చి పాతిపెట్టినట్లుగా ఆనవాళ్లు ఉన్నట్లు ఎస్పి కె. నరసింహ తెలిపారు. ఉదయాన్నే అటుగా వెళ్తున్న రైతులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మునగాల సిఐ రామకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ లచ్చిరెడ్డి, తహశీల్దార్ యం. వెంకన్నతో కలిసి సంఘటనా స్థలాన్ని చేరుకొని ఆనవాళ్లు గుర్తించారు. పాతిపెట్టిన మృతదేహాలను బయటకు తీసిన అనంతరం అక్కడ ఉన్న తండకు చెందిన వాసులు తమ తండావాసులుగా గుర్తించినట్లు ఎస్పి తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## పాఠశాల ప్రిన్సిపాల్ దారుణ హత్య



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి** : మండల కేంద్రంలోని జేబి కాలనీలో ఉన్న నాగార్జున గ్రామర్ హైస్కూల్ పాఠశాల ప్రిన్సిపాల్ కల్లు రూప రెడ్డి(45) మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో దారుణ హత్యకు గురయ్యారు. పోలీసులు, బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రూప రెడ్డి స్కూల్ పక్కనే తమ సొంత ఇంట్లో ఉంటున్నారు. ఆమెకు భర్త రాజేందర్‌రెడ్డి, బిటెక్ చదువుతున్న కుమారుడు ఉన్నారు. బుధవారం ఉదయం భర్త రాజేందర్‌రెడ్డి హైదరాబాద్ నుండి రూపకు ఎన్ని సార్లు ఫోన్ చేసిన ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో తమ ఇంటి పైన కిరాయికి ఉంటున్న వారికి ఫోన్ చేసి ఇంట్లో చూడమని చెప్పగా వారు వెళ్లి చూడగా అప్పటికే దారుణ హత్యకు గురైనట్లు తెలిపారు. ఇరుగు పొరుగు వారి సమాచారంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి క్లూస్ టీంను రప్పించి పరిశీలించారు. డిఎస్పి శ్రీనివాస్‌రావు సంఘటన స్థలానికి చేరుకొని సిబ్బందితో కలిసి హత్యకు దారితీసిన వివరాలను తెలుసుకున్నారు. ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రధాన ద్వారా మూసి ఉండడం వారికి దగ్గరగా పరిచయం ఉన్న వ్యక్తులే హత్య చేసినట్లు పలువురు అనుమానిస్తున్నారు. ఇంట్లో ఉన్న వస్తువులు ఎలాంటి చోరీకి గురికాకపోవడంతో అనుమానాస్పందంగా ఉంది. గత 30 సంవత్సరాల నుండి మండల కేంద్రంలో పాఠశాల నిర్వహిస్తుండడంతో కొండమల్లేపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. భర్త కల్లు రాజేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎంఎల్‌ఏ బాలునాయక్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రూప రెడ్డి పార్థీవదేహానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కేసును అన్ని కోణాలలో త్వరితగతిన దర్యాప్తు చేసి హంతకులను వెంటనే పట్టుకోవాలని పోలీసులకు సూచించారు.

## నాలుగో కాన్పులో మగ శిశువు.. అంతలోనే విషాదం

ముగ్గురు ఆడపిల్లలు.. నాలుగో కాన్పులో మగ శిశువు..

ఎనిమిది రోజులకే అంతుచిక్కని రీతిలో బాలింత ఆత్మహత్య

నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఘటన



**ప్రజాపక్షం/నల్లగొండ** : ముగ్గురు ఆడపిల్లల తర్వాత నాలుగో కాన్పులో మగ శిశువుకు జన్మనిచ్చింది. కుటుంబంలో సంతోషం వెల్లివిరియాల్సిన వేళ.. ఎనిమిది రోజులకే ఆమె బలవన్మరణానికి పాల్పడటం తీవ్ర విషాదాన్ని నింపింది. నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ ఘటనకు దారితీసిన కారణాలు అంతుచిక్కకుండా మారాయి. మునుగోడు మండలం చీకటిమామిడికి చెందిన గండు మమత (27) ఎనిమిది రోజుల క్రితం నాలుగో కాన్పులో మగ శిశువుకు జన్మనిచ్చింది. ప్రసవం అనంతరం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలోని మెటర్నిటీ వార్డులో చికిత్స పొందుతోంది. అయితే బుధవారం తెల్లవారుజామున ఆసుపత్రి ఆవరణలోని మార్చురీ గది వద్ద ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.మమతకు ఇప్పటికే ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.నాలుగో కాన్పులో మగ శిశువు జన్మించడంతో కుటుంబంలో ఆనందం నెలకొంది. కానీ ఆ ఆనందం ఎనిమిది రోజులు కూడా నిలవకముందే మమత ఆత్మహత్యకు పాల్పడటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. భర్త గండు రమేష్ గ్రామంలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆత్మహత్యకు అసలు కారణం ఏమిటన్నది ప్రస్తుతం మిస్టరీగా మారింది. కుటుంబ సమస్యలా..ఆరోగ్యపరమైన ఇబ్బందులా.. ఆసుపత్రిలో చికిత్సకు సంబంధించిన సమస్యలా..లేక మరేదైనా కారణమా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు దారితీసిన కారణాలను సమగ్రంగా వెలికి తీసి,వాస్తవాలను బయటపెట్టాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

**సిబ్బంది నిర్లక్ష్యమే కారణమా..?**

మెటర్నిటీ వార్డులో ఉండాల్సిన మమత ఆసుపత్రి నుంచి ఒంటరిగా బయటకు వెళ్లే వరకు సిబ్బంది గుర్తించకపోవడంపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ ఘటన చోటుచేసుకుందని ఆరోపించారు.ఆసుపత్రి ఆవరణలోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడినా ఉదయం వరకు గుర్తించకపోవడంపై బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. మెటర్నిటీ వార్డు నుంచి ఎప్పుడు బయటకు వెళ్లింది..ఆసుపత్రి ఆవరణలో ఏ మార్గంలో వెళ్లింది..అనే విషయాలను తెలుసుకునేందుకు సిసి కెమెరా ఫుటేజీ పరిశీలించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఫుటేజీ చూపించకపోవడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మమతకు సరైన వైద్యం అందకపోవడం కూడా ఘటనకు కారణమై ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరా ఫుటేజీతో పాటు ఆసుపత్రిలోని పరిస్థితులు, సిబ్బంది విధుల నిర్వహణ, మమత చివరిసారిగా ఎవరితో మాట్లాడింది తదితర అంశాలపై విచారణ జరిపితే ఘటన వెనుక అసలు కారణాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## కార్పొరేట్ శక్తుల పాలౌతున్న దేశ సంపద





సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్

**ప్రజాపక్షం/చిట్యాల:** కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశ సంపద ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తుల పాలౌతుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ విమర్శించారు. సిపిఐ దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో భాగంగా నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో బుధవారం యాత్రను ప్రారంభించి మాట్లాడారు. నకిరేకల్ నియోజకవర్గంలోని సాగు నీటి సమస్యలను పరిష్కరించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, బివెల్లంల ప్రాజెక్టు, పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాలువల పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ ప్రచార యాత్రలో పార్టీ మండల కార్యదర్శి ఎండి అక్బర్, గీతా పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, నాయకులు వెంపటి శ్రీనివాస్, జిల్లా సత్యం, షేక్ షరీఫ్, బొల్గూరి లింగయ్య, దేవన్న, సీమ అంజయ్య, కేతరాజు అంజయ్య, బొబ్బల శంకర్‌రెడ్డి, బొడిగె బక్కశెట్టి పాల్గొన్నారు.

### ప్రజలపై పన్నుల భారం: మోదీ ప్రభుత్వం గద్దె దిగాలి

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి** : దేశ్ బచావో నరేంద్ర మోదీ హటావో నినాదంతో నిర్వహిస్తున్న ప్రచార జాతా నకిరేకల్ నియోజకవర్గంలో భాగంగా నార్కట్‌పల్లి కి చేరుకుంది. నల్లగొండ చౌరస్తా వద్ద నిర్వహించిన బహిరంగ సభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ దేశంలో మోదీ ప్రభుత్వ ఆదాని,అంబానీలకు దేశ సంపదను కట్టబెడుతున్నారన్నారు. గీతా పనివార్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోడిగె సైదులు, సిపిఐ మండల కార్యదర్శి పెండ్యాల శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ ప్రాంతంలో తీవ్ర కరువు నెలకొందని, దీంతో రైతులు పంటలు వేయలేని పరిస్థితి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎం.డి.అక్బర్,నియోజకవర్గ నాయకులు వెంపటి శ్రీనివాస్,జిల్లా సత్యం,సంగిశెట్టి శ్రీనివాస్,ఆలకుంట్ల నరసింహ,తోడుసు సైదులు,మట్టిపల్లి మల్లయ్య,పులుసాని శ్రీనివాస్ రెడ్డి,ఎస్‌కె నజీర్,శ్రీలోజు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

### నిరంకుశ పాలనకు అంతం తప్పదు : పల్లా దేవేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/చింతపల్లి :** నియంతృత్వ బిజెపి పాలనకు అంతం తప్పదని, కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతినేక విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ 1న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సిపిఐ నల్లగొండ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి తెలిపారు. సిపిఐ ప్రజా చైతన్య యాత్ర బుధవారం మండలంలోని గ్రామాలలో పర్యటిస్తూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ చైతన్య పరిచారు. మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామవత్ అంజయ్య నాయక్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లే నరసింహా, జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, మండల కార్యదర్శి పోలె వెంకటయ్య, సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు డి. సుదర్శన్‌రెడ్డి, ఎస్ కానకాచారి, ఎండి మైనొద్దిన్, పల్లా రంగారెడ్డి పాల్గొన్నారు.





## సాగు, తాగునీటి విషయంలో ఇబ్బందులు రావొద్దు : ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/చందంపేట:** చందంపేట మండల స్థానిక ఎంపిడివో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి సమీక్షా సమావేశంలో దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ హాజరయ్యారు. ఈసందర్భంగా వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో మండలంలోని అభివృద్ధి, ప్రజా సమస్యలపై సమీక్షించారు. గ్రామాల్లో రహదారుల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని ఎంఎల్‌ఏ సూచించారు. గువ్వలగుట్ట, పెద్దమూల, కోరుట్ల, దేవరచర్లతో పాటు పలు గ్రామాల్లో రోడ్ల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సాగు, తాగు నీటి విషయంలో ఎక్కడా ఇబ్బందులు రాకుండాచర్యలు తీసుకోవాలని, మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మండలానికి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా డిండి ప్రాజెక్టు పనులను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే అవకాశం ఉందని ఎంఎల్‌ఏ తెలిపారు. పోలేపల్లిరేకులగడ్డ రహదారికి రూ. 50కోట్లు పోలేపల్లి నుండి రేకులగడ్డ గ్రామం వరకు రహదారి నిర్మాణానికి రూ. 50 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని తర్వలోనే పనులు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. ఈసమావేశంలో డిఎల్‌పివో శంకర్‌నాయక్, ప్రత్యేక అధికారి రవికుమార్, ఎంపిడివో వెంకటేశ్వర్లు, తహశీల్దార్ సత్యనారాయణ, మండల అధ్యక్షులు మల్లారెడ్డి, భద్రనాయక్, గోవింద్, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## యూరియా అక్రమ దందా

గోదాములలో వందల బస్తాలు ఎలా...?

అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం



**ప్రజాపక్షం/కోదాడ :** కోదాడ నియోజక వర్గంలో యూరియా అక్రమదందా జోరుగా సాగుతుంది. రైతులకు అవసరమైన యూరియా సరఫరా చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యూరియా అందుబాటులో లేదని చెప్పే అధికారులు గోదాంలలో వందల బస్తాలు ఏలా నిల్వ ఉంచుతున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని కొంగర గ్రామానికి దాదాపు 200 బస్తాల యూరియాను స్థానిక రైతులకు కాకుండా అక్రమంగా తరలించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. యూరియా కోసం రైతులు గంటల తరబడి దుకాణాల వద్ద, పిఏసిఎస్ కేంద్రాల వద్ద క్యూలు కడుతున్నా వారికి మాత్రం యూరియా అందడం లేదు. యూరియా కోసం ప్రభుత్వం అందుబాటులో తెచ్చిన యాప్‌ను ఆసరగా చేసుకున్న వ్యాపారులు అమాయక రైతులను మోసం చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. యూరియా కృత్రిమ కొరతను సృష్టిస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అధికారులు గోదాంలు, దుకాణాలను తనిఖీలు చేయాలని రైతు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

## 14న తుర్కపల్లి మండలంలో ప్రచార జాత

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** కేంద్రంలోని అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ అనుసరిస్తున్న కార్మిక కర్షక యువజన విద్యార్థి వ్యతిరేక కార్యక్రమాలను నిరసిస్తూ ఈ నెల 14న తుర్కపల్లి మండలంలో జరిగే సిపిఐ ప్రచార జాతను జయప్రదం చేయాలని, భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ పిలుపులో భాగంగా 6 తారీఖు నుండి24 వరకు దేశవ్యాప్తంగా పాదయాత్రలు ప్రచార జాతలు నిర్వహించడం జరుగుతుందని తుర్కపల్లి సీపీఐ మండల కార్యదర్శి దుర్గయ్య పిలుపునిచ్చారు. ఈ ప్రచార జాత కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు మండల నిర్మాణ బాధ్యులు కళ్లెం కృష్ణలు పాల్గొంటారని, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జాతాలను జయప్రదం చేయాలని కోరారు.

## రైతులు వరిసాగు తగ్గించాలి

అదనపు కలెక్టర్ హరిసింగ్

**ప్రజాపక్షం/చివ్వేంల** : వర్షాభావ పరిస్థితులతో రైతులు వరి సాగును తగ్గించుకొని ఆరుతడి పంటలైన కంది, పెసర పంటలను సాగు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బి. హరిసింగ్ అన్నారు. బుధవారం మండలంలోని గుర్రంతండలో రైతులతో మాట పంట మార్పిడి బాట కార్యక్రమంలో భాగంగా రైతులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సాగు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు ముందుకు వెళ్లాలన్నారు. కంది, పెసర, మినుము, జొన్న పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈ పంట సాగుతో దిగుబడి ఎక్కువ వచ్చి లాభాలు కూడా అధికంగా వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ చంద్రశేఖర్, మండల వ్యవసాయ అధికారి డి. వెంకటేశ్వర్లు, బి. శైలజ, గ్రామ పంచాయితీ కార్యదర్శి కిరణ్, సర్పంచ్ ధరావత్ రవీందర్‌తోపాటు రైతులు పాల్గొన్నారు.



## మోడల్ కాలనీ ఇండ్ల పనుల్లో వేగం పెంచండి

అర్హులకే ఇండ్లు ఇస్తాం, లబ్ధిదారుల జాబితా పరిశీలిస్తున్నాం

జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** పట్టణంలోని శ్రీసీతరామచంద్రస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న జి. ప్లస్ వన్ ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, చిన్న చిన్న లోపాలు ఉన్నా వెంటనే రెక్టిపై చేయాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అధికారులను అదేశించారు. ఇండ్ల సముదాయాల్లో మిగిలిపోయిన పనులను యుద్ధ ప్రతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. హుజూర్‌నగర్ రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ కాలనీ ఇండ్లను జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా పారదర్శకంగా పంపిణీ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. ఇటీవల మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అదేశాల మేరకు హౌసింగ్ యూనిట్లలోని ప్రతి బ్లాక్‌ను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇండ్లలో ఉన్న చిన్న చిన్న లోపాలను గుర్తించి వాటి జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ఆ లోపాలను వెంటనే సరిదిద్దాలని సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులకు అదేశాలు ఇచ్చారు. ఇండ్లతో పాటు డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక వసతుల కల్పన పనులను వేగవంతం చేయాలన్నారు. వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను హెచ్చరించారు. అలాగే హుజూర్‌నగర్ మండలంలోని లక్కవరం లో ఆరుతడి పంటలపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, హౌసింగ్ పిడి జబ్బార్, తహసిల్దార్ కవిత, మున్సిపల్ కమిషనర్ సతీష్‌కుమార్, ఎంపిడివో సుమంత్‌రెడ్డి, ఏవో స్వర్ణ సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

## రూ.5,29,99,490 విలువైన ధాన్యం తరుగు

శ్రీ శివదుర్గ రైస్ ఇండస్ట్రీస్...

ఎం/ఎస్ జగన్‌మాత ఫార్‌బాయిల్డ్ రైస్ ఇండస్ట్రీలో

విజిలెన్స్ అధికారుల తనిఖీలు



**ప్రజాపక్షం/చివ్వేంల** : సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ రైస్ మిల్లు వ్యాపారి కాసం జగన్‌కు సంబంధించిన రైస్ మిల్లుల్లో విజిలెన్స్, పౌర సరఫరా అధికారులు తనిఖీ చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... మండల పరిధిలోని బీబీగూడెం సమీపంలో ఉన్న శ్రీ శివదుర్గ రైస్ ఇండస్ట్రీస్, వల్లభాపురం సమీపంలో ఉన్న ఎం/ఎస్ జగన్‌మాత ఫార్‌బాయిల్డ్ రైస్ ఇండస్ట్రీలో విజిలెన్స్ అధికారులు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు చేశారు. శ్రీ శివదుర్గ రైస్ ఇండస్ట్రీలో 2024/25 రబీలో ప్రభుత్వం సిఎంఆర్ కోసం అందించిన వరి ధాన్యం పక్కాగా ఉన్నట్లు లెక్కతేల్చారు. అధికారులు 48827.20 క్వింటాల ధాన్యాన్ని సిఎంఆర్ కోసం అప్పగించగా మిల్లింగ్ చేసి ఇందులో 23942.83 క్వింటాల బియ్యాన్ని ఎఫ్‌సిఐకి అప్పగించడం జరిగింది. మిగతా ధాన్యం 24884.37 (62211.37 బస్తాలు) నిల్వ ఉండాల్సి ఉండగా అంతా సరిగానే ఉన్నట్లు తేల్చారు.

**ఎం/ఎస్ జగన్‌మాత ఫార్‌బాయిల్డ్ రైస్ ఇండస్ట్రీలో...**

వల్లభాపురం సమీపంలో ఉన్న ఎం/ఎస్ జగన్‌మాత ఫార్‌బాయిల్డ్ రైస్ ఇండస్ట్రీలో విజిలెన్స్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీ చేశారు. 202425 రబీ సీజన్‌లో 138832.80 క్వింటాల వరి ధాన్యాన్ని అధికారులు సిఎంఆర్ కోసం అందించగా మిల్లింగ్ చేసి ఇందులో 30390.92 క్వింటాల బియ్యాన్ని ఎఫ్‌సిఐ వారికి సరఫరా చేయడం జరిగింది. ఇదిపోగా 108441.88 క్వింటాల (271104 బస్తాలు) వరి ధాన్యం నిల్వ ఉండాల్సి ఉండగా 90185.08 క్వింటాల (225462 బస్తాలు) ధాన్యం మాత్రమే ఉందని గుర్తించారు. 18256.80 క్వింటాల (45642 బస్తాలు) వరి ధాన్యం తరుగుగా ఉందని తేల్చిన అధికారులు దీని విలువ రూ.5,29,99,490 ఉంటుందని చెప్పారు.

**3 రోజుల డెడ్‌లైన్... చెల్లించకుంటే కేసు నమోదు...**

అధికారులు తేల్చిన లెక్కల ప్రకారం ఎం/ఎస్. జగన్‌మాత ఫార్‌బాయిల్డ్ రైస్ ఇండస్ట్రీలో తరుగుగా ఉన్న 18256.80 క్వింటాల (45642 బస్తాలు) ధాన్యానికి సంబంధించిన రూ.5,29,99,490 లను మూడు (03) రోజుల్లో ప్రభుత్వానికి చెల్లించాలని లేకుంటే కేసు నమోదు చేస్తామని అధికారులు యజమాని కాసం జగన్‌కు నోటీసులు అందజేశారు.

**తరుగున్న ధాన్యానికి పైసా బాకీ లేకుండా ప్రభుత్వానికి చెల్లిస్తా : యజమాని కాసం జగన్**

తనిఖీలో తేలిన తరుగున్న ధాన్యానికి సంబంధించి అధికారుల ఇచ్చిన నోటీసుకు అనుగుణంగా ప్రభుత్వానికి పైసా బాకీ లేకుండా గడువులోపు చెల్లిస్తానని ఇండస్ట్రీ యజమాని కాసం జగన్ చెప్పారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన రైస్ మిల్లుల్లో విజిలెన్స్ అధికారులు దాడులు చేయగా రూ.10కోట్లకు పైగా ధాన్యాన్ని పక్కదోవ పట్టించినట్లు కొన్ని పత్రికల్లో, సోషల్‌మీడియాలో వస్తున్న వార్తల్లో ఎంతమాత్రం వాస్తవం లేదన్నారు. తన శ్రీ శివదుర్గ రైస్ ఇండస్ట్రీస్‌లో అధికారులు తనిఖీలు చేయగా ప్రభుత్వం అప్పగించిన ధాన్యం పక్కాగా నిలువ ఉన్నట్లు తేల్చడం జరిగిందన్నారు. ఎం/ఎస్ జగన్‌మాత ఫార్‌బాయిల్డ్ రైస్ ఇండస్ట్రీలో రూ. 5,29,99,490ల విలువైన ధాన్యం తరుగుగా ఉందని అధికారుల లెక్కలు తేల్చారని చెప్పారు. కొంతమంది పని కట్టుకొని చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దన్నారు. నీతిగా వ్యాపారం చేసుకునే తాను, తన కుటుంబ సభ్యులం మానసిక క్షోభకు గురిచేయడం సరికాదన్నారు.

## పోరాటాలు మరింత ఉధృతం: ఎఐఎస్ఎఫ్



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** అఖిల భారత విద్యార్థి సమాఖ్య హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఎఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వుట్కూరి ప్రణీత్ గౌడ్ జెండాను ఆవిష్కరించి, విద్యార్థి ఉద్యమ ప్రస్థానాన్ని స్మరించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి ఎఐఎస్ఎఫ్ తన పోరాటాలను మరింత ఉధృతం చేస్తుందని తెలిపారు.విద్యార్థుల్లో ఐక్యత, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందిస్తూ, విద్యార్థుల హక్కుల సాధన కోసం సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జక్కుల భాను ప్రసాద్, కొండ చరణ్, జిల్లా సహాయ కార్యదర్శి చిర్ర సాయి చందు, జిల్లా సమితి సభ్యులు కందకట్ల అజయ్, పూర్ణచందర్, రమేష్ పాల్గొన్నా రు.

## ఎల్‌నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు




**ప్రజాపక్షం/నెక్కొండ:** వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి ఎ నాగరాజు సూచించారు. నెక్కొండ మండలం ముదిగొండ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు మాట్లాడుతూ వరిసాగు చేపట్టకుండా ఖాళీగా ఉన్న భూములను బీడుగా ఉంచకుండా తక్కువ నీటి వినియోగంతో సాగు చేయగల పంటలను ఎంచుకోవాలని సూచించారు. కూరగాయలు, బంతిపూలు, పొద్దు తిరుగుడు, జొన్నలు, కందులు, ఆముదం, బొబ్బర్లు, వంటి పంటలకు ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్నందున రైతులు వీటిని సాగు చేసి లాభాలు పొందాలని తెలిపారు. తక్కువ పెట్టుబడి, తక్కువ కాలవ్యవధితో సాగయ్యే సోయాబీన్‌కు మంచి దిగుబడితో పాటు మార్కెట్‌లో ధర లభించే అవకాశం ఉందని వివరించారు. వ్యవసాయశాఖ సూచనలను పాటిస్తూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పున్నం రంగారెడ్డి, ఏఈఓ కె నవీన్, రైతులు బి మధు, దామోదర్, సమ్మయ్య, అశోకరావు, బషీర్, బి రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## చోరీ కేసును ఛేదించిన పోలీసులు

**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండల పరిధిలోని కొండాపూర్ గ్రామంలో మంగళవారం రోజు జరిగిన చోరీ కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. కేసు వివరాలను బుధవారం ఎస్ఐ అశోక్ వెల్లడించారు. మంగళవారం కొండాపూర్ గ్రామానికి చెందిన దానం సమ్మయ్య ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, ప్రత్యేక బృందంతో దర్యాప్తు వేగవంతం చేశారు. పక్కా సమాచారంతో చోరీకి పాల్పడిన అదే గ్రామానికి చెందిన బొట్టు రమణాకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా, అతడు నేరాన్ని అంగీకరించాడు. నిందితుడి నుండి చోరీకి గురైన సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రమణాకర్‌ను అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు అతడికి రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని ఎస్ఐ అశోక్ తెలిపారు. ఫిర్యాదు అందగానే త్వరితగతిన స్పందించి, స్వల్ప వ్యవధిలోనే కేసును ఛేదించి నిందితుడిని పట్టుకున్న ఎస్ఐ అశోక్‌ను, పోలీస్ సిబ్బందిని ఉన్నతాధికారులతో పాటు మండల ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు.

## ఎఐఎస్ఎఫ్ ఉద్యమాల్లో పాల్గొనాలి




**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) 91వ వార్షికోత్సవం మండల ఎఐఎస్ఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో పస్తం పృథ్వీరాజ్ అధ్యక్షతన స్థానిక బస్టాండ్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎఐఎస్ఎఫ్ మాజీ నాయకులు రహ్మతుల్లాహ్ సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం అనేక పోరాటాలు నిర్వహిస్తూ 90 వసంతాలు పూర్తి చేసుకుందన్నారు. విద్యార్థులు ఎఐఎస్ఎఫ్‌లో భాగస్వాములై భవిష్యత్ ఉద్యమాలకు నాంది పలకాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు రంజిత్, రోహిత్, తిరుపతి, నిఖిల్, అర్జున్, సంతోష్, అఫ్రోజ్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్’లో జనగామ రెండో స్థానంలో నిలవడం హర్షణీయం

**ప్రజాపక్షం/జనగామ:** సర్ ప్రక్రియలో తెలంగాణలోనే జనగామ జిల్లా రెండో స్థానంలో ఉండడం హర్షనీయమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి అన్నారు. పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు, ఇన్‌చార్జీలు, మండల కన్వీనర్లు, అధ్యక్షులు, బిఎల్‌ఏలు సర్ ప్రక్రియలో పాల్గొని విజయవంతం చేయడం జరిగిందన్నారు. బుధవారం ధన్వంతి మాట్లాడుతూ జిల్లాలోని కాంగ్రెస్ శ్రేణులు అందరు సమన్వయంతో పనిచేయడం వలనే ఇది సాధ్యమైందన్నారు. రాష్ట్రంలోనే జనగామ జిల్లాను మొదటి స్థానంలో ఉంచాలన్నా రు.

## అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు



**ప్రజాపక్షం/రఘునాథపల్లి :** అక్రమంగా ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ దూదిమెట్ల నరేష్ యాదవ్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని పట్టేశాపూర్ గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా బెల్టు షాపులు నిర్వహిస్తున్న వ్యక్తులను పోలీస్ స్టేషన్కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై నరేష్ హెచ్చరించారు. అనంతరం అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వ్యక్తులను స్థానిక తహసిల్దార్ ఎదుట హాజరుపరచడం జరిగింది. అక్రమ మద్యం విక్రయాలపై పోలీసుల నిరంతర నిఘా కొనసాగుతుందని పోలీసులు తెలిపారు.

# సిఎం పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు

### పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి




**ప్రజాపక్షం/హనుమకొండ :** పరకాల పట్టణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 16న రానున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.బుధవా రం హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, డాక్టర్ సత్యశారదలతో కలిసి రెండు జిల్లాల ఉన్నతాధికారులతో సిఎం పర్యటన ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లు, శాఖల వారీగా చేపడుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన వేదిక ఏర్పాటు, సభా ప్రాంగణం, పా ర్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలు, ప్రజాప్రతినిధుల రాకపోకలు, బారికేడింగ్, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, వైద్య సేవలు, అగ్నిమాపక ఏ ర్పాట్లు, భద్రతా చర్యలు, హెలిప్యాడ్, తదితర అంశాల పై సమగ్రంగా చర్చించారు.సభా ప్రాంగణంలో ప్రజల కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అ న్ని మౌలిక సదుపాయాలను ముందుగానే ఏర్పాటు చే యాలని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లను పోలీస్, రెవెన్యూ, ము న్సిపల్, ఇతర శాఖల అధికారు లు సమన్వయంతో నిర్వహించాలని ఎమ్మెల్యే ఆదేశించా రు. విఐపి రాకపోకలు, ప్రజల ప్రవేశం, అత్యవసర మా ర్గాలకు సంబంధించి స్పష్టమైన ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు క లెక్టర్లు రవి, గణేష్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, జి ల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, హనుమకొండ, వరంగ ల్ జిల్లాల డిఆర్‌డిఒలు, జెడ్‌పి సిఇఒలు, పోలీస్, ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్, మున్సిపల్, వైద్య ఆరోగ్య, వి ద్యుత్, అగ్నిమాపక, ట్రాన్స్‌పోర్ట్, ఇతర సంబంధిత శా ఖల అధికారులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమం



**ప్రజాపక్షం/రఘునాథపల్లి :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న పిలుపునిచ్చారు. బుధవారం సిపిఐ పార్టీ జన చైతన్య యాత్రలో భాగంగా రఘునాథపల్లి మండల కేంద్రంతో పాటు కంచనపల్లి బాణాజీ పేట, నారాయణపురం గ్రామాలలో చేపట్టిన పాదయాత్ర కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు ఏ.శ్రీనివాస్, పాతూరు సుగుణమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు కావటి యాదగిరి, సిపిఐ మండల సహయ కారదర్శి కందుకూరి మల్లేశం, గుండే సుధాకర్, ముప్పిడి ఎల్లయ్య, అశోక్, సుద్దాల శ్రీకాంత్, కందుకూరి శోభన్ బాబు, ఇమ్మానుయేల్, శ్రీశైలం,అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి సంఘం ఆవిర్భావ దినోత్సవం వేడుకలు




**ప్రజాపక్షం/మహబూబాబాద్:** ఈరోజు ఎఐఎస్ఎఫ్ 91 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగాఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మేక వెంకటేష్ అధ్యక్షతన స్థానిక వీరభవన్ లో ఘనంగా జండా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెలుగు శ్రావణ్ కుమార్ పాల్గొని జెండాను ఎగరవేసిన అనంతరం మాట్లాడుతూ ఎఐఎస్ఎఫ్ 1936 ఆగస్టు 12న ఉత్తర్ ప్రదేశ్ రాజధానిలోని లక్నో నగరం బెనారస్ విశ్వవిద్యాలయంలో స్వతంత్ర ఉద్యమంలో విద్యార్థులు ఉద్యమించినప్పటికీ దేశవ్యాప్తంగా జాతీయస్థాయిలో విద్యార్థి సంఘం అవసరమని భావించి ఉత్తరప్రదేశ్ డిగ్రీ విద్యార్థులు ప్రేమ నారాయణ, భార్గవ్ బాబురుద్దీన్ లు కలిసి విద్యార్థి సంఘాన్ని స్థాపించాని తెలిపారు. నాటి నుండి నేటి వరకు విద్యార్థుల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తూ 90 సంవత్సరాలు పూర్తి చేసుకుని 91వ సంవత్సరంలో అడుగుపెడుతున్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. విద్యార్థులందరూ ఏఐఎస్ఎఫ్ జెండా నీడన విద్యార్థుల హక్కులకై చదువుతూ పోరాడు చదువుకై పోరాడు అనే నినాదంతో ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి చిలువేరు వికాస్, రంజిత్, హర్షవర్ధన్, లక్ష్మీకుమార్, ప్రణయ్ ,తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ‘అజర’లో 7 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్‌లోని అజర హాస్పిటల్ గత సంవత్సర కాలంలో 7 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించి వైద్యరంగంలో మరో కీలక మైలురాయిని సాధించింది. కిడ్నీ మార్పిడి అనంతరం రోగులు ఆరోగ్యంగా జీవిస్తూ తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ విజయవంతమైన కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ కార్యక్రమాన్ని సీనియర్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ వెంకటరమణ, సీనియర్ యూరాలజిస్ట్ డాక్టర్ ఉస్కే కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శస్త్రచికిత్సల విజయవంతానికి అనస్థీషియా బృందంలోని డాక్టర్ పంకజ్ కుమార్ సింగ్, డాక్టర్ గణేష్ సురారంతో పాటు మొత్తం ట్రాన్స్‌ప్లాంట్ బృందం అందించిన సేవలు కీలకంగా నిలిచాయి.ఈ సందర్భంగా అజర హాస్పిటల్‌లో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చేయించుకుని విజయవంతంగా కోలుకున్న రోగులు, వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రాన్స్‌ప్లాంట్ చేయించుకున్న రోగులు మీడియాతో మాట్లాడుతూ తమకు ఎదురైన కిడ్నీ సమస్యల సమయంలో అజర హాస్పిటల్ వైద్యులు సరైన మార్గదర్శకత్వం అందించారని తెలిపారు.ట్రాన్స్‌ప్లాంట్‌కు ముందు వైద్యులు తమకు అవసరమైన పరీక్షలు, చికిత్సా విధానం, శస్త్రచికిత్సకు సంబంధించిన అంశాలను వివరించారని చెప్పారు.ట్రాన్స్‌ప్లాంట్ అనంతరం కూడా నిరంతర వైద్య పర్యవేక్షణ, ఫాలో అప్ సేవలు అందుతున్నాయని తెలిపారు. అజర హాస్పిటల్‌లో తమకు అందిన వైద్య సేవలు, వైద్యుల నిపుణత, సిబ్బంది అందించిన సహకారం, చికిత్స సమయంలో అందిన మానసిక ధైర్యం గురించి వారు వివరించారు. కిడ్నీ మార్పిడి అనంతరం తమ ఆరోగ్యంలో వచ్చిన సానుకూల మార్పులను తెలియజేస్తూ తమకు చికిత్స అందించిన డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ ఉస్కే కిరణ్, మొత్తం అజర హాస్పిటల్ బృందానికి రోగులు కృతజ్ఞతలు తెలిపారు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ విజయవంతం కావడంతో తమకు సాధారణ జీవితాన్ని తిరిగి పొందే అవకాశం లభించిందని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విలేఖరుల సమావేశంలో అత్యాధునిక శస్త్రచికిత్సలు కూడా అజర హాస్పిటల్‌లో విజయవంతంగా నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

## ఫీజుల దోపిడీని అరికట్టే వరకూ సమరశీల పోరాటాలు

### ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ సమితి సభ్యుడు పనాస ప్రసాద్



**ప్రజాపక్షం/ వరంగల్ :** ఫీజుల దోపిని అరికట్టే వరకు పాలకులపై సమరశీల పోరాటాలు నిర్వహించాలని ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ సమితి సభ్యులు పనాస ప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం శివనగర్ లోని తమ్మెర భవన్‌లో ఏఐఎస్ఎఫ్ 91వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎఐఎస్ఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించిన పనాస ప్రసాద్ మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటి విద్యార్థి సంఘంగా భారతదేశ స్వతంత్ర పోరాటంలో పాల్గొని బ్రిటిష్ వారిని తరిమికొట్టిన ఘన చరిత్ర కలిగిన సంఘం ఎఐఎస్ఎఫ్ అని అన్నారు. అభివృద్ధి చెందిన అమెరికా లాంటి దేశాల్లో ప్రభుత్వ రంగంలోనే ప్రాథమిక విద్య ఉండగా పేద దేశమైన మనదేశంలో విద్య పూర్తిగా ప్రైవేటు పరం కావడం సహించరానిదన్నారు. గత నెలలో ఢిల్లీ లో జరిగిన విద్యార్థి ఉద్యమం తరహాలో దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించి విద్యను ప్రభుత్వ రంగంలో కొనసాగించే విధంగా పాలకులపై ఉద్యమాలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల శరత్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు స్కూళ్లు కాలేజీలు విచ్చల విడిగా నిబంధనలను ఉల్లంఘిస్తున్నా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారని, ఇప్పటికైనా వెంటనే చర్యలు చేపట్టాలని లేదంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలను తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సాగర్, రేవంత్, నిఖిల్, లక్కీ, కార్తీక్, మహేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## గడువులోగా పనులు పూర్తి

### కలెక్టర్ హేమంత్ సహదేవరావు



**ప్రజాపక్షం/ములుగు:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ నెల 16న ములుగులో జిల్లా లో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. పర్యటన జరిగే ప్రాంతాల్లో పరిశుభ్రతతో పాటు ఆకర్షణీయమైన సుందరీకరణ చేపట్టాలని సూచించారు. బుధవారం జిల్లా ఎస్పి సుధీర్ రా మ్నాథ్ కేకన్‌తో కలిసి కలెక్టర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని హెలిప్యాడ్, గట్టమ్మ వద్ద నిర్మిస్తున్న పై లాన్ పనులను పరిశీలించారు. అనంతరం గ ట్టమ్మ దేవాలయాన్ని సందర్శించి అక్కడ చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. హెలిప్యాడ్ వద్ద బారికేడింగ్, వివిఐపి వేచి ఉండే టెంట్, భద్రతా ఏ ర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పై లాన్ నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, మిగిలిన పనులను నిర్ధేశిత గడువులోగా పూర్తి చేయాల ని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబ ంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ఏ ర్పాట్లు చేయాలని సూచించారు. గట్టమ్మ దేవాల య పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు సుందరీకరణ పనులు చేపట్టాలని, వాహనాల పా ర్కింగ్, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. పర్యటన సందర్భ ంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముం దస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టరేట్ ఆవరణలో నిర్మిస్తున్న పైలాన్ పనులను పరిశీలిం చి వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశ మందిరం, స్టేట్ బోర్డు ఛాంబర్, జిల్లా కలెక్టర్ ఛాంబర్‌తో పాటు వివిధ కార్యాలయ గదులను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి కార్యాలయాలు, పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, అర్‌డిఓ కృష్ణవేణి, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, డీఎస్పి రవీందర్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి శాఖల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ములుగు తహసీల్దారు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సిపిఐ ప్రజా చైతన్య యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/మరిపెడ:** సిపిఐ అధ్వర్యంలో నిర్వహించే ప్రజాచైతన్య యాత్ర పోస్టర్‌ను బుధవారం మరిపెడ మండల కేంద్ర ంలో మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ అవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభు త్వం గత దశాబ్ద కాలంగా దేశాన్ని పాలిస్తూ అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూన్న బిజెపి ప్రభుత్వన్ని రానున్న ఎన్నిక ల్లో గద్దె దించాలనీ,దేశా ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తూ,ధ రల పెరుగుదలను కట్టడి చేయకూండా,నిత్యవసర వస్తువుల పెరుగుద ల నియంత్రించక పోవడంతో ఆర్థిక మాంధ్యంపెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనీ,ప్రజలకు వివరించడం కోసం క్షే త్రస్థాయిలో నేడు సిపిఐ పార్టీ మరిపెడ మండల సమితి ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వాహించడం జరుగుతుందనీ,ఈ యా త్ర మరిపెడ మండల కేంద్రంలో ప్రారంభమై మండల పరిధిలోని గిరిపురం,వెంకంపాడు,బావోజీగూడెం,ఆనేపురం,నీలికుర్తి గ్రామలలో కోనసాగుతుందనీ అన్నారు.రైతులు,విద్యార్థులు,నిరుద్యోగులు,కార్మికులు,యువకులు,మహిళలు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గోని విజయవంతం చేయలనీ పిలు పు నిచ్చారు.సిపిఐ జిల్లా సభ్యులు ఎండి అబ్దుల్ రషిద్,రాజేష్,నాగేష్,వెంకన్న, పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే నాగరాజు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ /వరంగల్ టౌన్ :** వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపిఎస్ అధికారి కెఆర్ నాగరాజు 56వ డివిజన్లో బుధవారం పర్యటించారు.56వ డివిజన్ లోని వివేక నగర్,జవహర్ కాలనీ,పరిమళ కాలనీ, శ్రీ సాయి నగర్ కాలనీలలో సుమారు 3.85కోట్ల నిధులతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు,సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తామని, ప్రతి సమస్యను దశలవారీగా పరిష్కరిస్తామని అన్నారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి డివిజన్లో అభివృద్ధి కార్యక్రమాలను దశలవారీగా అమలు చేస్తూ డివిజన్ల రూపురేఖలను మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం గోపాలపురం జంక్షన్ లోని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటుకు కాలనీ వాసులకు గతంలో ఎమ్మెల్యేని కలిసి సహాయం కోరడంతో వారికి బుధవారం ఎమ్మెల్యే 2.5లక్షల రూపాయలను వారికి అందజేశారు.ఈ కార్యక్రమంలో 56వ డివిజన్ అధ్యక్షులు కొంకా హరిబాబు, ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ కందుకూరి పూర్ణచందర్,కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శి దూలం సదానందం,సీనియర్ నాయకులు ,డివిజన్ మహిళా అధ్యక్షురాలు శనిగరపు అనిత,మహిళ నాయకురాలు పల్లకొండ సరోజన,గుగులోతు స్వరూప,అన్న విజయ, యూత్ నాయకులు లావుడియా రవి నాయక్, పాలకొండ విజయ్ సూర్య, ఇమ్మడి రాజీవ్,సుందర్, రామకృష్ణ,సందీప్ ప్రేమ్ సాగర్,మహమ్మద్ రియాజ్, కిషోర్,గొల్లపల్లి చిరంజీవి, రవి,వంశీ,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా మహిళా శక్తి చీరలు మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక



ఇందిరా మహిళా శక్తి చీరలు రాష్ట్రంలోని మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తున్నాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. బుధవారం గ్రేటర్ వరంగల్ 43వ డివిజన్లోని మహిళలకు మమునూరులోని హెచ్‌ఆర్‌ఎస్ గార్డెన్స్ లో ఇందిర మహిళా శక్తి చీరాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పథకం అమలులో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. మహిళల సంక్షేమం,ఆర్థిక స్వావలంబన,సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలను మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి మహిళకు ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో 43వ డివిజన్ అధ్యక్షులు రాజ్ కుమార్,మాజీ కార్పొరేటర్ అరుణ విక్టర్,జిల్లా కార్యదర్శి కొమురవెల్లి యాదవ్,కార్యదర్శి ప్రకాష్,మాజీ జెడ్పిటిసి నరేందర్ రెడ్డి,సీనియర్ నాయకులు బాబురావు,అరుణ, శివ కుమార్,రవీందర్,పెద్ద భాస్కర్,సుదాకర్,రమేష్‌పాల్గొన్నారు.

## విద్యా వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడాలి



**ప్రజాపక్షం/ఖిలావరంగల్:** ప్రభుత్వ విద్య పరిరక్షణకు, నూతన జాతీయ విద్య విధానానికి వ్యతిరేకంగా విద్యార్థులు సమరశీల పోరాటాలు నిర్వహించాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ఎ స్టాలిన్ పిలుపునిచ్చారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే మార్గమని పేర్కొన్నారు. ఎఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఖిలా వరంగల్ రంగశాయిపేటలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జిల్లా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ఎ స్టాలిన్, తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేమిడి మల్లారెడ్డితో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరంఎఐఎస్ఎఫ్ శ్వేత అరుణ పతాకాన్ని ఎగురవేశారు. జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్టాలిన్ మాట్లాడుతూ భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలనే లక్ష్యంతో బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడేందుకు 1936 ఆగస్టు 12న ఎఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతో మంది విద్యార్థులు త్యాగాలు చేశారని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం అనంతరం ప్రభుత్వ విద్య పరిరక్షణ, శాస్త్రీయ విద్య, కామన్ విద్యా విధానాల అమలుకు ఎఐఎస్ఎఫ్ నిరంతరం పోరాడుతోందన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కుల ఉద్యమం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, మలిదశ తెలంగాణ ఉద్యమంతో పాటు18 ఏళ్లకే ఓటు హక్కు, విద్యార్థుల హాస్టళ్ల సమస్యలు, విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఎఐఎస్ఎఫ్ అనేక ఉద్యమాలు నిర్వహించి విజయాలు సాధించిందన్నారు. గల్లీ నుండి ఢిల్లీ వరకు విద్యార్థుల సమస్యలపై చదువు..పోరాడు నినాదంతో ఉద్యమాలు కొనసాగిస్తున్న సంఘంగా ఏఐఎస్ఎఫ్‌కు ప్రత్యేక చరిత్ర ఉందన్నారు. నేటి పాలకులు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై విద్యార్థులు ఐక్యంగా పోరాడాలని స్టాలిన్ కోరారు. అందరికి ఉచిత, నాణ్యమైన, సమాన విద్య, వైద్యం అందించడంతో పాటు ప్రభుత్వ విద్యను పరిరక్షించాలని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సామాజిక, సాంస్కృతిక ఆధిపత్య భావజాలానికి వ్యతిరేకంగ,ఆ ఆర్థిక సమానత్వం కోసం, రాజకీయాల్లో నైతిక విలువల పరిరక్షణకు విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అసమానతలకు దారి తీసే నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేమిడి మల్లారెడ్డి, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్, జిల్లా ఉపాధ్యక్షుడు ఇస్సంపెల్లి సాగర్, నాయకులు చిర్ర రేవంత్, కడమంచి నిఖిల్, కంజర్ల లక్కీ, పొలబోయిన కార్తీక్, స్వర్ణ తేజ, బి రోజా,నాగజ్యోతి, కీర్తన, ప్రియాంక, పాల్గొన్నారు.

"దేశంలో పెరుగుతున్న అధిక ధరలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ధరలను అదుపు చేయడంలో బిజెపి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందారని సిపిఐ నాయకులు ఆరోపించారు. సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు జరుగుతున్న ప్రజా పాదయాత్రల్లో సిపిఐ నాయకులు మాట్లాడుతూ ధరలు నియంత్రించలేని ప్రధాని మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు."


సిద్దిపేట జిల్లా కోహెడలో...



భద్రాద్రి జిల్లా అశ్వారావుపేటలో...



భద్రాద్రి జిల్లా ఏన్కూర్‌లో...


ఖైరతాబాద్ జుబ్లీహిల్స్‌లో...


నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండలో...


భద్రాద్రి జిల్లా ములకలపల్లిలో...


మహబూబాబాద్‌లో...


నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లిలో..


పెద్దపల్లి జిల్లాలో...


వరంగల్ జిల్లా నెక్కొండలో...


వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో..


జగిత్యాల జిల్లా కోరుట్లలో...

# ధరలు నియంత్రించటంలో మోదీ సర్కార్ వైఫల్యం

**ప్రజాపక్షం / విలేకరుల బృందం**

దేశంలో పెరుగుతున్న అధిక ధరలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ధరలను నియంత్రించటంలో ప్రధాని నరేంద్రమోదీ పూర్తిగా వైఫల్యం చెందారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డిజిల్, వ్యవసాయ ఎరువులు, వంటగ్యాస్ ధరలను పెంచడాన్ని నిరసిస్తూ సిపిఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపుమేరకు సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని వింజపల్లి, నారాయణపూర్, గొట్టమిట్ట, తీగుల గుంటపల్లి ,కోహెడ, సముద్రాల గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. కోహెడ మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి, ఎఐఎస్ఎఫ్ 91 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఎఐఎస్ఎఫ్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కనుకుంట్ల శంకర్, జాగిరి సత్యనారాయణ. గడిపే మల్లేశ్, కిష్టపురం లక్ష్మణ్, గూడ పద్మ, జనగాం రాజ్‌కుమార్.వేల్పుల శ్రీనివాస్, బెక్కంటి సంపత్, బోనగిరి శంకర్, చిట్యాల శేఖర్. గరిపల్లి రవీందర్, మహేందర్‌రెడ్డి. లింగయ్య, మల్లయ్య, సురేష్, కందుకూరి మహేశ్. మనోజ్, అఖిల్,అనిల్. సాగర్ పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై పోరు

కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సిపిఐ చేపట్టిన ప్రజా చైతన్య యాత్రల ముగింపు బహిరంగ సభ బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో జరిగింది. ఈ సందర్భంగా అశ్వారావుపేట పులివెందులలో యాత్రకు ఘనంగా స్వాగతం పలికారు. పట్టణంలోని ప్రధాన సెంటర్ల మీదుగా భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో భాగం హేమంతరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై పోరు తీవ్రతరం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, మేయర్ మూడ్ గణేష్, నాయకులు సరిరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మి కుమారి, నరాటి ప్రసాద్, చంద్ర నరేంద్ర కుమార్, చంద్రగిరి శ్రీనివాస రావు, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, మువ్వా వెంకటేశ్వర్లు, కందుల భాస్కర్, ఎస్‌కె.ఫహీం, భూక్యా శ్రీనివాస్, వరక అజిత్, వేము కొండల రావు, నిమ్మల రాంబాబు, రత్నకుమారి, విజయ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మోదీ విధానాలతో దేశం అప్పుల ఊబిలోకి

కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విధానాలతో దేశం అప్పుల ఊబిలోరి కూరుకుపోతుందని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు విమర్శించారు. సిపిఐ ప్రజా చైతన్య యాత్ర బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏన్కూరు మండలంలోని మూలపోచారాం, రామ్‌నగర్‌తండా, తిమ్మారావు పేట, రాఘవపురం, టీఎల్‌పేట, ఏన్కూరు, జన్నారం, నూకలంపాడు గ్రామాల్లో సాగింది. యాత్రకు ప్రజలు, గిరిజన మహిళలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి ఎర్రబాబు, ఏపూరి లతాదేవి, సింగు నరసింహారావు, పోటు కళావతి, జాగర్లమూడి రంజిత్‌కుమార్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బత్తినేని నీరజ, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బానోత్ రాంబాబు, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి**

## ట్రంప్ ముందు మోకరిల్లిన మోదీని సాగనంపుదాం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందు మోకరిల్లుతున్న ప్రధాని మోదీని సాగనంపుదామని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహా పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ ఖైరతాబాద్ నియోజకవర్గంలో జూబ్లీహిల్స్ డివిజన్‌లో సిపిఐ ఆధ్వర్యంలో ఫిలింనగర్ మీదుగా గురుబ్రహ్మనగర్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఖైరతాబాద్ నియోజకవర్గ కార్యదర్శి మామిడి చెట్ల వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన పాదయాత్రలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, నాయకులు ఎన్.నరసింహ, సునీత, కొమురెల్లి బాబు కళ్యాణ్, భగత్ సింగ్, భీమేష్, బాలరాజు, తిరుపతి, చంద్రకళ, జి.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ధరల పెరుగుదలను అరికట్టలేని ప్రధాని




ధరల పెరుగుదలను అరికట్టలేని ప్రధాని మోదీ రాజీనామా చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల్ నరసింహ డిమాండ్ చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార ప్రచారయాత్రను నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండల కేంద్రంలో బాలనరసింహ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ శ్రీనివాసులు, పులిజాల పరశురాములు, ఏసారపు అశోక్, నల్ల జంగయ్య, కొండల్, చింతపల్లి అశోక్, శంకరయ్య, మర్రిపల్లి శేఖర్, జెల్ల బాలయ్య, టైగర్ సత్యం, విష్ణువర్ధన్ రెడ్డి, కుడుముల వెంకటయ్య, దేశం సైదులు, శివుడు,జోగు సైదులు, బుర్రె చిన్న అంజయ్య, అర్జునయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల సాగుభూములకు పట్టాలు మంజూరు చేయాలి

గిరిజనుల సాగుభూములకు పట్టాలు మంజూరు చేయాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా డిమాండ్ చేశారు. సిపిఐ చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర చివరిరోజు జిల్లాలోని ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట మండలాల మీదుగా సాగింది. యాత్రకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, మేయర్ మూడ్ గణేష్, నాయకులు సరిరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మి కుమారి, నరాటి ప్రసాద్, చంద్ర నరేంద్ర కుమార్, చంద్రగిరి శ్రీనివాసరావు, సాలిగంటి శ్రీనివాస్ కంచర్ల జమాలయ్య, వీసంశెట్టి పూర్ణచంద్రరావు ఉప్పుశెట్టి రాహుల్, కందుల భాస్కర్, ఎస్‌కె ఫహీం, భూక్యా శ్రీనివాస్, వరక అజిత్, వేము కొండల రావు, విజయ్, రామకృష్ణ, నిమ్మల రాంబాబు, కాటూరి రాము, రత్నకుమారి పాల్గొన్నారు.

## అన్నివర్గాల ప్రజలపై ధరాభారం

అన్ని వర్గాల ప్రజలపై ధరాభారం మోపుతున్న బిజెపిని ప్రజలు మార్చాలని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. సిపిఐ జాతీయ సమితి పిలుపుమేరకు జన చైతన్య ప్రచార యాత్ర బుధవారం జిల్లా కేంద్రంలోని కొత్త బజార్, పాత బజార్లలో సాగింది. అమరజీవి ధర్మన్న స్థూపం వద్ద యాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథిరెడ్డి, నాయకులు పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, కట్లోజు పాండురంగ చారి, తండ సందీప్, వీరవెల్లి రవి, వెలుగు శ్రవణ్ ,మేక వీరన్న, కేదాసు రమేష్ ,ఎండి మహమూద్, కూరాకుల పాల్ తదితరులు పాల్గొన్నారు.

## మతోన్మాదం తీవ్రవాదం కన్నా ప్రమాదకరం

దేశంలో బిజెపి ప్రభుత్వం మతాలు, కులాల మధ్య విభజన రేఖలు గీస్తూ పాలన చేస్తున్నారని, మతోన్మాదం తీవ్రవాదం కన్నా ప్రమాదకరమైనదని సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్ అన్నారు. సిపిఐ పాదయాత్రలో భాగంగా ఏడవరోజు పెంట్లవెల్లి మండలంలో ప్రారంభమై మాధవస్వామి నగర్, మంచాలకట్ట, మల్లేశ్వరం, సోమశిల, రాంపురం, మీదుగా కల్వకోల్ గ్రామానికి చేరింది. కార్యక్రమంలో నాయకులు తుమ్మల శివుడు, బండి లక్ష్మీపతి, బిజ్జ శ్రీనివాసులు, తప్పెట కిరణ్ కుమార్, జి.కురుమయ్య, జిల్లా సిపిఐ నాయకులు బాలపీర్ చందు, సలేశ్వరం, రాముడు, రామకృష్ణ, విష్ణు, వెంకటస్వామి, చేపల శేఖర్, జంగం శివుడు, స్వామి, బీరయ్య, హుస్సేన్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి హటావో దేశ్ బచావో

బిజెపి హటావో దేశ్ బచావో నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో కేంద్రంలోని ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దెదించాలని సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పిలుపునిచ్చారు. బుధవారం సిపిఐ ప్రజా చైతన్య యాత్రను రామగుండంలో ఐబి నగర్ సిపిఐ జెండా వద్ద సదానందం సిపిఐ జెండా ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు గోశిక మోహన్, గౌతమ్ గోవర్ధన్, కె.కనకరాజ్, తాళ్లపల్లి మల్లయ్య, ఓదమ్మ, శనిగరపు చంద్రశేఖర్, అన్నం లక్ష్మీనారాయణ, ఎజ్జ రాజయ్య, రాణవేణి సుధీర్, బంగారం చంద్రయ్య, కలువల జగన్, ఆశాల రమ, బూడిది మల్లేష్, పోతురాజు నాగరాజు, కళ్ళపెల్లి నవీన్,ఆసాల నవీన్ పాల్గొన్నారు.

## రైతు పంటకు చట్టబద్ధ ధర హామీ ఇవ్వాలి

రైతు పండించిన ప్రతి పంటకు స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు కనీస మద్దతు ధర నిర్ణయించి, దానికి చట్టబద్ధ హామీ కల్పించాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్మియా డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సిపిఐ చేపట్టిన పాదయాత్ర వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో కొనసాగింది. కార్యక్రమంలో కందిక చెన్నకేశవులు, దండు లక్ష్మణ్, వలివుల్లా ఖాద్రి, ఈదునూరి యాకయ్య, సింగం ప్రశాంత్, గన్నారపు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## మార్పు కోసమే సిపిఐ పాదయాత్ర

ప్రజా వ్యతిరేక పాలనతో బిజెపి రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తుందని, దేశంలో మార్పు తీసుకురావడానికి సిపిఐ పాదయాత్ర నిర్వహిస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్ అన్నారు. కొడంగల్‌లో సిపిఐ ఆధ్వర్యంలో లాహోటి కాలనీ నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా వినాయక చౌరస్తా వరకు పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రలో సిపిఐ కొడంగల్ నియోజకవర్గ కార్యదర్శి గంటి సురేష్‌కుమార్, సహాయ కార్యదర్శి పీర్ మొహ్మద్, నాయ్కులు వెంకటేష్, సావిత్రి, చంద్రయ్య, ఇలియజ్, రాజు నాయక్, హుస్సేన్, ఆంజనేయులు, సాయప్ప, శంకరనాయక్, హనుమంతు, తులసి రామ్ నాయక్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.


జనగాం జిల్లా స్టేషన్‌ఘనపూర్‌లో


మహబూబ్‌నగర్ జిల్లా బాలనగర్‌లో

## ఇచ్చిన హామీలు అమలు చేయాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిపిఐ జగిత్యాల జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గం ఐలాపూర్, యూసుఫ్ నగర్, ఏఖిన్‌పూర్ గ్రామాలో సిపిఐ ప్రచార జాత జరిగింది. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, నాయకులు ఎండి మౌలానా, మల్లాపూర్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## దేశాన్ని దోచుకుంటున్న మోదీ గద్దె దిగాలి

దేశాన్ని దోచుకుంటున్న మోదీ వెంటనే గద్దె దిగిపోవాలని మాజీ ఎమ్మెల్యే, సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి డిమాండ్ చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాతా బుధవారం జనగామ జిల్లాలోని స్టేషన్ ఘనపూర్, చిల్పూర్, తరగొప్పుల, నర్మెట మండలాల మీదుగా రఘునాథపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా పలు చోట్ల జరిగిన సభల్లో రాజారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పాతూరి సుగుణమ్మ, ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, పాతూరి ప్రశాంత్, కావటి యాదగిరి, గుగులోతు సఖి తదితరురు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలపై పోరాటమే లక్ష్యం

ప్రజాసమస్యలపై పోరాటమే సిపిఐ లక్ష్యమని పార్టీ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ పేర్కొన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్ర మహబూబ్‌నగర్ జిల్లా బాల్‌నగర్‌కు చేరుకుంది. పాదయాత్రలో సిపిఐ మండల కార్యదర్శి అల్వాల్‌రెడ్డి, నాయకులు గోవర్ధన్, రాము, బి.మహేష్‌బాబు, సత్యనారాయణరెడ్డి, ఎం.ఆంజనేయులు, జంగయ్య, భార్గవి, ఇందిర, అంజమ్మ, శ్రీలత, కె.బాలయ్య, బాల్‌నర్సయ్య, బసవరాజ్, బాష తదితరులు పాల్గొన్నారు.

# మేధస్సు దొంగిలిస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారని, గోద్రా లాంటి సంఘటనలు వరుసగా చూస్తే దేశంలో గుండాయిజం, రౌడీయిజం చేస్తున్న నాయకులు మోదీ, ఉప నాయకుడు అమిత్ షా అని పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించడానికి ఈనెల 6 నుంచి 14 వరకు దేశవ్యాప్తంగా పాదయాత్రలు, ప్రజా చైతన్యయాత్రను, ప్రచారజాతాలు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కరీంనగర్ జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రచార జాతా ఏడవ రోజున బుధవారం జమ్మికుంట పట్టణంకు చేరుకుంది. అక్కడ ప్రచార ర్యాలీ నిర్వహించిన అనంతరం గాంధీ విగ్రహం చౌరస్తా వద్ద సభ జరిగింది. జాతాకు ముఖ్య అతిథిదిగా కూనంనేని సాంబశివరావు హాజరవ్వగా, సిపిఐ రాష్ట్ర



సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాస్‌రావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్, కరీంనగర్, హన్మకొండ జిల్లాల కార్యదర్శులు పంజాల శ్రీనివాస్, కర్రె భిక్షపతి పాల్గొన్నారు. సభలో కూనంనేని మాట్లాడుతూ దేశాన్ని భ్రష్టుపట్టించిన నరేంద్ర మోదీ పాలన నుంచి ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. దేశ పరిపాలనకు నాయకత్వం వహిస్తున్న మోదీ నుంచి మార్పు కోరుకోవాలని అధికారం శాశ్వతమని కలలు కంటున్న మోదీకి అది కలగానే మిగిలిపోక తప్పదని హెచ్చరించారు. నీట్ పేపర్ లీకేజీపై ఢిల్లీలో విద్యార్థులు చేస్తున్న నిరసను చిన్నచూపు చూసిన మోదీ వారి పోరాట పటిమను చూసి క్షమాపణ చెప్పక తప్పలేదన్నారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా రాజీనామా చేయక తప్పలేదు. ప్రజల విరాళాలతో అయోధ్యలో రామ మందిరం నిర్మిస్తే అందులో 70 సార్లు దొంగలు పడ్డారని వారిని బయటకు ఎందుకు తీయడం లేదని ప్రశ్నించారు. అందులో ఉన్నది బిజెపి నాయకులు కాబట్టే పట్టించుకోవడం లేదని దమ్ముంటే దొంగతనం చేసింది వీరు అని బయటపెట్టగలరా అని నిలదీశారు. కార్మికుల శ్రమను దోచుకుంటూ చాలీచాలని వేతనాలు ఇస్తూ వారిని బానిసుగా మారుస్తున్నారని వారి శ్రమతో అదానీ, అంబానీలు లాభాలు కూడగట్టుకుంటున్నారని దేశంలో ఆస్తిలో, సంపదలో ఎన్నడూ లేనివిధంగా వ్యత్యాసం కనబడుతుందని విమర్శించారు. ప్రజల సొమ్మును రైతుల కష్టాన్ని దోచుకునే దొంగలు అదానీ, అంబానీలైతే వారికి నాయకుడెవరంటె ప్రధాని నరేంద్ర మోదీ అని చెప్పకతప్పదన్నారు. రైతులు పంటలకు మద్దతు ధర ఇచ్చే అధికారం రాష్ట్రాలకు లేదని, కార్మిక చట్టాలను మార్చే అధికారం లేదని, పని గంటలు ఉండేవని వాటిని కూడా మార్చడానికి కేంద్రం తీసుకుందని ఇలా అన్ని రంగాల వారి హక్కులను గుప్పిట్లో పెట్టుకొని ఆటలాడుతుందని, అందుకే బిజెపి పాలనను ప్రభుత్వాన్ని మార్చాలని సిపిఐ దేశవ్యాప్తంగా పిలుపునిచ్చిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, పొనగంటి కేదారి, గజ్జి అయిలయ్య, గూడెం లక్ష్మి, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, బోయిని అశోక్, నాగెల్లి లక్ష్మారెడ్డి, కొయ్యడ సృజన్ కుమార్, బత్తుల బాబు, పిట్టల సమ్మయ్య, న్యాలపట్ల రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బీర్ల పద్మ, కొట్టె అంజలి, బండ రాజిరెడ్డి, పైడిపల్లి రాజు, ఇజ్జగిరి రాంగోపాల్, మాదారపు రత్నాకర్, ధర్మల రామూర్తి, రామరపు వెంకటేశ్, పోలోజు రంజిత్, కసిబోజుల సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com